అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 31-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 243 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

గోరఖ్‌పూర్‌లో ఆగని చావులు




72 గంటల్లో 61 మంది పసికందుల మృతి

గోరఖ్‌పూర్ : ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి దాదాపు 70 మంది పసికందుల మృతితో వార్తల్లోకెక్కిన ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో మృత్యుగోస ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా 72 గంటల్లో 61 మంది పసికందులు చనిపోయారు. బాబా రాఘవ్ దాస్ మెడికల్ కాలేజ్ (బీఆర్‌డీ)లో గత 24 గంటల్లో 19 మంది నవజాత శిశువులు కన్నుమూశారు. ఇందులో నలుగురు మెదడువాపు వ్యాధితో మృతిచెందగా, మిగిలిన వారంతా నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోని పిల్లలేనని తెలుస్తోంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నియోజకవర్గంలో ఉన్న ఆ ఆస్పత్రికి నేపాల్, పక్క రాష్ట్రం బీహార్, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వర్షాలు, వరదల కారణంగా పరిస్థితి మరింత విషమంగా మారిందని మెదడువాపువ్యాధికి సంబంధించిన వార్డు డాక్టర్ చెప్పారు. 'తూర్పు ఉత్తరప్రదేశ్, నేపాల్, బీహార్ తదితర ప్రాంతాల నుంచి రోగులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. వరదల ...9లో

కనేది మీరు.. బాధ్యత మాదా?

యోగి వివాదాస్పద వ్యాఖ్యలు 9లో



నల్లడబ్బు జాడేదీ!

తుస్సుమన్న పెద్దనోట్ల రద్దు

99% రద్దైన నోట్లు తిరిగి ఆర్‌బీఐ గూటికి

- పెద్దగా వెలుగులోకే రాని నకిలీ నోట్లు
- దర్జాగా 'రంగు' మారిన పెద్దల నల్లధనం
- కొత్త నోట్ల ముద్రణకు రూ.8,000 కోట్లు వృథా
- ఊపందుకోని డిజిటల్ కరెన్సీ చలామణి
- కేవలం 20 శాతమే తగ్గిన నోట్ల వాడకం

సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నోట్ల రద్దు ప్రక్రియ అనుకున్న లక్ష్యాలను అందుకోవడంలో తుస్సుమన్నట్టే కనిపిస్తోంది. రద్దు నిర్ణయంతో భారీగా చీకట్లో దాగిన చాలా సొమ్ము తిరిగి వ్యవస్థలోకి వచ్చి చేరుతుందని సర్కారు భావించింది. దీనికి తోడు భారీగా నకిలీ కరెన్సీ వెలుగులోకి వస్తుందని.. డిజిటల్ చెల్లింపుల వైపు ప్రజలు మొగ్గు చూపుతారని భావిస్తూ వచ్చింది. అయితే ప్రభుత్వం అంచనాలు దాదాపు తారుమారైనట్టే కనిపిస్తోంది.





న్యూఢిల్లీ: ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో రద్దు చేసిన పెద్దనోట్లలో దాదాపు 99 శాతం మేర కరెన్సీ తిరిగి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గూటికి చేరుకున్నాయి. అంటే.. ప్రభుత్వం ఎన్ని నోట్లనైతే రద్దు చేసిందో అవన్ని దాదాపుగా తిరిగి ఆర్‌బీఐ గూటికే వచ్చి పడ్డాయన్నట్టు. దేశంలో భారీగా నల్లధనం చలామణి అవుతూ వస్తోందని సర్కారు చెప్పుకొచ్చింది. నోట్ల రద్దుతో భారీ మొత్తంలో ఉన్న ఆ నగదు మొత్తాన్ని జల్లెడ పట్టొచ్చని సర్కారు భావించింది. అయితే సర్కారు అంచనా లెక్క తప్పింది. సర్కారు ఎన్నైతే నోట్లను రద్దు చేసిందో అన్ని నోట్లలో దాదాపు 99 శాతం తిరిగి తమ వద్దకు చేరినట్టుగా ఆర్‌బీఐ బుధవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. పెద్దనోట్ల రద్దు చేపట్టిన నాటి నుంచి 2017 జూన్ 30 నాటికి రూ.15.28 లక్షల కోట్ల విలువైన రద్దు నోట్లు ఆర్‌బీఐకి వచ్చి ...9లో

పారదర్శకంగా సర్వే

రైతులకు ఎలాంటి నష్టం జరగొద్దు: సీఎం కేసీఆర్ ఆదేశం

- తహసీల్దార్లతోనూ భేటీ ..రెవెన్యూ సమీక్షలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రైతులకు ఎలాంటి హాని జరగకుండా పారదర్శకంగా భూరికార్డుల ప్రక్షాళన జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. లెక్కలన్ని సవరించిన తరువాత రైతుల భూముల వివరాలకు సంబంధించిన తుది జాబితాపై గ్రామంలోని రైతులందరి సంతకాలు తీసుకుని బహిర్గతం చేయాలని సూచించారు. సులభంగా, సరళంగా, పారదర్శకంగా రైతులకు అర్థమయ్యేరీతిలో జరగాలని, ప్రక్షాళనలో భాగంగా తొలుత ఏలాంటి చిక్కులు, సమస్యలు లేని సుమారు 95 శాతానికి సంబంధించి వివరాలు ఖరారు చేయాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో భూరికార్డుల సరళీకరణ, ప్రక్షాళనపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి కేటీఆర్, మేయర్ బొంతు రామ్మోహన్, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మెన్ దామోదర్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, భూరికార్డుల ప్రక్షాళన మిషన్ డైరెక్టర్ కరుణ, కలెక్టర్లు రఘునందన్‌రావు, వెంకట్రామిరెడ్డి తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ భూరికార్డుల ప్రక్షాళనతో ఏ రైతుకూ నష్టం ...9లో



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- బేస్ క్యాంపు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు..!
- డీఎఫ్‌ఓ కార్యాలయం ఎదుట సిబ్బంది ఆందోళన 9లో

కౌంటర్‌కు టైం ఇవ్వండి

హైకోర్టును కోరిన ఏజీ

- నేరెళ్ల దళితుల ఘటనపై నివేదికలు సిద్ధం
- వైద్యం పొందేందుకు బాధితుల నిరాకరణ

నవతెలంగాణ–హైదరాబాద్



నేరెళ్ల దళితుల ఘటనపై వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల నివేదికలు సిద్ధంగా ఉన్నాయని, వాటి ఆధారంగా కౌంటర్ వ్యాజ్యాలు వేసేందుకు కొంత వ్యవధి కావాలని తెలంగాణ ఏజీ డి.ప్రకాష్‌రెడ్డి హైకోర్టుకు విన్నవించారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురం గ్రామస్తులపై పోలీసులు దాడి చేసిన ఘటనపై సీబీఐ విచారణ చేయించాలని పౌరహక్కుల సంఘం నేత లక్ష్మణ్, ఈ ఘటన దారుణమంటూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ రాసిన లేఖలను హైకోర్టు పిల్స్‌గా పరిగణించి విచారణ చేస్తున్నది. వీటిపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్‌రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ ఘటనలో ఎస్పి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినందునే సస్పెండ్ చేశామని, బాధితులు ఆరుగురిలో ఇద్దరికి వైద్యం అందించబోతే మిగిలిన నలుగురితో ...9లో

పెరిగిన వేతనాలు ఖరారు

జెన్‌కో కాంట్రాక్ట్ ఉద్యోగులకు

వివరాలు 2లో

బోగస్ అవార్డులు..ఫేక్ సర్వేలు

కేసీఆర్ పాలనపై ఉత్తమ్ విమర్శలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

బోగస్ అవార్డులు పొంది ఏదో సాధించినట్టు ప్రచారం చేసుకోవడంతోపాటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఫేక్ సర్వేలు నిర్వహించి ప్రజలను గందరగోళపరుస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రయివేట్ సంస్థ ...9లో

అంగన్‌వాడీలకు పరేషన్

స్టాక్ పాయింట్ల విధానాన్నే కొనసాగించాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్



అంగన్‌వాడీ కేంద్రాలకు చౌకదుకాణాల నుంచి రేషన్ సరఫరా చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. ఈ కేంద్రాలకు ప్రస్తుతమున్న స్టాక్ పాయింట్ల నుంచే రేషన్‌ను సరఫరా చేసే విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. పౌరసరఫరాల శాఖ చౌకదుకాణాల ద్వారా పామాయిల్, చక్కెర, గోధుమపిండి, చింతపండు, కందిపప్పు, గోధుమలు, ఉప్పు, సబ్బులు, కిరోసిన్, బియ్యం సరుకులను సబ్సిడీ ద్వారా పంపిణీ చేయాలి. కానీ గడిచిన కొన్ని నెలలుగా రేషన్ జాబితా నుంచి దాదాపుగా అన్ని వస్తువులూ తగ్గిపోయాయి. ఆయా వస్తువులపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల సబ్సిడీని భరించాల్సి రావడమే ఇందుకు కారణం. ప్రస్తుతం బియ్యం, కిరోసిన్ మాత్రమే సరఫరా చేస్తున్నారు. గత రెండేండ్ల క్రితమే పామాయిల్ నిలిలిపోయింది. కందిపప్పు, చక్కెర, గోధుమలది అదే దారి. కిరోసిన్ పరిస్థితి రేపోమాపో అన్నట్టుంది. కమిషన్ దాదాపు తగ్గిపోవడంతో రాష్ట్రంలోని 17,600 మంది డీలర్లు నష్టాలను తట్టుకోలేక ఇప్పటికే ...9లో



డేరా బాబా భూముల్ని స్వాధీనం చేసుకోవాలి

- రాష్ట్రంలో అసైన్డ్ భూములకు రక్షణ కరువు
- 'డేరా' భూముల్లో జెండాలు పాతిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ–చిట్యాల

నల్లగొండ జిల్లాలో డేరా బాబా ఆధీనంలోని భూముల్ని స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ పాలనలో అసైన్డ్ భూములకు, పేదల భూములకు రక్షణ కరువైందన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో డేరా స్వచ్ఛసౌదా ఆశ్రమం ఆక్రమించుకున్న 12 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో సీపీఐ(ఎం), వ్యకాస, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎర్రజెండాలు పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్ ...9లో

కీచక ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

నవతెలంగాణ–హాలియా



విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నల్లగొండ జిల్లా హాలియా జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ బుధవారం సస్పెండ్ చేశారు. తమ పట్ల కొన్ని నెలలుగా ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే టీసీ ఇచ్చి పంపుతానని బెదిరిస్తున్నాడని డీఈఓ ...9లో



ఉద్యోగులకు సీపీఎస్ ఉరే

పాత పింఛన్ కోసం ఢిల్లీని ముట్టడిస్తాం

- టీజీవో చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్ ..గృహకల్ప వద్ద ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) విధానం ఉరిగా తయారైందని టీజీవో చైర్మెన్, ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని గృహకల్ప వద్ద తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం అక్కడి నుంచి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 2004, సెప్టెంబర్ ఒకటి తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 1.25 లక్షల మంది భవిష్యత్తు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు ఉన్న ప్రాథమిక హక్కు అయిన పింఛన్ తీసేసి తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. ఇప్పటి వరకు దాదాపు వెయ్యి మంది ఉద్యోగ విరమణ పొందారని, ఒక్కరికీ సీపీఎస్ విధానం ద్వారా పింఛన్ రాలేదని అన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. ఈ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానం ప్రవేశపెట్టేదాక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి కట్టుగా పోరాడతారని అన్నారు. అవసరమైతే ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పాత పింఛన్ విధానం వచ్చేదాక పోరు ఆగదని అన్నారు. టీజీవో అధ్యక్షురాలు, ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ వి మమత మాట్లాడుతూ దుర్మార్గమైన ఈ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఆర్థిక, సామాజిక భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, నగర నాయకులు ఎంబి కృష్ణాయాదవ్, జి వెంకటేశ్వర్లు, టీఎన్జీవో నగర నాయకులు ముజీబ్, ప్రతాప్, మీర్జాఅలీబేగ్, రవీందర్‌రావు, అరుణ్ కుమార్, వెంకటయ్య, రవీందర్‌కుమార్, హరికృష్ణలు పాల్గొన్నారు.



హైదరాబాద్ గృహకల్ప ఆఫీసు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి :సీపీఐ (ఎం) డిమాండ్

రేపటి ఆందోళనకు మద్దతు

వివరాలు 2లో

లోపభూయిష్టం...

ఆర్థిక భద్రత లేని ఈ విధానాన్ని రద్దు చేయాలి : సీపీఐ తీర్మానం

సిక్కింలో గోవధపై నిషేధం

• బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం

గ్యాంగ్‌టక్: గో వధపై నిషేధం విధించిన తొలి ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం నిలిచింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం ఆమోదం తెలిపింది. సిక్కిం పశుసంవర్థక శాఖ మంత్రి సోమ్‌నాథ్ పౌడ్యాల్ ఈ బిల్లును సోమవారం ప్రవేశపెట్టారు. ఇక నుంచి రాష్ట్రంలో ఎవరైనా ఆవులను వధిస్తే రెండు నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానాను ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక, చట్టాన్ని పదే పదే ఉల్లంఘిస్తే ఏడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశమున్నది. రాష్ట్రంలో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్) అధికారంలో ఉన్నది. ఇది బీజేపీ కూటమి అయిన నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయెన్స్(ఎన్‌ఈడీఏ)లో భాగస్వామ్య పార్టీగా ఉన్నది.

షాబుద్దీన్‌కు జీవిత ఖైదు సబబే

• కింది కోర్టు తీర్పును సమర్థించిన పాట్నా హైకోర్టు

పాట్నా: గ్యాంగ్‌స్టర్, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) మాజీ ఎంపీ మహమ్మద్ షాబుద్దీన్‌కు పాట్నా హైకోర్టులో చుక్కెదురైంది. అన్నదమ్ములిద్దరి హత్య కేసులో విధించిన యావజ్జీవ కారాగార శిక్షను రద్దు చేయాలని దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కెకె మండల్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తిరస్కరించింది. 2004లో ఓ వ్యాపారి ఇద్దరు కొడుకులను కిడ్నాప్ చేసి, హత్య చేసిన కేసులో షాబుద్దీన్, అతని అనుచరులిద్దరికి సివాన్‌లోని ప్రత్యేక కోర్టు జీవితఖైదు విధించింది. కాగా ఈ తీర్పును సవాల్ చేస్తూ షాబుద్దీన్ తరపు న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. షాబుద్దీన్ ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నాడు.

విడిపోయిన బోగీలు

• యూపీలో మరో ఘటన

లక్నో: రైలు ప్రయాణమంటేనే జనం జడుసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. ఎందుకంటే.. వరుసగా జరుగుతున్న రైలు ప్రమాద ఘటనలే దీనికి కారణం. ఉత్తరప్రదేశ్‌లో బుధవారం మరో రైలు ప్రమాదం జరిగింది. డెహ్రాడూన్, హౌరా మధ్య ప్రయాణిస్తున్న 'దూన్' ఎక్స్‌ప్రెస్ రైలింజన్ బోగీల నుంచి విడిపోయింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు లోనయ్యారు. ఈ ఘటన జాన్‌పూర్-ఖైతారాయ్ స్టేషన్ల మధ్య బుధవారం మధ్యాహ్నం 1 గంటకు చోటు చేసుకున్నది. ప్రమాదం జరిగిన గంట తర్వాత వేరే ఇంజన్ సాయంతో రైలు గమ్యస్థానానికి చేరుకున్నది. గడిచిన 11 రోజుల్లో ఇది నాలుగో రైలు ప్రమాద ఘటన కావడం గమనార్హం.

దర్యాప్తు ఆలస్యంపై కోర్టు ఆగ్రహం

• సునంద పుష్కర్ మృతి కేసు

న్యూఢిల్లీ: సునంద పుష్కర్ హత్య కేసు దర్యాప్తులో ఆలస్యంపై ఢిల్లీ హైకోర్టు ఆ రాష్ట్ర పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు విచారణకు సంబంధించి ఏవైనా కొత్త విషయాలు ఉంటే సమర్పించాలని, లేకుంటే ఈ కేసు విషయాన్ని తామే చూసుకుంటామంటూ వ్యాఖ్యానించింది. రెండు వారాల్లో యథాతథ స్థితి నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. 'దర్యాప్తుకు సంబంధించి కొత్త విషయాలేమైనా ఉంటే... రెండు వారాల్లో వాటిని తీసుకుని రండి... లేకపోతే ఆ కేసు సంగతి మేము చూసుకుంటాం' అంటూ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, తమ దర్యాప్తులో ఎలాంటి ఆలస్యం జరగలేదని ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో సాంకేతికపరమైన అంశాలున్నాయని అవి తమ చేతుల్లో లేవని కోర్టుకు తెలిపారు. ఎయిమ్స్, కొన్ని విదేశీ సంస్థల ప్రమేయం కూడా ఉందని గుర్తుచేశారు. మరోవైపు కోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరపాలంటూ బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి దాఖలుచేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

ఆధార్‌పై నవంబర్‌లో విచారణ



• సుప్రీంకోర్టు వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలకు ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను నవంబర్‌లో విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఆధార్ పొందేందుకు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తామని కేంద్రం తెలియజేయడంతో సుప్రీం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది శ్యామ్‌దివాన్ ఆధార్‌పై దాఖలైన పలు పిటిషన్లను బుధవారం ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 30 వరకు మాత్రమే గడువు విధించిందని, పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేసు విచారణ చేపట్టాలని కోరారు. అయితే ఆధార్ పొందేందుకు సెప్టెంబర్ 30 వరకు విధించిన గడువును కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 31 వరకు పొడిగించనుందని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆధార్‌పై తక్షణం విచారణ జరపాల్సిన అవసరం లేదని, విచారణను నవంబర్ మొదటి వారంలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది. గతంలో జులై 7వ తేదీన త్రిసభ్య ధర్మాసనం ముందు ఆధార్‌కు సంబంధించిన కేసులు విచారణకు వచ్చినప్పటికీ విస్తృత ధర్మాసనం నిర్ణయించనుందని తెలిపింది. అనంతరం జులై 12న ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసింది. ఇందులో కొత్తగా వ్యక్తిగత గోప్యత అంశాన్ని చేర్చిం ది. అయితే అనంతరం ఏర్పడ్డ తొమ్మిది మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వ్యక్తిగత గోప్యత అంశంపై విచారణ జరిపింది. గోప్యత ప్రాథమిక హక్కుగా తేల్చింది.

ఆపరేషన్ థియేటర్‌లో వైద్యుల ఫైటింగ్

• బిడ్డ మృతి... తల్లి పరిస్థితి విషమం

జోధ్‌పూర్ : గర్భిణిని ఆపరేషన్ థియేటర్‌లో పడుకోబెట్టారు. క్రిటికల్ ఆపరేషన్ చేస్తున్న వైద్యులు మధ్యలో ఘర్షణకు దిగారు. ఆపరేషన్ టేబుల్ మీద ఆమెను అలాగే వదిలేసి.. వైద్యులు అరుచుకోవడం మొదలుపెట్టారు. చాలాసేపు పేషంట్‌ను పట్టించుకోకపోవడంతో పురిటిలోనే బిడ్డ మృతిచెందింది. గర్భిణి పరిస్థితి విషమంగా మారింది. థియేటర్లో వైద్యుల నిర్వాకాన్ని అక్కడే ఉన్న నర్సు తన సెల్‌ఫోన్‌లో బంధించింది. దాన్ని సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో అది వైరల్ అయింది. వైద్యుల బండారం బయటపడింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఆస్పత్రిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నిండు గర్భిణి కడుపునొప్పితో జోధ్‌పూర్ ఉమైద్ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. మంగళవారం ఉదయం ఆమెకు ఆపరేషన్ చేసేందుకు సిద్ధమయ్యారు. థియేటర్‌కు తీసుకువెళ్ళి శస్త్రచికిత్స ప్రారంభించారు. ఇక్కడవరకూ బాగానే ఉంది. శస్త్ర చికిత్స మధ్యలో ఉండగా.. గైనకాలజిస్టు, ఎనస్తీషియా ఇచ్చే వైద్యునికి మధ్య ఘర్షణ మొదలైంది. కట్‌చేసిన పొట్టతో ఆమె ఆపరేషన్ టేబుల్ మీద పడుకొని ఉండగానే.. గైనకాలజిస్టు డాక్టర్ అశోక్ నేనివాల్, ఎనస్తీటిక్ డాక్టర్ ఎంఎల్ తక్‌లు ఘర్షణకు దిగారు. పెద్దగా అరుచుకోవడం మొదలుపెట్టారు. 'నీ పరిధిలో నువ్వు ఉండు..' అంటూ డాక్టర్ నేనివాల్ అరవడం ఆ వీడియోలో స్పష్టంగా వినిపిస్తోంది. ఆ సమయంలో శిశువును బయటకుతీసేందుకు గర్భిణికి ఎమర్జెన్సీ సి-సెక్షన్ చేస్తున్నారు. ఆ తీవ్ర పరిస్థితిని కూడా వైద్యులు పట్టించుకో లేదు. దీంతో బిడ్డ మృతిచెందింది. ఆమె పరిస్థితి విషమంగా మారింది.



వైద్యులపై వేటు

ఈ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వం స్పందించింది. ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది. సామాజిక మాధ్యమంలో వైరల్ అయిన ఈ ఘటనపై రాజస్థాన్ హైకోర్టు కూడా తీవ్రంగా స్పందించింది. ఉమైద్ ఆస్పత్రిలో జరిగిన ఈ దారుణంపై తక్షణమే నివేదిక సమర్పించాల్సిందిగా సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యకు సంబంధించి నివేదికను సెప్టెంబరు 4 లోపు సమర్పించాల్సిందిగా జోధ్‌పూర్ కలెక్టర్‌ను ఆదేశించింది.

పీఎస్ఎల్వీ-సీ39 కౌంట్‌డౌన్ ప్రారంభం

• రేపు నింగిలోకి 'ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్'

శ్రీహరికోట: నావిగేషన్ శాటిలైట్ ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్‌ను నింగిలోకి పంపించేందుకు భారతఅంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పీఎస్ఎల్వీ -సీ39 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభ మైంది. శ్రీహరి కోటలోని సతీశ్ దావన్ స్పేస్ సెంటర్ రెండవ ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 7గంటలకు (29గంటల కౌంట్ డౌన్ అనంతరం) రాకెట్ ఆకాశంలోకి దూసుకెళ్లనున్నది. ఇంతకుముందు పంపిన నావిగేషన్ శాటిలైట్‌కు బదులుగా ఈఉపగ్రహం సేవలందించనున్నది. ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏలో మూడు ఆటోమేటిక్ క్లాక్‌లు పనిచేయకపోవడంతో దీన్ని పంపి స్తున్నారు. ఇంతకు ముందు ఏడునావిగేషన్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది.



ఖరీదైన కార్లు.. బంగారం.. కాస్మోటిక్స్..

• గుర్మీత్ లైఫ్ స్టయిలే డిఫరెంట్



చండీగఢ్ : లగ్జరీ కార్లలో ప్రయాణం.. కాస్మోటిక్స్ అంటే ఎనలేని పిచ్చి.. వీఐపీ గదుల్లో ఉండే వస్తువులన్నీ బంగారంతో చేసినవే.. ఆ గదుల్లోకి కోరుకున్న వారు తప్ప వేరొకరు ప్రవే శించడానికి వీల్లేదు. ఇదీ డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ లైఫ్ స్టైల్.. ఇద్దరు సాధ్వి (భక్తు రాలు)లపై లైంగికదాడి కేసులో గుర్మీత్‌కు సీబీఐ కోర్టు సోమవారం 20ఏండ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. గుర్మీత్ దోషిగా తేలగానే హర్యానాలోని డేరా కేంద్రాలను ఖాళీ చేయించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ క్రమం లోనే గుర్మీత్ రాసలీలలు, అక్రమాలు, అరాచకాలు, దుర్మార్గాలు.. ఒకొక్కటిగా వెలుగులో కొస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 100 డేరా ఆశ్రమాలను పోలీసులు ఖాళీ చేయించారు,. పంచకుల సెక్టార్ 23 డేరాలో గుర్మీత్ కల్పించుకున్న సదుపాయాలను చూసి పోలీసులు సైతం విస్తుపోయారు. డేరా లోపల ఆయనకంటూ కొన్ని ప్రత్యేక గదులు నిర్మించుకున్నాడని, దానిలోకి కోరుకున్న వారినే అనుమతించేవారిని దర్యాప్తులో వెల్లడైంది. డేరాలో పెద్ద సంఖ్యలో ఐరన్ రాడ్స్, కర్రలు, పెట్రోల్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాస్మోటిక్స్ అంటే గుర్మీత్ ఎంతో ఇష్టమని పలువురు స్థానికులు చెబుతున్నారు. అంతేకాక విదేశాల నుంచి ఖరీదైన కార్లను దిగుమతి చేసుకొనేందుకు ప్రత్యేకంగా ఒక ఓడను కూడా కొనుగోలు చేశాడట. బయటకు వెళ్లినప్పుడు తనను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు కార్లపై టార్పాలిన్‌లను కప్పించేవాడు అని తెలిసింది. అంతేకాక.. కారు వెనుక సీట్లలో జరిగే ఏది కూడా డ్రైవర్‌కు తెలియకుండా ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేయించుకున్నాడు. ఆయన ఉపయోగించిన కార్లలో మహిళల వస్త్రాలు, మాదక ద్రవ్యాలు భారీ మొత్తంలో లభ్యమయ్యాయి.



నయా డేరా బాబా జస్మీత్.. : డేరా సచ్చా అధిపతిగా గుర్మీత్ తనయుడు జస్మీత్‌కు అప్పగించారు. అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది.గుర్మీత్ తల్లి తన మనవడి పేరును ఖరారు చేశారు. నసీబ్ కౌర్ అత్యవసరసమావేశాన్ని ఏర్పాటు చేయగా,45 మంది సభ్యులు హాజరై ఈనిర్ణయం తీసుకున్నారు. సన్నిహితవర్గాల నుంచి సమాచారాన్ని తెలిసింది.


మాకేం డాలర్లు ఇవ్వలేదు

• పాక్ అంతర్గత వ్యవహారాల మాజీ మంత్రి



ఇస్లామాబాద్ : అమెరికా తమకు సాయం కింద బిలియన్ల డాలర్లు ఇవ్వలేదని, కేవలం పల్లీలు మాత్రమే ముష్టిగా వేసిందని పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మాజీ మంత్రి జాతీయ అసెంబ్లీలో బుధ వారం ప్రకటించినట్టు ఆ దేశ మీడియా తెలిపింది. పాకిస్థాన్‌కు పదేండ్లుగా అమెరికా చేసిన సాయంపై కూడా ఆడిట్ నిర్వహించాలని అధికార పార్టీకి చెందిన నేత, మాజీ మంత్రి చౌధరి నిస్సార్ కోరినట్టు స్టేట్ మీడియా పేర్కొన్నది. పాక్‌కు బిలియన్ల డాలర్ల సాయం అందిస్తుంటే, ఈ నిధులతో తీవ్రవాదులను పెంచి పోషించి వారికి స్వర్గంగా మారిందని, ప్రస్తుతం వాటితో మేము పోరాడుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో పాకిస్థాన్ సేవలకు మాత్రమే అమెరికా నిధులు అందజేసిందని, ఈ నిధులను సంకీర్ణ దళాల కోసమే ఖర్చు చేశామని అన్నారు. సంకీర్ణ దళాల కోసం తాము 500 బిలియన్ డాలర్లు ఖర్చుచేస్తే, కేవలం 200 మిలియన్ డాలర్లు మాత్రమే అమెరికా చెల్లించిందని చౌధరి నిస్సార్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ఆరోపణల నేపథ్యంలో తమ దేశ సమగ్రత విషయంలో రాజీపడబోమని ఆయన స్పష్టం చేశారు. మేము భయపడితే... శత్రువు మరింత భయపెట్టడానికి ప్రయత్నిస్తాడని నిస్సార్ పేర్కొన్నారు. అంతేకాదు ట్రంప్ ఆరోపిస్తున్నట్టు ఉగ్రవాద సంస్థలను తమ ప్రభుత్వం పెంచి పోషిస్తోందనడం సరికాదని, దీనికి సరైనా ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. కాగా, పాకిస్థాన్ ఉగ్రసంస్థలకు సహకరిస్తున్నట్టు తమ దగ్గర పక్కా ఆధారాలున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటనలకు స్పందించిన పాక్ అమెరికాతో ద్వైపాక్షిక చర్చలు, పర్యటనలను నిలిపివేయాలని నిర్ణయించింది.

అణుబాంబు దాడిలో బయటపడి క్యాన్సర్ వ్యాధితో మృతి


తనిగుచి (ఫైల్)

టోక్యో: రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌లోని నాగసాకి నగరంపై అమెరికా అణుబాంబు వేసింది. అయితే, ఆ దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డ సుమితెరు తనిగుచి అనే వ్యక్తి బుధవారం తుది శ్వాస విడిచాడు. క్యాన్సర్ కారణంగా తనిగుచి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతని వయసు 88 ఏండ్లు అణు బాంబు దాడి జరిగినప్పుడు తనిగుచి వయసు 16 ఏండ్లు అప్పుడు అతను పోస్ట్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. సైకిల్ మీద మెయిల్స్ ఇచ్చేందుకు వెళ్తున్న సమయంలో బాంబు దాడి జరిగింది. బాంబు పడిన కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో తనిగుచి ఉన్నాడు. అయితే, బాంబు వల్ల వచ్చిన రేడియేషన్‌కు తనిగుచి గురయ్యాడు. ఒక్కసారిగా బాంబు రేడియేషన్ తాకడం వల్ల అతను సైకిల్ మీద నుంచి కిందపడిపోయాడు. వెన్ను, ఎడమ చేయి బాంబు వేడికి కాలిపోయాయి. సుమారు మూడున్నరేండ్ల పాటు అతను ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అణుబాంబు దాడి బాధితుడైన తనిగుచి ఇన్నాళ్లూ మిగతా బాధితుల కోసం పోరాటం చేశాడు. అణుబాంబులు మానవాళి మనుగడకు ప్రమాదకరమని పలు ఇంటర్వ్యూల్లో తనిగుచి చెప్పారు. తనిగుచి పేరును నోబెల్ బహుమతి కోసం సిఫారసు చేసినట్టు నిహాన్ హిదన్‌క్యో సంస్థ ప్రకటించింది. కాగా, 1945, ఆగస్టు6న జపాన్‌లోని హిరోషిమా నగరంపై అమెరికా అణుబాంబు ప్రయోగించింది. ఈ దాడిలో లక్షా 40వేల మంది మృతి చెందారు. అనంతరం ఆగస్టు9న నాగసాకి నగరంపై అణుబాంబు ప్రయోగించింది. ఈ దాడిలో సుమారు 74 వేల మంది మృతి చెందారు.

అమెరికా అంతర్మథనం

క్షిపణి రక్షణ వ్యవస్థ పరీక్షలు

వాషింగ్టన్ : ఉత్తర కొరియా వరుస క్షిపణి ప్రయోగాలతో అమెరికాలో గుబులు మొదలైంది. ఉ.కొరియా క్షిపణుల్లో నిర్దేశిత లక్ష్యాలను ఢీకొట్టే సామర్థ్యం ఉన్నట్టు అమెరికా రక్షణ శాఖ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉ.కొరియా సైన్యం ప్రయోగించిన మధ్యస్థాయి బాలిస్టిక్ క్షిపణి జపాన్ మీదుగా ప్రయాణించి హొక్కైడో ఉత్తర ప్రాంతంలోని సముద్ర జలాల్లో పడింది. దీంతో, అమెరికా తమ దగ్గర ఉన్న క్షిపణులు ఎలా పనిచేస్తున్నాయో పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నది. తాజాగా హవాయి తీరంలో యూఎస్ మిస్సైల్ డిఫెన్స్ ఏజెన్సీ (ఎండీఏ), నావికాదళం సంయుక్తంగా క్షిపణి రక్షణ వ్యవస్థ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్టు ఎండీఏ డైరెక్టర్ లెఫ్టినెంట్ జనరల్ సామ్ గ్రీవ్స్ తెలిపారు.

జపాన్ మీదుగా ఉత్తర కొరియా క్షిపణిని ప్రయోగించిన తర్వాతి రోజే అమెరికా తమ క్షిపణి రక్షణ వ్యవస్థను పరీక్షించడం గమనార్హం. అయితే, ఎంతో ముందుగానే షెడ్యూల్ చేసిన టెస్ట్ అని ఎండీఏ బుకాయించేందుకు ప్రయత్నిస్తోంది. స్టాండర్డ్ మిస్సైల్-6 గైడెడ్ మిస్సైల్స్‌ను ఈ పరీక్ష కోసం ఉపయోగించారు. ఇది విజయవంతంగా ఓ మీడియం రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ఛేదించిందని అమెరికా రక్షణ శాఖ ప్రకటించుకున్నది. రెండు నెలల కిందట ఇదే పరీక్షను నిర్వహించినప్పుడు విఫలమైందని తెలిపింది. ఇప్పుడదే యూఎస్ఎస్ జాన్‌పాల్ జోన్స్ యుద్ధ నౌక నుంచే పరీక్షించగా విజయవంతమైందని పేర్కొన్నది. ఈ నౌకాదళ విభాగ క్షిపణి రక్షణ వ్యవస్థ బాలిస్టిక్ మిస్సైల్స్‌ను అడ్డుకునే తమ సామర్థ్యాన్ని మరింత పెంచిందని ఎండీఏ స్పష్టంచేసింది. మంగళవారం బాలిస్టిక్ మిస్సైల్‌ను జపాన్ మీదుగా ప్రయోగించిన తర్వాత.. ఇది కేవలం కర్టెన్ రైజర్ మాత్రమేనని ఉ.కొరియా సైన్యం హెచ్చరించిన విషయం తెలిసిందే. తమ తర్వాతి లక్ష్యం అమెరికా భూభాగమైన గువామేననీ స్పష్టం చేసింది.



బ్రిక్స్ సదస్సుకు అతిధులుగా ఐదు దేశాలు : చైనా ఆహ్వానం

బీజింగ్ : త్వరలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు అతిథులుగా ఐదు దేశాలు-ఈజిప్ట్, కెన్యా, తజికిస్తాన్, మెక్సికో, థాయిలాండ్-లను చైనా ఆహ్వానించింది. అయితే ఇలా ఆహ్వానించినంత మాత్రాన 'బ్రిక్స్ ప్లస్' దృక్పథం కింద బ్రిక్స్‌ను విస్తరించే ప్రయత్నం కాదని చైనా స్పష్టం చేసింది. సెప్టెంబరు 3 నుండి 5 వరకు గ్జియామెన్ నగరంలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిధ్యమిస్తోంది. ఈ సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీతో సహా బ్రిక్స్ దేశాల నేతలు పాల్గొంటారు. బ్రిక్స్ ప్లస్ ఆలోచన వెనుక గల కారణాలను ప్రజలు మరింతగా అవగాహన చేసుకోవడానికి వీలుగా దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో బ్రిక్స్ ప్లస్ ఆలోచనను వాంగ్ ప్రతిపాదించారు. దాంతో బ్రిక్స్‌ను విస్తరిస్తున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే వార్షిక సమావేశాలప్పుడు వివిధ దేశాలను సభ్య దేశాలు ఆహ్వానిస్తాయని వాంగ్ చెప్పారు. గతేడాది కూడా గోవాలో జరిగిన సమావేశాల సందర్భంగా భారత్ నిర్ణయం మేరకు బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, థాయిలాండ్, భూటాన్, నేపాల్‌లను ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు బ్రిక్స్ సదస్సుకు ఆతిధ్యమిచ్చినపుడు తమ పొరుగు దేశాలను ఆహ్వానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ఈసారి తాము కేవలం పొరుగుదేశాలను కాకుండా బ్రిక్స్ యంత్రాంగం పట్ల ఆసక్తి వున్న దేశాలను ఆహ్వానించామని చెప్పారు.

హార్వే తుఫాను అల్లకల్లోలం

20మంది మృతి

హూస్టన్ : హార్వే తుఫాను అమెరికాను అతలాకుతలం చేస్తున్నది. టెక్సాస్, హూస్టన్ సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తున్నది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరదల్లో చిక్కుకుని 20 మంది మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. గల్లంతైన వారికోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో నిమగ్నమయ్యారు. రహదారులు దెబ్బతినడంతో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో అక్కడి రోడ్లపైకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. వేలాది ఇండ్లు నీటమునగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. భారీగా ఆస్తినష్టం జరిగింది. హ్యూస్టన్ సహా దక్షిణ టెక్సాస్ ప్రాంతంలోని సుమారు 13వేల మందికిపైగా బాధితుల్ని అక్కడి ఫెడరల్ ఏజెన్సీలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఇంకా ఎంతమంది వరదల్లో చిక్కుకున్నారనే సమాచారం తెలియరాలేదు. ఈ పరిస్థితి నేపథ్యంలో హ్యూస్టన్‌లో కర్ఫ్యూ విధిస్తున్నట్టు మేయర్ సిల్విస్టర్ ప్రకటించారు. ఆయా వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి చొరబడి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉండటంతో ఈ కర్ఫ్యూ విధించినట్టు చెప్పారు. దక్షిణ హ్యూస్టన్‌లోని సుమారు 3లక్షల మందికి పైగా ఉండే బ్రజోరియా కౌంటీ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఇండ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ఆ ప్రాంతంలోని స్థానికులను సుర క్షిత ప్రాంతాలకు తరలిస్తు న్నారు. గత 48 గంటల్లోనే తమకు సాయం చేయాలంటూ ఎమర్జెన్సీ ఏజెన్సీలకు సుమారు 6వేలకు పైగా ఫోన్‌కాల్స్ వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన టెక్సాస్ నగరాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సందర్శిస్తారని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.



తుఫాన్‌లో చిక్కుకొని భారతీయ విద్యార్థి మృతి


నిఖిల్ భాటియా (ఫైల్)

హార్వే తుఫాన్‌లో చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతీయ విద్యార్థి నిఖిల్ భాటియా (24) బుధవారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమెరికా టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం విశ్వవిద్యాలయంలో చదువుతున్న నిఖిల్ భాటియా, షాలినీ సింగ్ (25)లు గత శనివారం ఈత కొట్టేందుకు బ్ర్యాన్ సరస్సుకు వెళ్లారు. అయితే హార్వే తుఫాను ముంచెత్తడంతో ఇద్దరూ మునిగిపోయి దాదాపు ప్రాణాపాయ స్థితిలో ఉండగా సహాయక సిబ్బంది కాపాడి ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల నుంచి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. పరిస్థితి విషమించడంతో నిఖిల్ భాటియా బుధవారం మృతి చెందాడు. షాలినీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. కాన్సులేట్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు చేరవేస్తున్నారు. నిఖిల్ భాటియా స్వస్థలం రాజస్థాన్‌లోని జైపూర్. షాలిని సింగ్ ఢిల్లీ నివాసి వీరిద్దరూ ఏ అండ్ ఎం యూనివర్సిటీలో పీజీ చేస్తున్నారు. మరోవైపు హూస్టన్ చుట్టుపక్కల నివసిస్తున్న దాదాపు లక్ష మంది భారతీయ అమెరికన్లపై కూడా తుఫాను ప్రభావం భారీగా ఉంది. వరద నీరు ఇండ్లలోకి వచ్చి చేరడంతో వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 200 మందికిపైగా భారతీయ విద్యార్థులు ఇండ్లలో చిక్కుకుపోగా వారికి భారత కాన్సులేట్ సహాయం అందిస్తోంది. భారతీయుల సహాయార్థం ఓ హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా హూస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ అనుపమ్ రే ట్వీటర్‌లో పోస్ట్ చేశారు. భారతీయులకు అందిస్తున్న సహాయక చర్యలను ఆయన ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో మెలానియా..

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య మెలానియా ట్రంప్ బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సందర్శించారు. అయితే, వరద బాధితులను పరామర్శించే క్రమంలోనూ ఆమె తన మేకప్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు స్థానిక మీడియా సంస్థలు ప్రకటించాయి. మెలానియా తీరు పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తీవ్ర వర్షాలు, వరదలతో ఛిన్నాభిన్నమైన టెక్సాస్ నగరాన్ని మంగళవారం ట్రంప్, ఆయన భార్య మెలానియా సందర్శించారు. ఈ సందర్భంగా అత్యంత ఫ్యాషనబుల్‌గా కనిపించడానికి మెలానియా ప్రయత్నించడం అమెరికన్లను విస్తుపోయేలా చేసింది. ముఖ్యంగా మెలానియా మరీ ఎత్తుగా ఉన్న హైహీల్స్ వేసుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. టెక్సాస్ వరద కష్టాలు ముంచెత్తిన సందర్భంలోనూ ట్రంప్, మెలానియా ఇలా సోకులకు పోవడం ఏమిటని అమెరికన్ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. టైలర్డ్ కాప్రి ప్యాంట్, ఆర్మీ ఆకుపచ్చ రంగు బాంబర్ జాకెట్, ఏవియేటర్ సన్‌గ్లాసెస్, స్కై-హై హిల్స్ షూస్‌ను మెలానియా ధరించగా.. ట్రంప్ హుడెడ్ రెయిన్ జాకెట్, ఖాకీ రంగు ప్యాంటు, ముదురురంగు బూట్లు వేసుకున్నారు. వీరి మేకప్‌పై ట్విట్టర్‌లో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మెలానియా అచ్చం వరదలను చూస్తున్న బార్బీలా ఉంది' అని రచయిత మారియా డెల్ రుసో ట్వీట్ చేయగా.. 'టెక్సాస్ వాసులారా ఆందోళన చెందకండి. సాయం అందుతుంది. మెలానియా తుఫాన్ అంత ఎత్తున హైహీల్స్ వేసుకుంది' అని మరో నెటిజన్ కామెంట్ చేశారు.

లైంగికదాడులకు పాల్పడ్డ కేసుల్లో ...

వ్యాయామ ఉపాధ్యాయుడికి 105 ఏండ్ల జైలు

వాషింగ్టన్: మైనర్ బాలికలపై లైంగికదాడులకు పాల్పడ్డ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిని లాస్‌ఏంజిల్స్ న్యాయస్థానం దోషిగా తేల్చి 105 ఏండ్ల జైలుశిక్ష ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్ వెల్లడించిన వివరాల ప్రకారం... రోనీ లీ రోమన్ (44) అనే వ్యక్తి కాలిఫోర్నియాలోని ఓ ప్రాథమిక పాఠశాలలో కొన్నేండ్లుగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో చదువుకుంటున్న మైనార్ చిన్నారులను మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడేవాడు. రోమన్ ఏడుగురు బాలికలపై లైంగికదాడికి పాల్పడ్డట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. లాస్ ఏంజిల్స్ కౌంటీ జిల్లా కోర్టులో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం రోమన్‌ను దోషిగా తేల్చింది. పాఠశాల క్రీడామైదానంలో ఆరుగురిపై, మరో బాలిక ఇంటికి వెళ్లి రోమన్ లైంగికదాడికి పాల్పడినట్టు విచారణలో వెల్లడైంది. న్యాయమూర్తి దోషికి 105 ఏండ్ల జైలు శిక్షను ఖరారు చేశారు.

సంక్షోభంలో రైతు

- గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం విఫలం
- 'డేరా'తో బీజేపీ కుమ్మక్కు : సీపీఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

నవతెలంగాణ-హన్మకొండ

దేశంలో రైతు సంక్షోభంలో ఉన్నాడని, అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాస్‌రావు అన్నారు. హన్మకొండలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడికి అదనంగా 50 శాతం డబ్బులు ఇస్తామని మోడీ చెప్పారని అన్నారు. మూడేండ్లు అయినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. నేడు రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు లేక దీనావస్థలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కేంద్రం 2 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించిందన్నారు. ఈ క్రమంలో నైరాశ్యం చెందిన యువత పెడదారులు పట్టే అవకాశం ఉందని చెప్పారు. కేసీఆర్ పూటకో మాట చెప్పి హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. భూసర్వేల పేరుతో రెవెన్యూ శాఖను పక్కనపెట్టి గ్రామ కమిటీలతో సర్వేలు చేయించడం సరైంది కాదన్నారు. దీంతో పేదవాడు తన భూమి కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 18న ఢిల్లీలో జరగనున్న ప్రజాసంఘాల జాతీయ సదస్సుకు సీపీఐ(ఎం) మద్దతు ఇస్తుందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోసంరక్షణ శాలల్లో తిండిలేక పశువులు చనిపోతున్నాయని వాపోయారు. గోసంరక్షణ పేరుతో రాజకీయలు చేయడం సరైంది కాదని, గోసంరక్షణ చట్టాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. మత రాజకీయాలు చేసిన డేరా బాబాతో ఎన్నికల ముందు బీజేపీ నాయకులు కుమ్మకయ్యారని విమర్శించారు. నేడు బాబాకు శిక్షపడటంతో అతని శిశ్య గణం చేసిన రాక్షస దహణకాండ దారుణమన్నారు. ఈ దుర్ఘటనకు హర్యానా ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని అన్నారు. 2016-17 సవరణతో ప్రాజెక్టుల కట్టడాల ఖర్చు అధికమవుతోందన్నారు. నైపుణ్యం కలిగిన ఇంజనీర్లచే ప్లానింగ్ చేయించాలని సూచించారు. కాలువల పేరుతో రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 15 లక్షల గుడిసెవాసులున్నారని, వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని ఎన్నికల ముందు కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. వరంగల్ పట్టణంలో సుమారు 10 వేల గుడిసెవాసులున్నారని, అర్హతను బట్టి వారున్న చోటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి, పట్టాలివ్వాలని కోరారు. గ్రామాల్లో భూసర్వే పేరుతో ప్రభుత్వం భూదందా నడిపిస్తోందన్నారు. భూసర్వేను రెవెన్యూ అధికారులు చేయాల్సి ఉండగా కమిటీల పేరుతో టీఆర్ఎస్ నాయకులు దందా సాగిస్తున్నారని విమర్శించారు. జీవో 39ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) అర్బన్ జిల్లా కార్యదర్శి సారంపల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ పాల్గొన్నారు.

కొత్త కల్లు విధానాన్ని రూపొందించాలి

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం


మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గీత కార్మికుల ఉపాధి పెంచే విధంగా కొత్త కల్లు విధానాన్ని రూపొందించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం మాటూరి బాలరాజు గౌడ్ అధ్యక్షతన సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంవి రమణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న కల్లు విధానమే అమలవుతున్నదని, అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చే నూతన ఎక్సైజ్ పాలసీలో కొత్త కల్లు విధానాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతి సంవత్సరం గీతకార్మికులు ప్రభుత్వానికి చెట్టు పన్ను రూపంలో రూ.15 కోట్లు చెల్లిస్తున్నారని తెలిపారు. కుల వృత్తులకు చేయూతనిచ్చి ఆదుకుంటామని చెబుతున్న ప్రభుత్వం ఈ పన్నును రద్దు చేసి శాశ్వత లైసెన్సును జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, చెరుపల్లి సీతారాములు, గైని వెంకన్న, ఎస్ రమేశ్, ఎస్ వెంకటగౌడ్, బాల్నె వెంకటమల్లు, బండకింది అరుణ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితిలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవాలి : తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ రైతు సమన్వయ సమితిలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. జంగారెడ్డి, టి. సాగర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామల సభల ద్వారా గ్రామ రైతు సమన్వయ సమితిలను ఎన్నుకోవాలని కోరారు. టీఆర్ఎస్ పార్టీకి చెందిన వారినే ఈ సమన్వయ సమితిలో ఎన్నుకోవాలని సీఎం స్వయంగా చెప్పడం, ఒక్కో మంత్రికి 2,3 జిల్లాలను అప్పగించడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలని, సాదాబైనామాలను పరిష్కరించాలని, మంత్రుల ద్వారా గ్రామ, మండల, జిల్లా సమితిలను నామినేట్ చేయకుండా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిటీలను నామినేట్ పద్ధతిలో కాకుండా గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని సూచించారు. గతంలో వేసిన రైతు కమిటీలు, పాఠశాల కమిటీలు, విద్యుత్, దవాఖాన కమిటీలను పారదర్శకంగా ప్రకటించారని, అదే పద్ధతి రైతు సమన్వయ సమితిల ఎంపికలోనూ పాటించాలని కోరారు. సాదాబైనామాలో తెల్ల కాగితంపై కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా పట్టా మార్పిడి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అమలు పర్చడం లేదని విమర్శించారు. ప్రకృతివైపరీత్యాల పంటల పరిహారం, భీమా, రుణాలు అక్రమార్కుల పాలవుతున్నాయని పేర్కొన్నారు.

గురుకుల టీజీటీ సైన్స్‌కు 78.14 శాతం మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వివిధ గురుకులాల్లో ప్రకటించిన టీజీటీ సైన్స్ మెయిన్స్ రాతపరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. టీజీటీ సైన్స్‌కు 3,006 మంది అర్హత సాధించారని, వారిలో బుధవారం జరిగిన రాతపరీక్షకు 2,349 (78.14 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లో మూడు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు.

సంపాదకీయం

హ్యూస్టన్‌లో వరద బీభత్సం!



దాదాపు పన్నెండేండ్ల క్రితం న్యూ ఓర్లీన్స్ నగరాన్ని హర్రికేన్ కత్రీనా తుఫాన్ చిన్నాభిన్నం చేసింది. ప్రస్తుతం టెక్సాస్ రాష్ట్ర తీరప్రాంతాన్ని హర్రికేన్ హార్వే అతలాకుతలం చేస్తున్నది. ఈ తుఫాన్ తాకిడికి అమెరికాలో నాల్గొవ అతిపెద్ద నగరమైన హ్యూస్టన్‌ను వరద ముంచెత్తింది. ఈ తుఫాన్ ప్రభావంవల్ల నగరంలోని 65లక్షల మంది ప్రజలు తీవ్రస్థాయిలో అష్టకష్టాలు పడుతున్నారు. హర్రికేన్ కత్రీనా తరువాత మరోసారి హార్వే తుఫాన్ అమెరికా సమాజ క్రూర వాస్తవికతను బట్టబయలు చేసింది. ఉదాహరణకు హార్వే తుఫానుతో కుదేలవుతున్న హ్యూస్టన్ నగరంలో సామాజిక అసమానతలు ఘోరంగా రాజ్యమేలుతున్నాయి. ఈ నగరంలో అధికారిక దారిద్ర్య రేటు 25శాతంగాను, పిల్లలలో దారిద్ర్యం రేటు 38శాతంగానూ ఉన్నది. హార్వే తుఫాను వరదలో చిక్కుకుపోయిన వారిలో చాలామంది తమ ఆవాసాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవటానికి కావలసిన డబ్బు తమవద్ద లేదని చెబుతున్నారు. విస్తృతంగావున్న దారిద్ర్యం, విపరీత స్థాయిలోగల ఆర్థిక అసమానతలు,

> **హ్యూస్టన్ వరదల వలన అత్యంత దయనీయమైన దుస్థితిని ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలు దయార్ద్ర హృదయంతో సాహసోపేతంగా సాటివారికి సహాయపడుతున్న తీరు మానవీయ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి జరిగే పోరులో ఉపయోగపడుతుందనటంలో సందేహం లేదు. నాగరికతల సృష్టిలో సామాన్యుల సాహసం జగద్వితం!**

అధికార యంత్రాంగ లంచగొండితనం ఇత్యాది అవలక్షణాలకు అమెరికా నెలవైంది. కలుషితమైన నడుములోతు వరద నీటిలో పిల్లలు, పెద్దలు ఈదుతూ ఇండ్ల పైకప్పులపైకి చేరుకుని ఆహారం, మంచినీటి కోసం ఎదురుచూస్తున్నారు. తుఫాన్ తీవ్రతరమవుతూ భారీ వర్షాన్ని కుమ్మరిస్తున్నందున నగరంలోను, పరిసర ప్రాంతాలలోను పరిస్థితి మరింతగా క్షీణిస్తున్నది. ప్రపంచంలో అత్యంత ధనిక దేశమైన అమెరికాలో తరచూ వస్తున్న తుఫానుల, టోర్నాడోల ప్రభావంతో జనజీవితం అతలాకుతలమవు తున్నది. కోట్లాది ప్రజలకు కనీస ఆదాయంలేని కారణంగా ఏర్పడిన సామాజిక సంక్షోభంవల్ల ప్రకృతి విపత్తులను ఎదుర్కోవటానికి ప్రజలు సంసిద్ధులు కాలేక పోతున్నారు. వీటిలో సహజంగా పేదలే సమిధలౌతున్నారు. ప్రగతికీ, ఐశ్వర్యాకీ ప్రతీకనని చెప్పుకుంటున్న అమెరికాలో మరొకసారి ప్రజల హాహాకార దృశ్యాలు హృదయాలను ద్రవింపజేస్తున్నాయి.

ఇలాంటి సంక్షోభం వచ్చిన ప్రతిసారీ సామాన్య ప్రజలే సామాజిక సంఘీభావాన్ని తెలుపుతుంటారు. తుఫాన్‌లో చిక్కుకున్నప్పటికీ ప్రజలు తమ పొరుగువారి ప్రాణాలను కాపాడటానికి ఆహారం, ఆశ్రయం కల్పిస్తూ సహాయపడుతున్నారు. తమ దేశంలోని ఒక ప్రధాన నగరాన్ని ముంచెత్తుతున్న వరదల నుంచి ప్రజలను రక్షించలేని ప్రభుత్వ యంత్రాంగానికి భిన్నంగా ప్రజలు పరస్పరం సహకరించు కుంటూ తమనుతాము రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంత విపత్తులోనూ ఈ దృశ్యం రమణీయం.

ఇదంతా హ్యూస్టన్, ఆగ్నేయ టెక్సాస్ ప్రాంతాలను వరదలు తరచుగా ముంచెత్తుతున్న నేపథ్యంలో జరుగుతున్నది. నిజానికి 1900లో గాల్వెస్టన్ నగరం వరదలతో సర్వనాశనం కావటంతో హ్యూస్టన్ ఒక ప్రధాన ఓడరేవు నగరంగా ఆవిర్భవించింది. 2001లో అల్లిసన్, 2005లో హర్రికేన్ రీటా, 2008 ఇక్కే పేర్లుగల తుఫానులు ఈ నగరంమీద విరుచుకుపడ్డాయి. అమెరికా నగరాలలో గత నలభై ఏండ్లలో హ్యూస్టన్‌కు తాకినన్ని వరదలు మరే నగరానికీ తాకలేదు. ఈ వరదలవల్ల అనేకమంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు.

హ్యూస్టన్ అమెరికాలోని చమురు పరిశ్రమకు కేంద్రం. అమెరికాకు ఇద్దరు అధ్యక్షులను అందించిన బుష్ కుటుంబం నివసించేది ఈ నగరంలోనే. హ్యూస్టన్ ప్రధాన నగరంగావున్న టెక్సాస్ రాష్ట్రం విశృంఖల మార్కెట్ పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక నమూనాగా ఉన్నది. కార్పొరేట్ పన్నులు, కార్మికుల వేతనాలు తక్కువగా ఉండటంవల్ల అనేక కార్పొరేట్ కంపెనీలు తమ కార్యకలాపాలను ఈ రాష్ట్రానికి మార్చుకోవటంతో అభివృద్ధి గణనీయంగా జరిగింది. అనేక దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ కంపెనీలు చేసిన విశృంఖల చట్టా వ్యాపారంతో హ్యూస్టన్ ఒక ప్రణాళిక అంటూ లేకుండా పెరిగిపోయింది. ఈ పరిస్థితిపై అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు, నిష్ణాతులు అనేక సార్లు హెచ్చరికలను చేశారు. అయితే ఈ హెచ్చరికలను జాతీయ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులు ఖాతరు చేయనందున విపత్తు అనివార్యమైంది. తుఫాన్లు, వరదలు ప్రకృతి విలయతాండవం వల్ల ఏర్పడతాయనేది వాస్తవమైనప్పటికీ మనుషులు చేసే పిచ్చిపనుల మూలంగా వాటి తీవ్రత చాలా ఎక్కువ అవుతుంది. ఆర్థిక, సామాజిక స్థితిగతులు వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని పెంచుతాయి. అరాచకమైన, అహేతుకమైన, లాభాలే ధ్యేయంగా పనిచేసే స్వభావంగల పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే కార్యకలాపాలవల్ల వాతావరణంలో తాపం పెరుగుతున్నది. దీనినే మనం గ్లోబల్ వార్మింగ్ అని పిలుస్తున్నాం. గ్లోబల్ వార్మింగ్ పెరగటంతో అమెరికాలోను, ప్రపంచవ్యాప్తంగాను తరచుగా తుఫాన్లవంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి.

హ్యూస్టన్ వరదల వలన అత్యంత దయనీయమైన దుస్థితిని ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలు దయార్ద్ర హృదయంతో సాహసోపేతంగా సాటివారికి సహాయపడుతున్న తీరు మానవీయ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి జరిగే పోరులో ఉపయోగపడుతుందనటంలో సందేహం లేదు. నాగరికతల సృష్టిలో సామాన్యుల సాహసం జగద్వితం!

'ఉప' ఫలితాలు - మలి సంకేతాలు



తెలకపల్లి రవి

ఆగష్టు 23న మూడు రాష్ట్రాల్లో నాలుగు శాసనసభా స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీలే గెలుపొందాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఆప్. గోవాలో బీజేపీ(2), నంద్యాలలో తెలుగుదేశం విజయం సాధించాయి. ఈ ఉప ఎన్నికల నేపథ్యం, పోటీల తీరు వేర్వేరైనా అధికార పక్షాల విజయమనే ఒక్క మాటతో వాటన్నిటినీ విస్మరించడం జరుగుతున్నది. ఈ ఫలితాలలోని రాజకీయ సంకేతాలేమిటన్న దానిపై వేరు వేరు భాష్యాలు వినిపిస్తున్నాయి. నంద్యాలనే తీసుకుంటే ఎన్నికల ముందు ఏ మాటలతో పోటీ చేసినా ఇప్పుడు మాత్రం వైసీపీ నేతలు అధికార పార్టీ గెలుపు సహజమేనన్న రీతిలో మాట్లాడుతున్నారు. ఇక అధికార తెలుగుదేశం అయితే ఈ ఉప ఎన్నిక గెలిచాం. కాబట్టి 2019లోనూ మేమే గెలిచిపోయామన్నట్టు గొప్పలు పోతూ ప్రతిపక్షాలు ఇక అనవసరమని శాసిస్తున్నది. శాసనసభ ఎన్నికల ఫలితాలనే స్థానికాంశాలుగా తీసిపారేసే ప్రధాని మోడీ నంద్యాల ఫలితంపై హర్షం వెలిబుచ్చుతూ ట్వీట్ చేయడమే గాక విజేత భూమా బ్రహ్మానందరెడ్డికి అభినందన కూడా పంపించారు. కాబట్టి ఈ ఎన్నికల ఫలితాలను సాధారణంగా తీసివేయడానికి లేదు. ప్రభుత్వాల మనుగడను ప్రభావితం చేసేవిగాకున్నా వచ్చే ఎన్నికలకు సంబంధించిన రాజకీయ గుణపాఠాలు చాలానే తీసుకోవలసి వుంటుంది.

ఆప్‌కు వూపిరి, ఉపశమనం...

ఢిల్లీనే తీసుకుంటే పాలకపక్షంగా వున్న ఆప్‌కు అత్యంత క్లిష్టమైన సవాళ్ల మధ్య లభించిన ఈ విజయం పెద్ద ఉపశమనం. మోడీ కేంద్రంలో పూర్తి మెజార్టీతో అధికారం చేపట్టిన తర్వాత రాజకీయంగా తొలి దెబ్బ ఢిల్లీలో ఆప్ చేతుల్లో ఘోర పరాజయం. కేవలం 70లో మూడు స్థానాలు తెచ్చుకోవడం. ఆదర్శాల కలయికగా అనేక ఆశలతో ప్రజలు ఆప్‌ను గెలిపించినా తర్వాత ఆ పార్టీ అనేక కల్లోలాలు చవిచూసింది. ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌పై కక్ష గట్టిన కేంద్రం ఢిల్లీ పోలీసువ్యవస్థపై తనకున్న పట్టును ఉపయోగించి నిరంతర వేధింపులకు గురిచేసింది. ముఖ్యమంత్రికి చెప్పకుండానే ఆయన కార్యాలయంపైనా సీబీఐని ప్రయోగించింది. రాష్ట్ర మంత్రులలో అనేకమందిపై ఏదో ఒక కేసు బనాయించింది. వీటికి పాలనా పరమైన అవకతవకలు తోడై ఆప్ అతలాకుతలమైంది. రోజరిగార్డెన్ ఉప ఎన్నికలోనూ, మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలోనూ ఆప్ అపజయాలు మూటకట్టుకుంది. అయినా కేజ్రీవాల్ తనను కాబోయే ప్రధాని పదవి అభ్యర్థిగా వూహించుకుని పంజాబ్, గోవా వంటి చోట్ల తనే ప్రత్యామ్నాయంగా వస్తానని హడావుడి చేసి భంగపడ్డారు. ఈ చేదు అనుభవాల తర్వాత ఇప్పుడు బవానాలో ఆప్ అభ్యర్థి రామచంద్రన్ 24వేల ఓట్ల ఆధిక్యతతో బీజేపీపై గెలుపొందడం రాజకీయంగా పెద్ద వూరట. బీజేపీ తరపున పోటీ చేసింది ఆప్‌నుంచి ఫిరాయించిన పూర్వపు ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ కావడం మరో విశేషం. వరుస దెబ్బల తర్వాత ఆప్ కోలుకోవడం, తన పాలనా పీఠంగా వున్న ఢిల్లీలోనే బీజేపీ ఓడిపోవడం చెప్పుకోదగిన విషయాలు. మరి ప్రజల మనోభావాలు గమనించి ఆప్ ఇప్పటికైనా కుదురుగా పాలిస్తుందా, కేంద్రం కుట్రలు విరమిస్తుందా అన్నది చూడాలి.

గోవాలో యథాతథం

2017 ఫిబ్రవరి శాసనసభ ఎన్నికలలో గోవాలో మెజార్టీ రాకపోయినా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిందంటే కాంగ్రెస్ అసమర్థతే కారణం. బీజేపీ ముఖ్యమంత్రితో సహా చాలామంది మంత్రులు ఓడిపోయారు. కాంగ్రెస్ చొరవ చూపేలోగా బీజేపీ గోమంతక్ పార్టీతో కలసి స్వతంత్రుల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతకు ముందు ముఖ్యమంత్రి పదవి వదలి రక్షణ మంత్రిగా వెళ్లిన మనోహర్ పారికర్ మళ్లీ హుటాహుటిన వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన సభకు ఎన్నిక కావడం కోసమే ఇప్పుడీ ఉప ఎన్నిక జరిగింది. దాంతోపాటే మరో మంత్రి కూడా ఇంకోచోట నుంచి గెలిచారు. ఇవి బీజేపీ స్థానాలే గనక బలాబలాల్లో మార్పేమీ వుండదు.

నాంది, ప్రస్తావనలేమిటి?

ఈ నాలుగు ఉప ఎన్నికల్లోనూ అందరినీ అమితంగా ఆకర్షించింది నంద్యాల ఉప ఎన్నిక. పాలక టీడీపీ అధినేతల అధికార ప్రయోగం, ప్రతిపక్ష వైసీపీ అత్యుత్సాహం అందుకు కారణమైనాయి. రాష్ట్ర విభజన జరిగి, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయంగా జరిగిన తొలి పోటీ ఇదే కావడం మరో కారణం. గతంలో వైసీపీ నుంచి గెలిచి టీడీపీలో చేరిన భూమా నాగిరెడ్డి మరణం వల్ల ఏర్పడిన ఖాళీ కావడం ఇంకో కారణం. చర్చ ఫిరాయింపుల గురించే అయినా అంతకు ముందు తమపై టీడీపీ తరపున పోటీ చేసిన మాజీ కాంగ్రెస్ మంత్రి శిల్పా మోహనరెడ్డిని తమ అభ్యర్థిగా తెచ్చుకుంది వైసీపీ. అక్కడ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేసిన తర్వాతే ఆయన ఇటొచ్చారు. ఈ లోటు కనిపించకుండా జగన్ ఆయన తమ్ముడైన శిల్పాచక్రపాణి రెడ్డికి ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయించారు. అధికారంలో వుంటే ఉప ఎన్నికల విజయం కోసం ఎంత దూరమైనా వెళ్లి పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచే సర్వ శక్తులూ కేంద్రీకరించారు. రాజధానినే నంద్యాలకు మార్చినంత పనిచేశారు. నా రోడ్లపై నడవడం, నా పెన్షన్లు తీసుకోవడం అంటూ మొదట మాట్లాడింది బెడిసికొట్టడంతో అభివృద్ధి పాలన వంటి మంత్రాలు జపించడం మొదలెట్టారు. భూమా

> **శాసనసభ ఎన్నికల ఫలితాలనే స్థానికాంశాలుగా తీసిపారేసే ప్రధాని మోడీ నంద్యాల ఫలితంపై హర్షం వెలిబుచ్చుతూ ట్వీట్ చేయడమే గాక విజేత భూమా బ్రహ్మానందరెడ్డికి అభినందన కూడా పంపించారు. కాబట్టి ఈ ఎన్నికల ఫలితాలను సాధారణంగా తీసివేయడానికి లేదు. ప్రభుత్వాల మనుగడను ప్రభావితం చేసేవిగాకున్నా వచ్చే ఎన్నికలకు సంబంధించిన రాజకీయ గుణపాఠాలు చాలానే తీసుకోవలసి వుంటుంది.**

బ్రహ్మానందరెడ్డినే అభ్యర్థిగాపెట్టారు. తండ్రి చనిపోగానే అఖిల ప్రియను మంత్రిని చేశారు. ఇదంతా నంద్యాలను కాపాడుకునే వ్యూహంలో భాగమే. ఎన్నికల కోసం యాభై మంది ఎమ్మెల్యేలను, 12 మంది మంత్రులతో సహా మొత్తం నాయకత్వమంతటినీ దించారు. కులాలవారీ సమీకరణాలు



ఉధృతం చేసి ఆయా కులాల మంత్రులను కార్పొరేషన్ల చైర్మన్లను రప్పించారు. ఓట్ల కొనుగోలు కోసం నోట్ల వరద పారింది. వైసీపీ సామాజిక సమీకరణలు, నోట్ల పంపిణీ చేయలేదని కాదు. కానీ ప్రతిపక్షంగా దాని పరిమితులు దానికి వున్నాయి. శిల్పా మోహనరెడ్డికి అనుభవం హంగులూ వున్నా జగన్ అక్కడే వుండి పోవడంతో ఉత్సవ విగ్రహంగా మారిపోయారు. జగన్ ఆయన సహచరుల అనుభవ రాహిత్యం, అనాలోచిత వ్యాఖ్యలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. నంద్యాల ఎన్నిక రాబోయే మార్పునకు నాంది అనీ, ప్రభుత్వ విధానాలపై రెఫరెండం అని ప్రకటించేముందు వాస్తవాలను బేరీజు వేసుకున్నారా అనేది సందేహమే. (గతసారి శోభానాగిరెడ్డి మరణానంతర సానుభూతితో కూడా భూమా నాగిరెడ్డి కేవలం 3వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతోనే గెలవగలిగారు తప్ప వైసీపీ కంచుకోట అనుకోవడానికి లేదు.) చంద్రబాబును కాల్చేయాలంటూ మాట్లాడితే ప్రజలు మెచ్చరని కూడా జగన్ తెలుసుకోలేకపోయారు. విమర్శలు వచ్చాకైనా సర్దుకోకపోగా బట్టలు వూడదీయించాలని ఉరి తీయాలని మరింత తీవ్రంగా మాట్లాడి తన ధోరణి అదేనని చెప్పుకున్నారు. వైసీపీ ప్రధాన ప్రచారకర్తగా ఎంచుకున్న సినీ నటి రోజా మంత్రి అఖిల ప్రియ వేషధారణపై వ్యాఖ్యలు చేసి వెగటు పుట్టించారు. దళితులపై మంత్రి ఆదినారాయణ రెడ్డి అవాకులు మాట్లాడారు. అయినా.. అధికారపక్షంతో వుంటేనే అభివృద్ధి అన్న సిద్ధాంతం అక్కడ బాగా ఎక్కింది. ఇప్పటి వరకూ ఎలాగూ అభివృద్ధి జరగలేదు గనక మిగిలిన ఒకటిన్నర ఏడాదైనా ఏదైనా జరుగుతుందనే ఆశతో ప్రజలు అధికార పార్టీకి ఓటేసి వుండొచ్చు.

జయాపజయాలు ఎలా వున్నా నంద్యాలలో విభజితాంధ్రప్రదేశ్ అపరిష్కృత సమస్యలు, కేంద్రం సహాయ నిరాకరణ, బీజేపీ హయాంలో మతోన్మాద దాడులు. దానితో టీడీపీ చెలిమి వంటి అంశాలు చర్చకు రావలసింది. విధానపరమైన తప్పిదాలు, రాయలసీమ సమస్యలు కర్నూలు జిల్లాలోనే ఏకపక్షభూసేకరణ, పునరావాస సమస్యల వంటివి మాట్లాడవలసింది. కానీ బీజేపీకి దగ్గరగా జరిగిన జగన్ ఆ అంశాలు బలంగా ముందుకు తేలేదు. తానే కాబోయే ముఖ్యమంత్రి అన్న ఏకైక కోణంలో దుందుడుకుగా మాట్లాడటం ద్వారా జగన్ వున్న అనుకూలతను కూడా పోగొట్టుకుని అత్యధిక తేడాతో ఓటమి కొని తెచ్చుకున్నారు. తర్వాత కూడా రాజకీయ వాస్తవికత చూపకపోగాఎదురుదాడికే పరిమితమవుతున్నారు. ప్రభుత్వంపైన అధికార దుర్వినియోగంపైనా తప్పక విమర్శ చేయవలసిందే. కానీ తమ తప్పిదాలపై ఆత్మ విమర్శ కూడా జరగాలి. అయితే ఈ ఒక్క విజయంతో తమ విధానాలు మహత్తరమని ప్రజలు తీర్పునిచ్చినట్టు ప్రభుత్వం టముకు వేసుకోవడం, ప్రతిపక్షం అసలు అవసరమే లేదని అపహాస్యం చేయడం మరింత పెద్దపొరబాటు. ఇక్కడ తన విజయాన్ని టీడీపీ అతిగా చూపిస్తుంటే తన పరాజయాన్ని వైసీపీ మరీ తక్కువ చేస్తున్నది. నంద్యాలలో శాంతిభద్రతలు భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని స్వయంగా ముఖ్యమంత్రే ఆరోపించినా వైసీపీ ప్రత్యారోపణలు చేసినా ప్రజలు మాత్రం ప్రశాంతత కాపాడుకోవడం అభినందనీయం. పోలింగ్ తర్వాత కూడా ఉద్రిక్తత పెంచేందుకు, పరస్పర దాడులకు ప్రయత్నాలు జరిగితే ప్రభుత్వ యంత్రాంగం పాక్షికతనే చూపింది. పాలకపక్షీయులు చంద్రబాబు భజన కీర్తనలు పాడి పరవశిస్తుంటే, రోజా వంటి వారు జగన్ ఔన్నత్యంపై పోస్టింగులు పెడుతున్నారు. ఈ వ్యక్తిగత పోకడలు నిరర్థక వాదనలు వాక్ కాలుష్యాలు మాని ప్రజల సమస్యలపైన రాష్ట్రాభివృద్ధి విధానాలపైన కేంద్రీకరించడం శ్రేయస్కరం. ■



జి. తిరుపతయ్య

గుణపాఠం నేర్వాలి

మొన్న టాటాలో సైరస్ మిస్త్రీ నిన్న ఇన్ఫోసిస్‌లో శైలేష్ సిక్కా... వీరిద్దరూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థల్లో అకస్మాత్తుగా నియమించబడి తొలగించబడిన ముఖ్య కార్య నిర్వహణాధికారులు. ఈ సీఈఓల తొలగింపు వ్యక్తిగతమా? కంపెనీ ఐచ్ఛికమా? ప్రభుత్వ పెద్దలు, వార్తా విశ్లేషకులు కొందరు దీనిని పూర్తిగా ప్రయివేటు వ్యవహారంగా పరిగణింప జూస్తున్నారు. కానీ ఇది వ్యక్తిగతం కాజాలదు. ఎందుకంటే వేలకోట్ల ప్రజాధనంతో ఇవి నడుస్తున్నాయి. ప్రజల భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యంతో నడిచేవేవైనా జవాబుదారీ ఉండాలి. ప్రభుత్వం కేవలం అనుమతులిస్తే సరిపోదు, అజమాయిషీ కూడా చేయాలి. కానీ టాటా, ఇన్ఫోసిస్ సీఈఓల తొలగింపు తదితర అంశాల్లో ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం చాలా తప్పు. టాటా గ్రూపును పకడ్బందీగా నడిపిస్తున్న రతన్ టాటా ఉన్నఫళంగా తనంతట తానే వైదొలగి సైరస్ మిస్త్రీ సీఈఓగా చేశారు. విపరీత పొగడ్తలతో ముంచెత్తారు. కొంత కాలం గడిచాక అస్పష్ట ఆరోపణలతో మిస్త్రీని తొలగించారు రతన్‌టాటా. ఇన్ఫోసిస్‌లో కూడా సేమ్ సీన్ రిపీటెడ్, నారాయణమూర్తికి కోపం వచ్చింది సిక్కా తొలగిపోయారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినవారిలో అత్యంత కుబేరుడైన నందన్‌నీలేఖ్‌ని ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. కాబోయే సీఈఓగా ప్రచారంలో ఉన్నారు. ఉద్యోగి తొలగింపు ఒక ప్రయివేటు వ్యవహారమే కావచ్చు. కానీ ఇన్ఫోసిస్ సీఈఓని తొలగించిన వెంటనే ఒక్కరోజులో ముప్పై వేల కోట్లమేర రూపాయలను మదుపర్లు నష్టపోయారంటే పరిస్థితి ఎంత తీవ్రమైందో చూడండి. ప్రయివేటు రంగ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణాలేమికి అద్దం పడుతోంది. ప్రయివేటురంగమంటేనే ఉమ్మడి ప్రయోజనాలకన్నా వ్యక్తి ప్రాబల్యం ముఖ్యమైనది అని మరోసారి రుజువైంది. కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వమే స్థలం కేటాయిస్తోంది. ఇతర మౌలిక వసతులను కల్పిస్తోంది. కానీ వారెన్నుకునే పరిపాలనా వ్యవహారాల్లో నియంత్రణ పెట్టదు. అందుకే వారిష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తూ కొందరికి అవసరానికి మించిన జీతాలు మరికొందరికి తక్కువ జీతాలూ ఇస్తూ దోపిడీ పూరిత మోసాలకు పాల్పడుతారు. డివిడెండ్ల ప్రకటన, వాటాల మూల్యాంకనల్లోనూ లెక్కల్లో తికమకలు చేస్తారని సత్యం కంప్యూటర్స్ కుంభకోణం బయట పెట్టింది. ప్రజలకు నష్టం కలిగిస్తున్న ఈ వ్యవహారాల్లో ప్రభుత్వ పెద్దలు కలుగజేసుకోకపోవడానికి కారణమేమంటే పార్టీ ఫండ్ల రూపంలో ఈ కంపెనీల నుండి వారికి అందుతున్న మొత్తాలేనన్నది వాస్తవం.

ఇలాంటి లోగుట్టు వ్యవహారాలన్నీ ప్రయివేటు రంగంలోనే మనకు కనిపిస్తాయి. కృషి, చార్మినార్, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకులు మొదలుకుని సహారా వరకు ఎన్నో ప్రయివేటు సంస్థలు ప్రజలకు కుచ్చుటోపి పెట్టిన సంఘటనలు మర్చిపోకముందే విజయమాల్యా బాగానే బోల్తా కొట్టించాడు. ప్రభుత్వరంగంలో అజమాయిషీతో పాటు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించ బడతాయి. ఇందుకు విరుద్ధంగా ఆజ్‌తక్ టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ ప్రధాని మోడీ "ప్రభుత్వరంగ సంస్థలు పుట్టేది చావడానికే... కొన్నేమో ఒక్కరిని ముంచి చనిపోతాయి, ఇంకొన్ని యాభై మందిని ముంచి చనిపోతాయి" అంటూ మాట్లాడటం అసత్య ప్రచారమే కాక ప్రయివేటు కంపెనీల పట్ల వారికున్న కృతజ్ఞతాభక్తిని తెలుపుతుంది. ప్రధాని మాటలు పూర్తి అబద్ధం. ఎందుకంటే 70ఏండ్ల స్వతంత్ర భారత్‌లో ఏ ఒక్క ప్రభుత్వరంగ సంస్థా ప్రజలను ముంచిన దాఖలాలు లేవు. 1955 స్టేట్ బంక్ ఆఫ్ ఇండియా జాతీయం చేయబడి స్వచ్ఛమైన సేవలను అందించింది. 1956లో ఎల్ఐసీ జాతీయం చేయబడి ప్రభుత్వానికి మౌలిక వసతుల కల్పనకోసం అత్యంత మొత్తంలో చిన్న మొత్తాల్లో పొదుపును సేకరించి ఇస్తున్నది. 1969లో పద్నాల్గు వాణిజ్య బాంకుల జాతీయకరణ ద్వారా ప్రతీ పల్లెకూ బ్యాంకును పరిచయం చేస్తూ సేవచేశాయి. 1972లో జీఐసీ జాతీయం చేయబడి వాహన, స్థిరాస్తి ఇన్స్యూరెన్సూల్లో రేట్లు తగ్గించి గణనీయమైన మెరుగుదల సాధించింది. వీటితో పాటు ఆయిల్, స్టీల్, కోల్ మొదలగు కంపనీలు ఏవి కూడా ప్రజలను మోసం చేయలేదు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ప్రభుత్వ రంగాలను ప్రయివేటు పరం చేయడానికి తీవ్ర ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నది. ఒక్కసారి ప్రయివేటీకరించబడ్డాక వాటిని స్వాధీన పర్చుకున్నవారు కచ్చితంగా మరో టాటా లేదా మరో ఇన్ఫోసిస్‌లగానో చేయరనే గ్యారంటీ లేదు. ప్రయివేటు కంపెనీలను బ్రహ్మాండంగా నడిపిస్తున్నారనే బిల్డప్ ఇచ్చిన సత్యం రామలింగరాజు, సహారా సుబ్రతోరాయ్ జైల్లో ఉన్నారు. కింగ్‌ఫిషర్ విజయ్‌మాల్యా దొంగలా పారిపోయాడు. అందుకే ప్రయివేటు రంగ వ్యవహారాలపై నిరంతర నియంత్రణ ఉండాలి. ప్రభుత్వ రంగమే మంచిదనే గుణపాఠం నేర్వాలి.

సెల్: 9951300016


బాబాల నేరాలకు వ్యవస్థకూ సంబంధం లేదా..?



సిహెచ్. మధు

నేరస్త గురువుల తయారు చేస్తున్నదెవరూ? ఈ వ్యవస్థ కాదా? ఈ దోపిడీ దుర్మార్గ వ్యవస్థ తనను తాను రక్షించుకోవటానికి గురువుల పెంచుతున్నది నిజం కాదా? గురువులు, బాబాలు, స్వాములు, ఆశ్రమ పీఠాధిపతులు ఎవరు వీరంతా..? ఈ నేరమయ సామ్రాజ్యాన్ని కార్పొరేట్ దోపిడీని రక్షించే శక్తులు కావా? గురువులను పెంచి పోషించాల్సిన అవసరం ఈ వ్యవస్థకుంది... వ్యవస్థ బలహీనత గురువులకు, సాధువులకు, సన్యాసులకు, బాబాలకు తెల్సు... అందుకే బరితెగించారు. వాళ్లకు ప్రభుత్వాలంటే లెక్కలేదు. చట్టాలంటే లెక్కలేదు. సమాజం అంటే భయంలేదు. స్త్రీలంటే విలువలేదు. గురువు విలువలేమిటో వాళ్లకు తెలియదు. శిష్యులను ధర్మహితులుగా ఎలా తయారుచేయాలో తెలియదు. ప్రజల భయాన్ని, భక్తిని సొమ్ము చేసుకునే నైపుణ్యం వారికుంది. భయభక్తుల బలహీనతలను సొమ్ముచేసుకోవటం, వారికి దాసోహం చేసుకోవటం వారి ఆత్మాభిమానాన్ని కొల్లగొట్టటం, వారి వ్యక్తిత్వాన్ని నాశనం చేయటం వారికి తెల్సిన విద్యా వ్యవస్థ తప్పుల మూలంగా ప్రజలలో భయం పేరుకుపోయింది. రేపు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితిలో భయంలో, అనిశ్చితిలో ప్రజలున్నారు. తమ చేతిలో ఏమీలేదని అర్థమయ్యే స్థితిలోకి వారిని పాలకవర్గాలు తెచ్చాయి. ఇది కావాలని చేసిన పని.. ఇది దోపిడీ వ్యవస్థ స్వభావం... దోపిడీ వ్యవస్థ తమ దోపిడీకి అనుగుణంగా ప్రజలను మార్చివేసింది. ప్రశ్నించలేని విధంగా, ఆత్మాభిమానం లేని విధంగా, నిరాశకు లోనయ్యే విధంగా, శాస్త్రీయ దృక్పథానికి దూరంగా ప్రజలు తయారు అయ్యేలా వ్యవస్థను మార్చారు. ప్రజల బలహీనతలు గురువుల బలహీనతలు సర్కారుకు తెల్సు. సర్కారు ఈ దోపిడీ వ్యవస్థకు ప్రధానా కర్షకులు గురువులు, బాబాలు, స్వామీజీలు, పీఠాధిపతులు. ఈ డెబ్బైది ఏండ్ల స్వాతంత్ర్యంలో వీళ్ల డబ్బు, దస్కం, ఆస్తి, స్థిరాస్తులు, ఆశ్రమాలు, వైభోగాలు పెరిగాయి. వీటితో పాటు వీరి భోగాలు, సుఖాలు వైభోగాలు, ఆనందాలు, జల్సాలు విపరీతంగా పెరిగాయి. ఇవి ఎంతగా పెరిగాయో అంతకు ఎన్నో రెట్ల సంఖ్యలో శిష్యులు పెరిగారు. హైటెక్ హంగుల సుఖాలు పెరిగాయి. ప్రపంచీకరణ ఫలితంగా వీళ్లు విస్తరించారు.

విచిత్రం, విషాదమేమిటంటే.. నిస్వార్థంగా, నిగర్వంగా, నిరాడంబరంగా ఉండాల్సిన గురువులు, బాబాలు, స్వామిజీలు, పీఠాధిపతులలో స్వార్థం పెరిగింది. డబ్బు పిచ్చి పెరిగింది. 'నాది' 'నేను' అనే గర్వం పెరిగింది. ఇది ఎక్కడి దాకా దారితీసింది అంటే.. 'నేనే దేవుణ్ని' 'నేను ఈ ప్రపంచంలో' 'అంతా నేనే' అనే వరకెళ్లింది. ఆ మాట రాను రాను బాబా స్వామీజీలలో అహం పెంచింది. శిష్యులు, భక్తులు, సామాన్య జనం ఆ మాట నమ్మే సరికి నిజంగా తామే దేవుళ్లనుకుంటున్నారు. ఆడవాళ్లను శిష్యులను లొంగదీసుకోవటానికి నేనే దేవుణ్ని అనే పదం వాడుకున్నారు. ఆస్తుల సంపాదనకు, ధనార్జనకు 'నేనే దేవుణ్ని' అనే భ్రమను కల్పించారు. తాము ఏది చేసినా పుణ్యమే... పాపం లేదు... తాము రేప్‌లు చేయవచ్చు, హత్యలు చేయవచ్చు... అక్రమంగా భూములు లాక్కోవచ్చు. ఈ పరిణామం ఎందుకొచ్చింది? ప్రజల భయం.. బలహీనతల నుండి పుట్టికొచ్చింది? ఈ పరిణామం ఎందుకొచ్చింది? పాలకుల స్వార్థం మూలంగా పుట్టుకొచ్చింది? పాలకులు ఆశిస్తున్నారు. ప్రజలు భ్రమలలో బతకాలని.. ఊహలలో బతకాలని.. స్వంత శక్తిని.. ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని, చైతన్యాన్ని కోల్పోవాలని.. ప్రజలు అతీత శక్తుల మీద ఆధారపడి బతకాలని.. పాలకులు, కొన్ని రాజకీయ పక్షాలు, దోపిడీ కార్పొరేట్ సామ్రాజ్యాలు, వంచకులు, స్మగ్లర్లు, అవినీతి అధికారులు ప్రజలు బాబాలను స్వామీజీలను నమ్మాలని కోరుకుంటున్నారు. ఎందుకూ? తమను ప్రశ్నించకూడదని... తమ తప్పులను నిలదీయకూడదని, వీళ్లందరికి తెల్సు. వీళ్లందరూ ఒకటే జాతి. తమ స్వార్థం, తమ దోపిడీ. తమ విధానాలు, తమ అన్యాయాల మూలంగానే 70శాతం కలిగిన శ్రామికజనం శ్రమ జీవుల బతుకులు చీకట్లో ఉన్నాయని, దుఃఖపూరితంగా ఉన్నాయని ఆకలీ అరాచకత్వాల మధ్య



అల్లాడుతున్నాయని.. ఈ నిజం సామాన్య ప్రజలు తెలుసుకోకూడదు. తెలుసుకుంటే నడిబజారులో తమను నిలదీయగలరు. వారిని సెంటిమెంట్ లలో, మతం మత్తులో, భక్తి భయంలో ఉంచాలి. తమ బతుకుల చీకటికి అతీతశక్తులు కారణమని భావించాలి. అతీతశక్తులను ఆశ్రయించాలి... ఇందుకు స్వామీజీలు, పీఠాధిపతులు, బాబాలు... గురువులు మంచి మార్గంగా భావించారు. వాళ్లను పెంచారు. పాలకుల అండదండలు లేకపోతే డేరా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు ఎందుకంత గర్వం... ఎందుకంత అహంకారం? ఆయన దేవుడా..? ఆయన గురువా? ఆయన ఒక బాబాయా? హంతకుడు, రేపిస్టు, భోగలాలసుడు. డబ్బు వేటగాడు. ఆయనొక దేవుడా? సీబీఐ కోర్టు నేరస్తుడని ప్రకటించే వరకు ఆయన దేవుడు... లక్షల మందికి గురువు... ఎందుకంత తెగువ? పాలకపక్షం అండవుంది కనుక... తనను ఎవరూ ఏమీచేయలేరని అహంకారంతో ఆఖరుకు కోర్టు తీర్పును 'హింస' ద్వారా సవాల్ చేసాడు. ఒక రకంగా ఆలోచిస్తే డేరా చీఫ్ నేరస్తుడని సీబీఐ కోర్టు ప్రకటించిన తర్వాత జరిగిన హింస, ఆస్తుల ధ్వంసం, 38 మంది మృతి ఎంతో విషాదకరమైన ఘటన అయినా, జాతి భవిష్యత్తు భయపడాల్సిన ఘటన అయినా జాతికి ఒక మంచి మేలు చేసింది. ప్రజలు బాబాలను, స్వాములను అసహ్యించు కునేలా చేసింది. అన్నిటికంటే పెద్ద మేలు ఈ దేశాన్ని, ఈ జాతిని ఇటువంటి వంచకుల నుండి స్వాముల నుండి స్వాములకు రక్షణయిచ్చే పాలకుల నుండి తాము రక్షిస్తామని, తమకు ఆ శక్తి ఉందని, రాజ్యాంగం యిచ్చిన శక్తితో జాతిని రక్షిస్తామని న్యాయస్థానం కన్నెర్ర చేసింది. రంగంలోకి దిగింది. చండీఘడ్ హైకోర్టు తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. డేరా చీఫ్, శిష్యులు తమను ధిక్కరించటంగా, న్యాయస్థానాన్ని సవాల్ చేయటంగా భావించింది. ఒకవేళ డేరా శిష్యులు తమ అహంకారాన్ని హింస ద్వారా బయటపెట్టకపోతే.. ఏదో శిక్ష పడేది. బెయిల్ దొరికేది. మళ్ళీ చీకటి సామ్రాజ్యం కొనసాగేది.

పాలకుల అండదండలు లేకపోతే బాబాలు ఇన్ని ఆస్తులు ఎలా సంపాదిస్తారు? ఎక్కడ దొరికితే అక్కడ ఆశ్రమాల పేరుతో భవనాలు, వైభోగాలు, హెలికాప్టర్లు, భోగాలు, సుఖాలు... ఇందులో సగం ఏవో ప్రభుత్వ నిధుల నుండి వచ్చినవే. అంతా ప్రజల సొమ్ము మాత్రమే.. దేవుని పేరుతో వెలిగిపోయే ఈ స్వాములకు ఏసీలు కావాలి, బంగారాలు కావాలి, పట్టు వస్త్రాలు కావాలి. చలువ మంచాలు కావాలి. తమ శరీరాలను విసనకర్రగా విసిరే అందాలు కావాలి.. వీళ్లు బాబాలు గురువులు, స్వామిజీలు.. సిగ్గులేని దొంగలు.. దేవుళ్ల పేరుతో మోసగాళ్లు..

ప్రపంచంలో వీళ్లు ఎలా ఆశ్రమాలు నెలకొల్పుతున్నారు? ప్రపంచ ప్రజలంతా భయంతో ఉన్నారు. ప్రపంచమంతా భయంలో ఉంది. ఆ భయమే వీరు సొమ్ము చేసుకుంటున్నారు? అమెరికా ఏ దేశాన్ని ఆక్రమించుకుంటుందో తెలియదు? ఏ కొరియా ఏ అణ్వస్త్రం పేల్చుతుందో తెలియదు. ఏ ఉగ్రవాది ఎందరిని బాంబుకు బలిచేస్తాడో తెలియదు. ప్రపంచం భయంలో ఉంది. ప్రపంచాన్ని భయంలో పెట్టి పాలక పక్షాలు, కార్పొరేట్ సామ్రాజ్యాలు ఇటువంటి బాబాలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ సుఖాలు అనుభవిస్తున్నారు.

ఇప్పటికే ఇటువంటి బాబాల, స్వాముల తతంగాలు ఎన్నో బయటపడ్డాయి. ఎందరో జైళ్లలో ఉన్నారు ఎందరి మీదో కేసులు నడుస్తున్నాయి. ఇందులో అత్యధికశాతం రేపిస్టులే! ఈ బాబాల స్వాముల దుర్మార్గాలకు రెండు కనిపించని కారణాలున్నాయి. 1. బ్రాహ్మణాధిక్య భావజాలం 2. పురుషాధిక్య భావజాలం. ఇప్పటికీ దేవునిగా కొలుస్తున్న పుట్టపర్తి బాబాపై కూడా ఇటువంటి ఆరోపణలు ఎన్నో వచ్చాయి. వీళ్లంతా దొంగబాబాలు, దొంగ స్వామీజీలు.. ఈ వ్యవస్థలో యిలాంటి వాళ్లే మన్ననలు, పాదపూజలు పొందుతున్నారు.

సెల్: 9949486122



తురగా జానకీరాణి
(ఆగస్టు 31, 1936- అక్టోబర్ 15, 2014)

రేడియో అక్కయ్య

మహిళలను, పిల్లలను రేడియో శ్రోతలుగా మార్చిన ఘనత ఆమెకే దక్కుతుంది. రేడియో అనేది కేవలం సమాచారాన్ని చేరవేసే సాధనంగానే కాకుండా.. వినోదం అందిస్తూ.. విజ్ఞానం కల్పిస్తూ.. అవగాహన పెంపొందించే మాధ్యమంగా మార్చారు. చిన్నలు ,పెద్దలు అన్న తేడా లేకుండా అందరితో రేడియో అక్కయ్యగా ఆత్మీయానుబంధాన్ని పెనవేసుకున్నారు. ఆమె తురగా జానకీరాణి..

కృష్ణాజిల్లా లోని మందపాకల గ్రామంలో జానకీరాణి జన్మించారు. రేడియో ఆర్టిస్ట్‌గా నాటకాలలోనూ, ఇతర కార్యక్రమాలలోనూ విశేష అనుభవంతో జానకీ రాణి 1975 లో ఆకాశవాణిలో ఉద్యోగంలో చేరారు. ఎమర్జెన్సీ అమలులో ఉన్న కాలం... ఆకాశవాణి ద్వారా ప్రభుత్వ పాలసీలు, విధానాలు ప్రజలకి చేరవేయడాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు

పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే బాలానందం కార్యక్రమం ద్వారా ఎన్నో ప్రయోగాలు చేశారు. సాహిత్యాన్ని చిన్నారులకు చేరువ చేశారు. పిల్లల్లో పబ్లిక్ స్పీకింగ్ భయంపోయి ధైర్యంగా మాట్లాడటానికి, వారిలోని స జనాత్మకతను బయటకు తీసుకురావడానికి 'బాలానందం' ఒక వేదికగా మారింది. ప్రత్యేకంగా పిల్లల కోసం పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటిని చిన్నారులతో ప్రదర్శింపచేశారు.

మహిళల కోసం కొత్త ప్రయోగాలు చేసారు. "ఇది నా సమస్య" అన్న స్త్రీల కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఉత్తరాల ద్వారా తమ సమస్యలు రాస్తే వాటికి ఆయా రంగాలలో నిపుణులైన వారితో పరిష్కారాలు ప్రసారం చేసేవారు. మహిళలు రాసిన కవితలు, కథలు, పాటలు ప్రసారం చేస్తూ.. మహిళలకు రేడియోను ఒక నేస్తంగా మార్చారు. ప్రజల మధ్యకి వెళ్ళి వారి అనుభవాలు తెలుసుకునేలా చాలా క్రార్యక్రమాలు నిర్వహించారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా వీధి నాటకాలు రూపొందించారు. ఇవి ఉండేవి. "మా చేతి పంపు-మా బిందె నింపు" అనే సామాజిక అవగాహన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఎన్నో వినూత్న కార్యక్రమాల ద్వారా రేడియో ప్రసారాలను అందరికీ చేరువ చేసిన ఆమె 1994 లో ఐ.బి.పి.ఎస్. అసిస్టెంట్ డైరెక్టర్ గా పదవీ విరమణ చేశారు. సరికొత్త కార్యక్రమాల రూపకల్పనతో పాటు ఆమె వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. మూడు నవలలు రాసారు. అనువాద రచనలు చేశారు.

Women of the day

జానకీరాణి అనేక అవార్డులను అందుకున్నారు. బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న', తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం (రెండుసార్లు). రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం వాటిలో కొన్ని మాత్రమే..

ప్రముఖ జర్నలిస్టు తురగా క ష్ణమోహన్‌ను 1959లో పెండ్లి చేసుకున్నారు. ఇద్దరు అమ్మాయిలు.. ఉషారమణి, వసంతశోభ. పిల్లల చిన్నతనంలోనే కృష్ణమోహన్ యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఇంటిని, ఉద్యోగాన్ని బ్యాలెన్స్ చేస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా మారారు. ఉషారమణి ప్రస్తుతం ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తూ.. తల్లి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. మరో అమ్మాయి వసంత శోభ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. తల్లి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మేటి రచయితకు లైఫ్ టైమ్ అవార్డుగా 'తురగా జానకీరాణి సాహిత్య ప్రకర్ష పురస్కారం' అందిస్తున్నారు. ❄

జ్యువెలరీ క్లీనింగ్...



వెండి గొలుసులు, రింగ్‌లు, కమ్మలు ఇలాంటి చిన్న చిన్న వస్తువులపై ఉండే మరకలు తొలగించడం ఓ సమస్య! రసాయన పదార్థాలు అధికంగా ఉండే సబ్బులను, షాంపులకు ఉపయోగించటం వల్ల వాటిపై ఉన్న కోటింగ్ పోతుంది. జ్యువెలరీ కోటింగ్ పోకుండా శుభ్రం కడుక్కోవాలంటే కింది చిట్కాలను పాటించాల్సిందే !

- గొలుసులను, చిన్నగా ఉండే వెండి పాత్రలను శుభ్రం చేయడానికి రోజు ఉపయోగించే టూత్ పేస్టును వాడితే సరిపోతుంది. టూత్ పేస్టును ఉపయోగించటం వల్ల వెండి పాత్రలపై ఉండే కోటింగ్ తొలగిపోకుండా కాపాడుతుంది. అలాగే పాత్రల మీద ఉన్న మరకలు, గీతలు కనిపించవు.
- పెద్దగా ఉండే వెండి పాత్రలను శుభ్రం చేయటానికి బేకింగ్ సోడాను ఉపయోగిస్తే సరిపోతుంది. ఒక మగ్ నీటిలో బేకింగ్ సోడాను వేసి బాగా కలపాలి. ఇలా కలిపిన తర్వాత స్పాంజ్‌తో ఆ పాత్రలను తొమితే సరిపోతుంది. ఇలా తోమిన తర్వాత వేడి నీటితో కడిగితే మంచిది. పాత్రలపై పడిన గీతలు తొలగిపోయి మృదువుగా తయారవుతాయి.
- వెండి వస్తువులు ఎక్కువగా నల్లబడినట్టు కనిపిస్తే ఇలా చేయండి. బేకింగ్ సోడా పేస్టును పాత్రలకు గంట సమయం పట్టించి ఆ తర్వాత వేడి నీటితో కడిగితే సరిపోతుంది. పాత్రలు తళతళలా మెరుస్తాయి. ❄



అలసిన పిల్లల కేరింతలు మళ్లీ మొదలవాలన్నా, పిల్లల అల్లరిని ప్రేమగా ఆపాలన్నా, అమ్మ ప్రేమను తీయగా పంచాలన్నా తీయగా వేడిగా ఉండే సూప్స్‌ను తాగించండి. సూప్స్ పిల్లల ఆకలిని పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అలాగే శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మరి ఇంకెందుకు ఆలస్యం ఓ సారి ప్రయత్నించి చూడండి !

ఘాటుగా.. హాటుగా...

టమాటో సూప్...

కావలసిన పదార్థాలు : తరిగిన టమాటాలు-ఒక కప్పు, మిరియాలు-సగం చెంచా, లవంగాలు-నాలుగు, బిర్యాని ఆకులు-రెండు, ఉల్లిముక్కలు-సగం కప్పు, కార్న్‌ఫ్లోర్-రెండు చెంచాలు, మిరియాల పొడి-ఒక చెంచా, ఉప్పు-తగినంత, వేయించిన బ్రెడ్‌ముక్కలు -ఒక కప్పు.

తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద పాత్ర పెట్టి నీళ్లు పోసుకోవాలి. ఆ నీటిలో టమాటా ముక్కలు, మిరియాలు, ఉల్లిముక్కలు, బిర్యాని ఆకులు వేసుకొని ఉడికించుకోవాలి. ఇది చల్లారాక మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న తర్వాత వడబోసి మళ్ళీ పది నిమిషాలు ఉడించుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత దాంట్లో నూనెలో వేయించిన బ్రెడ్ ముక్కలు వేసుకుంటే సరిపోతుంది.





వెజిటేబుల్ సూప్...

కావలసిన పదార్థాలు : బీన్స్-ఒక కప్పు, క్యారెట్స్-ఒక కప్పు, క్యాలీఫ్లవర్-ఒక కప్పు, కొత్తిమీర తురుము-ఒక కప్పు, స్వీట్ కార్న్-ఒక కప్పు, ఉప్పు-తగినంత, బ్రెడ్ ముక్కలు-ఒక కప్పు.

తయారీ విధానం : బీన్స్, క్యారెట్స్, క్యాలీఫ్లవర్, కొత్తిమీరను శుభ్రంగా కడగాలి. వీటినిని చిన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ఇలా పెట్టుకున్న తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి నీళ్లు పోసుకొని మరిగించుకోవాలి. ఈ నీళ్లు మరుగుతున్న క్రమంలోనే తరిగిన ముక్కలను వేసి మెత్తగా ఉడికించుకోవాలి. ఆ తర్వాత దాంట్లో మిరియాల పొడి, ఉప్పు, లవంగాల పొడి, కార్న్‌ఫ్లోర్, కొత్తిమీర వేసుకుంటే సరిపోతుంది. వేడి వేడి వెజిటబుల్ సూప్ రెడీ !

స్వీట్ కార్న్ సూప్...



కావలసిన పదార్థాలు : వెజిటబుల్ స్టాప్, స్వీట్ కార్న్-ఒక కప్పు, తరిగిన బీన్స్-ఒక కప్పు, తరిగిన క్యారెట్ ముక్కలు-ఒక కప్పు, వెల్లుల్లి రెబ్బలు-నాలుగు, చక్కెర-రెండు చెంచాలు, ఉప్పు-రుచికి సరిపడా, బ్రెడ్ ముక్కలు-ఐదు, నూనె-ఒక చెంచా.

తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద పాత్ర పెట్టి నీళ్లు పోసుకోవాలి. దాంట్లో వెజిటబుల్ స్టాప్, స్వీట్ కార్న్, బీన్స్, క్యారెట్స్‌ను నీటిలో వేసుకొని మరిగించుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత వెల్లుల్లిపాయ రెబ్బలు, కొద్దిగా చక్కెర, కొద్దిగా ఉప్పు వేసి ఉడికించుకున్న తర్వాత కార్ల్‌ఫ్లోర్ ను నీటిలో కలుపుకోని, మరుగుతున్న నీటిలో కలుపుకోవాలి. ఆ తర్వాత ఒక చెంచా నూనె వేసుకొని ఐదు నిమిషాలు ఉడికించుకుంటే సరిపోతుంది. చివరగా నూనెలో దోరగా వేయించిన బ్రెడ్ ముక్కలను వేసుకుంటే చాలు తీయ తీయాని స్వీట్ కార్న్ సూప్ రెడీ !

స్వీట్ కార్న్, టమాటా



కావలసిన పదార్థాలు : వెల్లుల్లి ముక్కలు-ఒక కప్పు, వెల్లుల్లి రెబ్బలు-నాలుగు, టమాటా ముక్కలు-ఒక కప్పు, ఉప్పు-రుచికి తగినంత, బట్టర్-ఒక చెంచా, మిరియాల పొడి-ఒక చెంచా, లవంగాలు-నాలుగు, బాదం తురుము-ఒకచెంచా, స్వీట్ కార్న్-ఒక కప్పు, వెనిగర్-ఒక చెంచా, కార్న్‌ఫ్లోర్-ఒక చెంచా, చక్కెర-రెండు చెంచాలు. కొత్తిమీర తురుము-ఒక కప్పు.

తయారీ విధానం : ముందుగా ఒక పాత్రలో నీళ్లు పోసుకొని బాగా మరిగించుకోవాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు వెల్లుల్లిముక్కలు, ఉల్లిముక్కలు, టమాటా ముక్కలు, ఉప్పు, బటర్, లవంగాలు, మిరియాల పొడి, స్వీట్ కార్న్, బాదం తురుము, వెనిగర్, కార్న్‌ఫ్లోర్, చక్కెర వేసి 15 నిమిషాలు బాగా ఉడికించుకోవాలి. ఆ తర్వాత దాంట్లో కొత్తిమీర తురుము వేసుకుంటే సరిపోతుంది.

క్యారెట్ సూప్

కావలసిన పదార్థాలు : బటర్-రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు-నాలుగు, ఉల్లిముక్కలు-ఒక కప్పు, ఉప్పు-రుచికి తగినంత, క్యారెట్ తురుము-ఒక కప్పు, మిరియాల పొడి-ఒక చెంచా, వెజిటబుల్ స్టాక్-రెండు కప్పులు, కొత్తిమీర తురుము సరిపడా, నిమ్మరసం-ఒక చెంచా.

తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద పాత్ర ను పెట్టుకోవాలి. దాంట్లో బటర్ వేసుకోవాలి. ఇది కాస్త వేడి కాగానే దాంట్లో వెల్లుల్లి రెబ్బలు, ఉల్లిముక్కలు, క్యారెట్ ముక్కలు వేసుకొని మెత్తగా ఉడికించుకోవాలి. ఇవి ఉడుకుతుండగానే వెజిటబుల్ స్టాప్, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసుకొని పది నిమిషాలు మరిగించుకుంటే సరిపోతుంది. చివరగా కొత్తిమీర తురుముతో గార్నిష్ చేసుకుంటే చాలు క్యారెట్ సూప్ రెడీ !



చంద్రో తొమార్... ప్రపంచంలోనే అత్యంత అధిక వయసు మహిళా షార్ప్ షూటర్. చూడటానికి సంప్రదాయ బామ్మలా కనిపిస్తుంది. ఆమెకు ఎనిమిది మంది కొడుకులు, కూతుళ్లు. 15 మంది మనవలు, మనవరాండ్లు. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లాలో ఉన్న జోహ్రి అనే చిన్న గ్రామం. అక్కడ అందరూ ఆమెను 'షూటర్ దాదీ', 'రివాల్వర్ దాదీ' అనోపిలుస్తారు. 25 నేషనల్ ఛాంపియన్‌షిప్స్ గెలుచుకున్న దాదీ 65 ఏండ్ల వయసులో షూటింగ్ నేర్చుకుంది. ఆసక్తి ఉండాలే కానీ.. నేర్చుకోవడానికి వయసు అడ్డం కాదని నిరూపించింది.



రివాల్వర్ దాదీ...

అందరు బామ్మల్లాగే.. ఇంట్లో పనులు పాలు పితకడం, రోటీ తయారు వంటి పనులు చేస్తుంది. ఆ తరువాతే అసలైన స్టంట్ మొదలవుతుంది. అదే రైఫిల్ షూటింగ్. షూటింగ్ ఆలోచన ఎలా వచ్చిందనుకుంటున్నారా? చంద్రో తొమార్ దాదీ మనవరాలు షెఫాలీకి షూటింగ్ నేర్పించాలనుకున్నారు తల్లిదండ్రులు. అయితే కూతురును ఒక్కదాన్నే బయటకు పంపలేక దాదీని వెంట పంపారు. రేంజ్‌కు వెళ్లిన తరువాత షెఫాలీ రైఫిల్ పట్టుకోవడానికే భయపడింది. అది పోగొట్టేందుకు దాదీ పిస్టల్ పట్టుకుంది. అలా మనవరాలికి షూటింగ్ నేర్పిస్తూ, తాను నేర్చుకుంది. దాదీ షూటింగ్ స్కిల్స్ చూసిన క్లబ్ కోచ్ ఫరూక్ పఠాన్ అచ్చెరువొందాడు. అంతేకాదు.. ట్రైనింగ్ తీసుకోవాలని దాదీని కోరాడు. మొదట మనవరాలు కోసం వెళ్లిన రైఫిల్ క్లబ్‌కు వెళ్లిన దాదీ తరువాత నేర్చుకోవడం కోసం వెళ్లింది. రెండేండ్లలో పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగింది. 1999 నుంచి ఇప్పటివరకు 25 ఛాంపియన్‌షిప్స్ గెలుచుకుంది దాదీ.

'తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచింది' అని పాత సామెత ఉంది. కానీ ఇక్కడ దీన్ని తిరగేసి చదువుకోవాలి. ఎందుకంటే దాదీ గ్రామాల్లో మహిళల స్థితిగతులనే మార్చేసింది. ఆయా గ్రామాల్లో ఆడవాళ్లు బయటకు వెళ్లడమే నిషిద్ధం. ఇంటి పనులకు మాత్రమే పరిమితం. అలాంటిది... దాదీ షూటింగ్‌లో సాధించిన రికార్డులు చూసిన తరువాత ఇప్పుడు 25మందికి పైగా మహిళలు శిక్షణ కోసం రైఫిల్ క్లబ్‌లో చేరారు.



ఆమె మరదలు ప్రకాశిని తొమార్ కూడా దాదీ బాటలోనే నడిచింది. దాదాపు దాదీ వయసులోనే ఉన్న ఆమె దాది స్ఫూర్తితో రైఫిల్ షూటింగ్ నేర్చుకుంది. ఎన్నో పోటీల్లో పాల్గొని.. పోలీసు అధికారులను సైతం ఓడించి రికార్డు సృష్టించింది.

2010లో జరిగిన రైఫిల్ అండ్ పిస్టల్ వరల్డ్‌కప్‌లో దాదీ కూతురు సీమ మెడల్ గెలుచుకుంది. మనవరాలు షెఫాలీ తోమర్ కూడా ఎన్నో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నది. దాదీకి ఫేస్‌బుక్‌లో చాలా ఫాలోయింగ్ ఉంది. జాతీయ, అంతర్జాతీయ టీవీ ఛానల్స్‌లో ఆమె పేరు మారుమోగింది. సంకల్పం ఉండాలేగానీ... వయసు ఒక సంఖ్య మాత్రమే అని నిరూపించింది దాదీ. ఈ వయసులోనూ దాదీ ఖాళీగా ఉండటం లేదు. రైఫిల్‌క్లబ్‌కు వెళ్లి శిక్షణ ఇస్తుంది. దాదీ నేర్పడం వల్ల ఓ ప్రయోజనం కూడా ఉంది... 80 ఏండ్లకు పైబడిన వయసులో దాదీ చేయగా లేనిది.. 20 ఏండ్ల వయసులో మేమేందుకు సాధించలేం అని పోటీ పడుతున్నారు యువతులు. ❄

మారిన ఆహారపు అలవాట్లు, పెరిగిన మానసిక ఒత్తిడి కారణంగా నేటి యువత బరువు పెరిగిపోతున్నారు. పెరిగిన బరువును తగ్గించుకోవడానికి ఫిట్‌నెస్ సెంటర్ల చూట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో మరింత ఢీలా పడిపోతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు తమకు వీలైనప్పుడల్లా కాకుండా రోజూ పొద్దున్నే ఎక్సర్‌సైజులు చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. శాస్త్రీయంగా, ఆరోగ్యకరమైన విధానాల ద్వారా బరువు తగ్గే మార్గాలను సూచిస్తున్నారు.



లేలేత సూర్య కిరణాలతో..

భారీ శరీరంతో ఏ రైతు మనకు కనిపించరు. కారణం.. పొద్దు పొడవకముందే నిద్రలేచి సూర్యకిరణాలు భూమిని తాకే సమయానికి పొలం పనులతో బిజీగా మారిపోతారు. ఇటీవల జరిపిన ఓ సర్వే ప్రకారం,

ఉదయాన్నే సూర్య కిరణాలు తాకడం ద్వారా బరువు తగ్గుతారని స్పష్టమైంది. వ్యాయామాలు ఎప్పుడు చేసినా ఆరోగ్యానికి మంచిదే, కాని ఉదయన్నే చేయడంతో ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. వ్యాయామం చేయాలనుకునే వారు తమకు ఇష్టం వచ్చిన టైంలో కాకుండా పొద్దున్నే చేస్తే ఎక్కువ క్యాలరీస్ ఖర్చు అవుతాయి. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్ ఏదైనా సరే పొద్దున్నే చేస్తే మంచిది.

ప్రోటీన్స్ ఎక్కువగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్..

బరువు తగ్గాలనుకునేవారు ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటే మంచిది అన్న విషయంపై చాలా పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. ప్రోటీన్స్ ఎక్కువగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్ బరువు తగ్గిస్తుందని స్పష్టమైంది. ముఖ్యంగా, ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉన్న పదార్థాలు తీసుకోవడం మంచిది. ❄

ఆంధ్రప్రదేశ్ నవతెలంగాణ

ఉరకలేస్తున్న గోదావరి

- భద్రాచలం వద్ద 23.03 అడుగులు
- సముద్రంలోకి 2.59 లక్షల క్యూసెక్కులు



రాజమహేంద్రవరం: గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.03 అడుగులకు పెరిగింది. అదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.80 అడుగులకు చేరింది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.50 మీటర్లకు పైకి లేపి 2.59 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం పాండ్ లెవెల్ 39.06 మీటర్లు ఉంది. గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో కాళేశ్వరం వద్ద బుధవారం 4.68 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పేరూరు వద్ద 4.87 అడుగులు, దుమ్ముగూడెం వద్ద 7.66 అడుగులు, కూనవరం వద్ద 8.02 అడుగులు, కుంట వద్ద 8.74 అడుగులు, కోయిదా వద్ద 11.56, పోలవరం వద్ద 8.11, రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి వద్ద 14 అడుగుల నీటిమట్టం నమోదైంది. అదే సమయంలో గోదావరి డెల్టా కాల్వలకు 10,900 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేశారు. తూర్పు డెల్టా కాల్వలకు 3,600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా కాల్వలకు 5,000, మధ్యడెల్టా కాల్వలకు 2,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సెప్టెంబర్ 27న నిర్మాణ కార్మికుల 'డిమాండ్స్ డే '



- సీడబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి

అమరావతి : నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 27న దేశవ్యాప్తంగా దేశ వ్యాప్తంగా 'డిమాండ్స్ డే' పేరిట ఆందోళనలు చేపడతామని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి ప్రకటించారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు జరిగిన ఫెడరేషన్ 60వ కార్యవర్గ సమావేశం వివరాలను ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా దాదాపు ఆరు కోట్ల మంది నిర్మాణ రంగ కార్మికులుంటే వారిలో రెండు కోట్ల మంది మాత్రమే కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదయ్యారని ఆయన తెలిపారు. కేవలం మూడింట ఒక వంతు మంది కార్మికులే ఈ బోర్డులో రిజిస్టర్ అయ్యారని, మిగిలిన వారినీ నమోదు చేయించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. 1996లో పార్లమెంట్ సాక్షిగా తీసుకొచ్చిన ఈ బోర్డు ద్వారా పూర్తి స్థాయిలో ఆ రంగంలోని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులను వెచ్చించడంలేదని ఆయన విమర్శించారు.

విశాఖ ఎయిర్‌పోర్టులో తప్పిన పెను ప్రమాదం

విశాఖపట్నం : విశాఖ ఎయిర్ పోర్టులో ఇండిగో విమానానికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి బెంగుళూరుకు బుధవారం ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరిన ఇండిగో విమానం టేకాఫ్ కాగానే ప్రొపెల్లర్‌లో గద్ద అడ్డం పడింది. పెనుప్రమాదం సంభవించే అవకాశముందని గుర్తించిన పైలెట్ వెంటనే విమానాన్ని కిందకు దించేశారు. పైలట్ విమానాన్ని అత్యవసరంగా దించేయడంతో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తప్పింది.

మహిళా కూలీల రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

- పలు తీర్మానాల ఆమోదం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా కూలీల రాష్ట్ర సదస్సు సూర్యాపేట జిల్లా కోదాడలో విజయవంతంగా ముగిసిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తెలిపారు.

ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించినట్టు చెప్పారు. 28 మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఎన్నికైందని చెప్పారు. (కన్వీనర్‌ను తర్వాత ఎన్నుకుంటారు) సదస్సులో మహిళా కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. తక్షణ కర్తవ్యా ల అమలుకు సదస్సు పిలుపునిచ్చిందని చెప్పారు. కనీస వేతన చట్టాన్ని సవరించాలని, వేతనం రూ.300 పెంచాలని, సర్కారు ఇచ్చే మూడెకరాల భూమిని మహిళల పేర ఇవ్వాలని, బెల్టుషాపులను రద్దు చేయాలని, ఇండ్లు, ఇంటిస్థలాలు, ఉపాధి హామీలో వేతనం రూ.300 చేయాలని, 200 పనిది నాలను కల్పించాలని తీర్మానాలను ఆమోదించారు. కన్వీనింగ్ కమిటీలో జుజ్జిరి సుశీల, ముల్లంగి లక్ష్మి, రాజనేని మంగమ్మ, లింగాల దీనమ్మ, తోట సుజాత (ఖమ్మం), వినోద, పద్దం సుగుణ (కొత్తగూడెం), వి.పద్మ,వి.పారిజాత (సూర్యాపేట), బి.పద్మ, బాగ్యమ్మ, శవ్య ధనలక్ష్మి(నల్లగొండ), రాములమ్మ (యాదాద్రి), దానమ్మ (మహబూబ్‌నగర్),వెంకటమ్మ (నాగర్‌కర్నూల్), విజయమ్మ, మీనాక్షి(రంగారెడ్డి), ఎ.గీత(సంగారెడ్డి), కుంటి రేణుక(సిద్దిపేట), తోటకూర పద్మ, బండారి సత్యమ్మ(జనగామ), చారు అనిత, మల్లం పద్మ(మహబూబాబాద్), ఎం.శారద, రుద్రారపు లక్ష్మ(వరంగల్), శారద(జగిత్యాల), రేణుక (కరీంనగర్),మద్దమ్మ(గద్వాల) తదితరులు ఉన్నారు. డ్వాక్రా మహిళా లీడర్ల జిల్లా సమావేశాలు నిర్వహించాలని, మహిళా కూలీల జిల్లా సదస్సులు జరపాలని, కనీస వేతన చట్టం సవరించి కూలీ రేట్లు పెంచి అమలుపరచాలని, కరపత్రాలు విస్తృతంగా పంచాలని తక్షణ కర్తవ్యాలుగా నిర్ణయించారు. సదస్సు సందర్భంగా ప్రత్యేక తీర్మానాన్ని సైతం ఆమోదించారు.

మూడేండ్ల ఫీజుల వివరాలివ్వండి

- ప్రయివేటు పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు పాఠశాలల్లో మూడేండ్ల ఆదాయ, వ్యయాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీచేశారు. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిరుపతిరావు కమిటీ సూచన మేరకు ఈ వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆయన డీఈఓలకు బుధవారం ఆదేశాలిచ్చారు. రాష్ట్ర సెలబస్ పాఠశాలలతో పాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కెంబిడ్జి తదితర స్కూళ్లు కూడా 206-16, 2016-17 విద్యాసం వత్సరానికి సంబంధించిన లెక్కలతో పాటు, ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు ఇవ్వాలని కోరారు. వివరాల సేకరణ కోసం విద్యాశాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందనీ, దాన్ని 'సీడీఎస్ ఈ.తెలంగాణ' వెబ్‌సైట్‌కు అనుసంధానం చేసినట్టు చెప్పారు. సెప్టెంబర్ 15లోగా వివరాలను వెబ్‌సైట్ ద్వారా యాజమాన్యాలు అందించాలని ఆదేశించారు. గడిచిన రెండేండ్లలో పాఠశాలల ఆదాయంతో పాటు వ్యయానికి సంబంధించిన లెక్కలు ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని యాజమాన్యాలను ఆయన హెచ్చరించారు.

పంచాయతీరాజ్ ఇంజనీర్ల ధర్నా



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్(రిటైర్డ్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జగిత్యాల జిల్లా వెలగటూరు పంచాయతీరాజ్ ఎఈ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన నిర్మల్ ఈఈ రఘువీరారెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖలో అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు ధర్నాకు దిగాయి. బుధవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో వందలాది మంది ధర్నా చేశారు. ఈఈ వేధింపుల కారణంగా శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం అన్నారు. ఈఈని సర్వీసు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజినీర్ ఇన్ చీఫ్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నిర్మల్ ఈఈని బదిలీ చేసినట్టు చెప్పారు. సస్పెన్షన్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. అంతకుముందు జస్టిస్ చంద్రకుమార్(రిటైర్డ్) మాట్లాడుతూ యువ ఇంజినీర్ శ్రీకాంత్ చనిపోవడం బాధాకరమన్నారు. వేధింపులపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థిక సాయం సైతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో వందలాది మంది ఇంజినీర్లతోపాటు ఆయా సంఘాలు, అసోసియేషన్ల నాయకులు కె శ్యామ్‌సుందర్, తల్క అంజయ్య, సుధాకర్, ముజీబ్, రజిత, సీఈ జాన్‌మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలోనే టీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- ఉద్యమ కార్యకర్తలకు గుర్తింపు లేదని ఆవేదన
- గాంధీకి తరలింపు...పరిస్థితి విషమం

నవతెలంగాణ-తాండూరు

'14 ఏండ్లుగా టీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేస్తున్నా. పార్టీలో ఉద్యమ కార్యకర్తలకు గుర్తింపు కరువైంది. బయట నుంచి వచ్చినవారికి, పనిచేయని వారికి పదవులు కట్టబెడుతూ అధిష్టానం అన్యాయం చేస్తోంది' అంటూ ఓ టీఆర్ఎస్ కార్యకర్త మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అతన్ని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్‌లో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం...తాండూరు పట్టణ కేంద్రంలోని సమాద్ ఫంక్షన్ హాల్‌లో టీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ తాండూరు పట్టణ మాజీ అధ్యక్షులు అయూబ్‌ఖాన్ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి అంటూ వేదికనెక్కి ఆవేశంతో మాట్లాడాడు. 'టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా. నాయకులు సరైన గుర్తింపు ఇవ్వట్లేదు. అధిష్టానం పనిచేసే వారిని పట్టించుకోవట్లేదు. పనిచేయని వారికి పదవులు కట్టబెడుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పి అన్యాయం చేస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే అవకాశాలు కల్పిస్తున్నారు. ఉద్యమకారులను విస్మరిస్తున్నారు. ఇదెక్కడి న్యాయం' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూనే....మైక్ కింద పెట్టి పక్కకెళ్లాడు. మంత్రి, ఇతర నాయకులు చూస్తుండగానే ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకున్నాడు. దీంతో అక్కడున్నవారంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తోటి కార్యకర్తలు, పోలీసులు అప్రమత్తమై మంటలు ఆర్పారు. అప్పటికే ఆయూబ్‌ఖాన్ శరీరం 40శాతం కాలింది. హుటాహుటిన అంబులెన్స్‌ను రప్పించి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నేడు కలెక్టర్ల సదస్సు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

భూ రికార్డుల సరళీకరణ, ప్రక్షాళనకు సంబంధించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రగతిభవన్‌లో ఈ సదస్సు ప్రారంభమవుతుంది. భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి కలెక్టర్లకు ఆయన దశా..దిశా నిర్దేశం చేస్తారు.

రైతు బాగుపడితే కాంగ్రెస్ నేతలు భరించడం లేదు : హరీశ్‌రావు

రైతు బాగుపడితే కాంగ్రెస్‌పార్టీ నాయకులు భరించలేకపోతున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. భూరికార్డులను సరి చేస్తామంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు విమర్శిస్తున్నరో అర్థం కావట్లేదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, నిజాం కాలంలో భూ సర్వే జరిగిందని, తర్వాత మళ్లీ సర్వే జరగలేదన్నారు. "భూ వివాదాలకు శాశ్వతంగా చరమ గీతం పాడాలని రైతులకు భూమి హక్కులపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం కోరుకుంటున్నదని తెలిపారు.


ఆ..భూముల కేటాయింపును రద్దు చేయాలి

- పట్నం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాచకొండ పోలీస్ కమిషనరేట్ నిర్మాణం కోసం కేటాయించిన విక్టోరియా మెమోరియల్ భూములను రద్దు చేయాలని పట్నం డిమాండ్ చేసింది. అనాథ బాలల విద్యాభివృద్ధి కోసం కేటాయించిన భూముల్లో 10 ఎకరాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించేందుకు జారీ చేసిన జీవో నెంబర్ 48ని తక్షణమే ఉపసంహరించాలని కోరింది. భూముల పరిరక్షణ, రైతు బజార్ నుంచి రావల్సిన రూ.35 కోట్ల బకాయిల చెల్లింపు, సాంఘిక సంక్షేమ శాఖ చట్టబద్ధమైన చర్యల ద్వారా భూములను రక్షించాలని కోరుతూ గురువారం సరూర్‌నగర్ రైతు బజార్ సమీపంలో 'వీఎంహెచ్ పరిరక్షణ కమిటీ' ని ఏర్పాటు చేస్తున్నందున, ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు పట్నం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వేణుగోపాలరావు, డిజి నర్సింహారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత


బి.వి. రాఘవులు

- 12 -
(సోమవారం తరువాయి భాగం)

అంటే పెట్టుబడి ఒక దశకొచ్చిన తర్వాత పెట్టుబడి యజమాని మాట కూడా వినదు. యజమానే పెట్టుబడి మాట వినాలి. యజమాని పెట్టుబడి మాట వినకపోతే వాడు యజమాని కాకుండా పోతాడు. కార్మికుడైపోతాడు. కాబట్టి మంచి పెట్టుబడిదారులు, చెడ్డ పెట్టుబడిదారులు అని ఉండరు. మంచి పెట్టుబడిదారుడుగా ఉంటే పెట్టుబడిదారుడు కాకుండా పోతాడు కొద్ది రోజుల్లో..చెడ్డ పెట్టుబడిదారుడు అంటే ఏదో కత్తులు కటార్లు పట్టుకొని ఏదో చేసేస్తాడని అనుకో అక్కర్లేదు. అంతా మంచిగా స్వేచ్ఛగా ఉండొచ్చు. అదనపు విలువ ఎక్కువ తీసుకోవచ్చునేది ..కాబట్టి ఈ పెట్టుబడి విలువ పెరిగిన తర్వాత పెట్టుబడి అనేది మనం గ్రీడీనెస్ అంటామే. నిరంతరం దానికి సంపాదన సంపాదన, సంపాదన అనేటి లక్షణం ఉంటది. ఆ సంపాదనకు ఏది అడ్డమొచ్చినా దాన్ని పక్కన పెట్టేస్తది. సంపాదనకు నష్టం చేసే ఏ నైతిక విలువనైనా పక్కన పెట్టేస్తది. సంపాదనకు లాభం చేసే ఏ నైతిక విలువనైనా ప్రోత్సహించుద్ది. అటువంటి కొత్త నైతిక విలువలను కూడా సృష్టించుద్ది. ఈ రోజు కన్జ్యూమరిజం అనేది ఒక అలవాటుగా మారిపోయిందని మనం చెబుతుంటాం. కమ్యూనిస్టు పార్టీల్లో కూడా కార్యకర్తలకు కూడా కన్జ్యూమరిజం అలవాటైపోయిందని అంటాం. వ్యక్తుల సమస్యలు కొన్ని ఉండొచ్చు. కొంత మంది వ్యక్తులు దూరంగా ఉండొచ్చు. కానీ వ్యవస్థ మొత్తం చూస్తే కన్జ్యూమరిస్టులుగా ఉండకుండా మనల్ని బతకనీయదు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ. ఎందుకంటే మనం వినియోగదారులుగా కాకుండా ఉంటే పెట్టుబడిదారీ వ్యవస్థ కుప్పకూలి పోతుంది. అందుకని మనల్ని నిరంతరం ఒక వినిమయ యంత్రాలుగా కొనసాగించడానికి ఒక అడ్వర్టయిజ్‌మెంట్ ఇండస్ట్రీ ఉంటుంది. కాకపోతే వినిమయంలో కొద్దిగ తేడాలుండొచ్చు. స్వచ్ఛమైన పెట్టుబడిదారీ వినిమయముండొచ్చు. ఈ రోజు స్వచ్ఛమైన రాందేవ్, రాందేవ్ అంటే పతంజలీ వినిమయం ఉండొచ్చు. లేదా ఈ మధ్య చెప్పారు. మీరు ఏదైనా అందంగా తయారు చేయాలంటే పేడ, మూత్రం, తులసాకులు అవీ ఇవి కలిపేసీ మీరు లేపనం చేసేసుకున్నారంటే బ్రహ్మాండమైన అందం ..మీరు పేడ పూస్తారా, లేపనం పూస్తారా. లేకపోతే ఇంకో ఆకు పూస్తారా లేకపోతే ఇపుడూ వాడెవడు స్కిన్టైంట్ క్రీమా.? వాడు చేసినట్టు, వాడేదో కొవ్వు కలిపి చేస్తాడు. అది పూస్తారా.? ఏం పూస్తారనేది వేరే విషయం. ఒక పూత పాతబడిపోతే ఇంకో కొత్త పూత పూయాల. ఇప్పుడు బీజేపీ పూత కొత్తపూత అంటే పతంజలి పూత కొత్తపూత. ఇది కూడా నాలుగు రోజులు పోతే పాతపడిపోతుంది. కొత్తపూతలు వస్తాయి. అందుకని కన్జ్యూమరిజం అర్థం కావాలంటే క్యాపిటలిజం అర్థం కావాలి. ప్రతి కొత్త ఉత్పత్తి కొత్త అవసరాన్ని సృష్టించుద్ది. ప్రతి కొత్త అవసరం మరో కొత్త వస్తువును సృష్టించుద్ది. ప్రతీ మందు ఓ కొత్త జబ్బుని సృష్టించుద్ది. కొత్త జబ్బు కొత్త మందుకు కారణమవుతుం ది. కాబట్టి ఇది స్వచ్ఛమైన పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క లక్షణం...పర్యావరణం సమస్య ఉంది. ఎందుకని.? లాభం లాభం, లాభం ..దీనికి గాలి చెడిపోతుంది. నీళ్లు చెడిపోతున్నాయి. లేకపోతే ఆరోగ్యం చెడిపోతుంది. అవన్నీ వాడికవసరం లేదు. వాడికి లాభం కావాలి. లాభం కావాలంటే గాలిచెడిపోతుంది. ఎయిర్ కండీషనర్లు, అవీ ఇవి పెట్టి గాలిని చెడగొట్టేస్తున్నం. ఫ్లోరో కార్బన్స్‌ని తీసుకొచ్చేస్తున్నాం కానీ మనకు చల్లగా ఉంది. ఫ్లోరో కార్బన్స్ ఎక్కువైపోయాయి. ఇప్పుడు ఫ్లోరో కార్బన్స్ తగ్గేదానికి ఇంకో యంత్రం కనిపెట్టేస్తున్నాం. ఫ్లోరో కార్బన్స్ సృష్టించేస్తాడు. వాటిని తగ్గించేందుకు ఇంకో యంత్రం సృష్టించేస్తాడు. ఆ యంత్రం పెట్టిన తర్వాత దానికేమొస్తాయో.. దానికో కొత్త యంత్రం. కాబట్టి నిరంతరం వాళు పర్యావరణాన్ని లాభం కోసం వాడుకునే పద్ధతిలో ఉంటాయి. ఇప్పుడు గంగానదిని కలుషితం చేస్తారు. మళ్లీ గంగానదిని శుభ్రం చేసేందుకు ఓ ప్రాజెక్టును పెట్టేస్తారు. ప్రతి పనికీ లాభం వస్తే..మళ్లీ ప్రతి సమస్యకీ ఇంకో కొత్త లాభాన్ని సృష్టించేస్తారు. ఇప్పుడు పెద్దపెద్ద సిమెంటు బిల్డింగులు కట్టేస్తున్నారు. ఇప్పుడు ఏమంటున్నారు.? గ్రీన్ టెక్నాలజీ అంటున్నారు. మొత్తం నాశనం చేసేసి గ్రీన్ టెక్నాలజీ అంటున్నారు. కాబట్టి పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం పెట్టుబడిదారీ వ్యవస్థ తెచ్చింది. ఇప్పుడు సెల్‌ఫోన్‌లు వాడాలంటే టవర్లు కావాలి. టవర్లొస్తే పిచ్చుకలన్నీ చచ్చిపోతున్నాయి. కాబట్టి టవర్లొద్దని అంటున్నాం. మీరు ఓ సెల్‌ఫోన్ కొన్నారంటే మీ ఫోటో మీరే తీసుకోవచ్చు. మీ ఫోటో మీరే తీసుకున్నారంటే మీలాగా ఉండరు.



మీకన్నా ఇంకా బాగా ఉంటారు ఆ ఫోటోలో. అడ్వర్టయిజ్‌మెంట్లు మీరు చూస్తే అవన్నీ మీకు కనబడుతాయి. కాబట్టి పర్యావరణం సమస్యలు మార్క్స్ కాలంలో ఇంత తీవ్రమైన సమస్యలేదు. అయినా ఆ రోజు ఈ సమస్య గురించి చెబుతాడు. సంపద గురించి విలియం పెట్టి ఒక మాట చెబుతాడు 'లేబర్ ఈజ్‌ది ఫాదర్..నేచర్ ఈజ్‌ది మదర్ ఆఫ్ వెల్త్' అని అంటాడు. అంటే శ్రమేమో తండ్రి ప్రకృతేమో తల్లిలాంటిదని అంటాడు. అంటే దీని అర్థమేంటంటే అటువంటి అవినాభావ సంబంధం ఉంటుంది వీటికి. అవి రెండు సమంగా ఉండి సమంగా పరస్పరం పోషిస్తాం కాబట్టే సంపదా ఇవీ ముందుకు పోతాయి. ఈ సంబంధమనేది పెట్టుబడిదారీ వ్యవస్థకే కాదు. అనాదిగా ఈ సంబంధం ఉన్నది. ఈ సామాజిక వ్యవస్థ రానపుడు కూడా శ్రమ ఉంది. అందుకని శ్రమ లేకుండా మనిషి లేడు. శ్రమ లేకుండా పెట్టుబడిదారుడు ఉండొచ్చు. వాడు మనిషిలాగా బతుకుతున్నట్టు కాదు. శ్రమ చేయకుండా బతుకుతున్నడంటే మనిషి యొక్క లక్షణం కాదు. మనిషియొక్క లక్షణమనేది శ్రమ. దాని గురించి కూడా చెబుతాడు. మరి పర్యావరణం గురించి వీటన్నింటి గురించి మనకు ఓ డైరెక్షన్ కావాలంటే .. ఓ చోట చెబుతాడు. ఈ స్వేచ్ఛా, ఈ సౌభ్రాతృత్వం గొప్పవి. అంటే ఆయన ఓ ప్యారాగ్రాఫ్‌లో చెబుతాడు. కార్మికున్ని మనం బజార్లో కలిసినపుడు నువు ఎంత కూలీకొస్తవయ్యా.? నేను పది రూపాయలకొస్తాను. ఐదు రూపాయలకొస్తావా.? రాను.. ఇస్తే ఇయ్యి లేకపోతే పో..ఆ రకంగా కార్మికుడు, పెట్టుబడిదారుడు బజార్లో సరుకులమ్ముకున్నట్టు అమ్ముకునేటపుడు ఇద్దరూ సమానులు. ఎందుకంటే శ్రమేమో వాడి ఆస్తి. శ్రమని కొనే డబ్బేమో వీడి ఆస్తి. ఇద్దరికీ స్వేచ్ఛ. వాడు అమ్మొచ్చు. నేను అమ్మనూ అని చెప్పొచ్చు. వీడు కొనొచ్చు. నేను కొననూ అని చెప్పొచ్చు. సౌభ్రాతృత్వం. ఇద్దరూ స్నేహితులు మనమిద్దరమూ ఉంటేనే పరస్పరం ఉత్పత్తి అవుద్ది. ఇక్కడ ఇద్దరికీ ఆస్తిపాస్తులున్నాయి. ఇద్దరూ తమ స్వప్రయోజనాలను బట్టే వాళ్లు వ్యవహరిస్తారు. కాబట్టి మార్కెట్లో ఇద్దరు సమానులు, ఇద్దరూ స్వేచ్ఛాపరులు. ఇద్దరు గొప్పమనుషుల మధ్య సంబంధంగా ఉంటుంది. ఇది కార్మికుడికి, పెట్టుబడిదారుడికి ఇక అక్కడి నుండి ఈ ట్రాన్సాక్షన్ అయిపోద్ది.

(తరువాయి భాగం సోమవారం సంచికలో..)

ఉద్యమాలే ఊపిరిగా ఆరుట్ల రామచంద్రారెడ్డి



డా॥బోనకుర్తి సోమేశ్వర్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖుడు ఆరుట్ల రామచంద్రారెడ్డి. ఉద్యమానికి ఊతం ఇచ్చిన నల్గొండ జిల్లా నాయకుల్లో ప్రముఖుడు, తెలంగాణలో విప్లవ బీజాలు నాటిన తొలితరం నాయకుల్లో ఒకరు ఆరుట్ల రామచంద్రారెడ్డి. నల్గొండ జిల్లా, భువనగిరి తాలూకా, కొలనుపాక గ్రామంలో 1909లో రామక్క, రాజిరెడ్డి దంపతులకు రెండో కుమారునిగా జన్మించారు. ఉర్దూ బోధనా భాషగా ఉన్న జాగీరు పాఠశాలలో ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య భువనగిరిలో పూర్తి చేశాడు. 1928లో హైదరాబాద్ రెడ్డి హాస్టల్లో వుంటూ గోషా మహల్ పాఠశాలలో థర్డ్ ఫారం ఉత్తీర్ణుడై 1930లో నాంపల్లి హైస్కూల్ నుండి మెట్రిక్యులేషన్ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. దేశ మంతటా స్వాతంత్ర్య మహోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలమది. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఉరిశిక్షకు యావద్దేశం చలించి పోయింది. 'స్వదేశీ లీగ్' పేరుతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు హైదరాబాద్‌లోని వికాజీ హోటల్ ఆవరణలో జరిగేవి. ఆ సభలలో రామచంద్రారెడ్డి ఖద్దరు ధరించి తిరిగేవారు. 1930-31లో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీలో చేరాడు. అదే సమయంలో తెలంగాణ - ఆంధ్ర మహాసభ ప్రథమ మహాసభ 1930 మార్చి 3-5 తేదీల్లో జోగిపేటలో జరగబోతున్నది. హైదరాబాద్ నుండి 60 కిలోమీటర్లు సైకిలు తొక్కుకుంటూ జోగిపేట సభకు వెళ్లిన విద్యార్థులలో రామచంద్రారెడ్డి ఒకరు. తన పెండ్లికి షరతులు విధించాడు. కట్నం తీసుకోను, పెండ్లి పీటల మీద ఖద్దరు దుస్తులే వాడాలి. పెండ్లి సందర్భంగా మత్తు పానీయాలు, ఉండరాదు. పెండ్లి కాగానే భార్యను విద్య కోసం తనతో పంపాలని కోరాడు. అందుకు వారు అంగీకరించారు. పెండ్లిలో రుక్మిణి పేరును జాతీయోద్యమంలో ప్రముఖ నాయకులుగా ఉన్న కమలాదేవి ఛటోపాధ్యాయ సరోజని నాయుడు ఆయన దృష్టిలో మెదిలారు. భార్య రుక్మిణి పేరును పెండ్లి పీటల మీదే కమలాదేవిగా మార్చాడు. ఆమెనే వీరనారి ఆరుట్ల కమలాదేవి. ఆమెని చదివించి, తనతోపాటు పోరాటంలో నడిపించి, స్త్రీ అంటే వంటింటి కుందేలు కాదనీ, అనవసరమైతే ఎన్ని త్యాగాలు చేయడానికైనా సిద్ధమని నిరూపించాడు. ఆంధ్ర మహాసభలలో పాల్గొనే ప్రతినిధులు సహపంక్తి భోజనాలు చేసేవారు. ఆనాడు హరిజనులకు దేవాలయ ప్రవేశం లేదు. మహాసభల స్ఫూర్తితో అస్పృశ్యత నివారణకు ఆరుట్ల రామచంద్రారెడ్డి కృషి చేశారు. కుర్రారం రాంరెడ్డి సహకారంతో భువనగిరి ప్రాంతంలోని 35 గ్రామాల హరిజనులతో యాదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవాలయములో ప్రవేశించి వారికి పూజారులచే తీర్థ ప్రసాదాలు ఇప్పించాడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సత్యాగ్రహ ఉద్యమాల వల్ల ప్రభావితులయ్యారు. వందేమాతర గీతాన్ని ఆలపించారు. విద్యాలయాలో రాజకీయ గీతాలు చదువ వద్దని వందేమాతర గీతాన్ని పఠించడాన్ని 28 నవంబర్ 1938లో నిషేధించారు. దీంతో విద్యార్థులలో పాడాలనే దీక్ష, ఉత్సాహం ఇంకా ఎక్కువైంది. ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి హాస్టల్‌లోని విద్యార్థులు బయటకు వచ్చి గొంతెత్తి వందేమాతర గీతాన్ని పాడారు. సస్పెండ్ అయిన వారిలో రామచంద్రారెడ్డి ఒకరు. గ్రామ యువకుల్ని సమీకరించి వెట్టి చాకిరి వ్యతిరేక ఉద్యమం ప్రారంభించారు. గ్రంథాలయ ఉద్యమ ప్రేరణతో గ్రామములో గ్రంథాలయం నిర్మించాలనుకున్నారు. గ్రంథాలయంతో పాటు, బాలికల పాఠశాల కూడా నిర్వహించే బాధ్యతను కలాదేవి చేపట్టింది. కొలనుపాకలో వచ్చిన ఈ విప్లవాత్మక మార్పు జాగీర్దారుకు, ప్రభుత్వానికి ఆందోళన కలిగించింది. గ్రామ నాయకులపై దాడీ మొదలయింది. దీంతో కలెక్టరుకు వ్యతిరేకంగా ఊరేగింపు నిర్వహించిన ఆరుట్ల రామచంద్రారెడ్డిని ఒక రోజు హైదరాబాద్ ప్రయాణంలో ఆలేరు వద్ద అరెస్టు చేసి భువనగిరిలో రాత్రంతా నిర్బంధించి చిత్ర హింసలు పెట్టి వదిలారు. 1944 మే 27, 28 తేదీలలో భువనగిరిలో 11వ ఆంధ్ర మహాసభకు ఆహ్వాన సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆరుట్ల లక్ష్మినరసింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి బాధ్యతను పంచుకున్నారు. ఆంధ్ర మహాసభలో విప్లకారులుండటం సహించలేక మితవాదులు మహాసభను బహిష్కరించారు. అయినా మహాసభ నిర్విఘ్నంగా జరిగింది. తెలంగాణ రాజకీయ చరిత్రలో ఈ మహాసభలో చారిత్రాత్మకమైంది. మరిపడిగె పెత్తందార్ల గడి ముందరే సభ పెట్టి. "ఈ క్షణము నుండే వెట్టి చాకిరి రద్దు. పెత్తందార్లకు ఇవ్వవలసిన నాగుల ధాన్యం ఇవ్వవద్దు. పెత్తందార్లు తీసుకున్న లంచాలు లెక్కగట్టి రాబట్టాలి. పెత్తందార్లు ఇంతకాలం ప్రజలపై జరిపిన దౌర్జన్యాలకు క్షమాపణ చెప్పుకోవాలి. మున్ముందు ఎలాంటి దుర్మార్గాలు చేయమని ఒప్పుకోవాలి. లేకపోతే వారు గ్రామాన్ని వదిలి వెళ్ళక తప్పదని" దోపిడీ వర్గాలను హెచ్చరించారు. "అంత వరకు ఊళ్ళోనే ఉండి వారి ఆటలు అరికడతానని" ప్రజలకు అభయహస్తమిచ్చారు. పెత్తందార్లు ఆ షరతులన్నీ అంగీకరించి లొంగిపోయారు. ఈ వార్త పరిసర ప్రాంతాలకు మెరుపులా వ్యాపించింది. అందరికీ రామచంద్రారెడ్డి ఆదర్శమయ్యారు. జనగామ తాలూకా 35 గ్రామాలకు ఉద్యమం వ్యాపించింది. దోపిడీదార్ల గుండెలపై కుంపటి వెలసినట్టయింది. తమలో తమకున్న వైరుధ్యాలు మరచిపోయి, ద్రోహులంతా ఏకమయ్యారు. ఆరుట్లను హత్య చేయడానికి కుట్రపన్నారు. తమ నాయకుడిగా విసునూరు రామచంద్రారెడ్డిని ఎంచుకున్నారు. లక్ష రూపాయల చందాలు వేసుకొని అతని చేతిలో పెట్టారు. కడివెండి, దేవరుప్పల, కొడగండ్ల రామారం, కొడగండ్ల, మొదలైన గ్రామాల ప్రజలతో జత ఎండ్ల బండ్లతో రావి నారాయణరెడ్డి పర్యటన జరిగింది. నాయకత్వం వెళ్లిపోయిన తర్వాత దొరలు రెచ్చిపోయి ప్రజలపై దొరగూండాలు దాడి చేశారు. ఇది తెలుసుకున్న వెంటనే రామచంద్రారెడ్డి వందలాది మంది ప్రజలను సమీకరించుకొని కలెక్టర్ వద్దకు వెళ్లాడు. విసునూర్ దొరల దుర్మార్గాలను వివరించాడు. హత్య ప్రయత్నాలు విఫలం కావడంతో ఆరుట్ల రామచంద్రారెడ్డిని అరెస్ట్ చేయించి, కొలనుపాక దాటి వెళ్ళరాదని అర్డర్ జారీ చేశారు.

1946 జూన్ 4న కడవెండి కదనరంగంగా మారింది. తొలి తెలుగు వీరుడు దొడ్డి కొమరయ్య నేలకొరిగాడు. విసూనూరి రక్కసి మూకల తరిమికొట్టడానికి అందిందల్లా ఆయుధంగా చేపట్టింది ప్రజానీకం. దీంతో నల్గొండ జిల్లాలో మార్షల్‌లా విధించింది ప్రభుత్వం. 1947 ఆగష్టు 15 భారతదేశ స్వాతంత్ర్యం పొందింది కానీ నిజాం నవాబు భారత రిపబ్లిక్‌లో చేరటానికి ఇష్టపడక సర్వ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాడు. రజాకార్లు విజృంభించారు. గ్రామాలపై దాడి తీవ్రతరమయింది. రామచంద్రారెడ్డిపై రాజకార్లు దాడి చేశారు. దాల్‌కత్తితో వారిని బెదరగొట్టి తప్పుకున్నారు. భూస్వాములకు, జమీందార్లకు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. తుపాకులు, రైఫిళ్లు దళాలకందాయి. ఒక్కో గ్రామం విముక్తమయింది. భూస్వాముల భూములు, బంజరు భూములు పంపకం జరిగింది. దొరలు, దోపిడీ దొంగలంతా గ్రామాలు వదిలి పారిపోయారు. వాటికి, చల్లూరు, వెంకటాపురం, గుట్టలు గెరిల్లా దళాలు కేంద్రాలయ్యాయి. వందలాది గ్రామాలు విముక్తమయ్యాయి. ఇంతలో యూనియన్ సైన్యలు నైజాంపై దండెత్తాయి. తర్వాత యూనియన్ సైన్యాలు కమ్యూనిలపై దాడి ప్రారంభించాయి. ఆరోగ్యం దెబ్బతిన్న రామచంద్రారెడ్డి బహదూర్‌పేట దగ్గర వైద్యం కోసం వెళ్తున్న ఆయనను, కమలాదేవిని పోలీసులు బంధించారు. నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ జైళ్ళకు మార్చారు. 1952లో జైలు నుండి విడుదలయ్యారు. మెదక్ జిల్లా రామాయంపేట నుండి జరిగిన ఉప ఎన్నికలో పీడీఎఫ్ అభ్యర్థిగా విజయం సాధించాడు. 1957 ఎన్నికల్లో కూడా అక్కడి నుండి రెండవసారి గెలిచారు. 1962 ఎన్నికల్లో భువనగిరి ప్రాతినిధ్యం వహించాడు. తర్వాత దున్నేవాడికే భూమి కావాలని, కమ్యూనిస్టు పార్టీ పోరాటంలో ప్రధాన పాత్ర వహించాడు. హైదరాబాద్‌కు రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా నిర్విరామంగా కృషి చేశాడు. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నాడు. ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ శాసన సభకు రాజీనామా చేశాడు. "ప్రజలే తన ప్రాణం - ఉద్యమాలే ఊపిరి" గా నిలిచిన ఆయన, 26/08/1985లో తుదిశ్వాస విడిచారు. ప్రశ్నించడం పోరాటం, నిబద్ధత ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సిన అమూల్యమైన విషయాలు.


ఆరుట్ల రామచంద్రారెడ్డి దంపతులు

సెల్ : 9293762428


బత్తుల శ్రీనివాస్

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. తరగతి గదిలోనే విద్యార్థి జీవితం నిర్ణయించబడుతుందంటే దానికి కారణం ఉపా ధ్యాయులే, మొదటగా తల్లి,తండ్రి తరువాత గురువును మాత్రమే గౌరవిస్తారు ఈ సమాజంలో. భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతి, రెండోరాష్ట్రపతి డా॥సర్వేపల్లి రాధాక్రిష్ణన్ కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే. విద్యా ప్రక్రియలో అతిపెద్ద యంత్రంలో ఉపాధ్యాయుడు ఒక చిన్న మరమాత్రమే. యంత్ర నియమాల ఆధారంగానే చిన్న మర పనిచేస్తుంది.ఆ మర బాగా ఉండాలంటే యంత్ర భాగాలన్నింటిని వదిలేసి, ఆ యంత్రం చలన సూత్రాలను వదిలేసి ఒక్క మరను నిందించడం అన్యాయం. వ్యవస్థాపర లోపాలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదు. గత 20 సంవత్సరాలకు ముందు ప్రభుత్వ ఉపాధ్యాయులంటే ఎనలేని గౌరవం, మర్యాద ఉండేది. అలాంటి గురువుకు నాటికి నేటికి సమాజంలో ఉన్న విలువ, గౌరవం తగ్గుతూవస్తుంది, దీనికి గల కారాణాలేమిటి? తరతరాలుగా ప్రభుత్వాలు మారుతున్నాకొద్దీ విద్యావిధానంలో మార్పులు చేయాల్సి వస్తుంది. క్యూ.ఐ.పి, సీఎల్ఐపీ (క్లిప్), సీఎల్‌పీ (క్లాప్), ఎల్.ఈ.పి (లిప్), నేడు సి.సి.ఈ.(నిరంతర సమగ్ర మూల్యాంకనం) ఈవిధంగా రోజురోజుకు విద్యావిధానంలో మార్పులు జరుగుతున్నవి. ఇలా కాలానికి అనుగుణంగా మార్పుచేయడం మంచిదే కానీ పాఠశాలలు పున:ప్రారంభమయ్యే ముందే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తే బాగుంటుంది. ప్రస్తుత సమాజంలో రాజకీయ నాయకుల ఒత్తిడి ఉపాధ్యాయులపై అధికమైంది. వార్డుమెంబర్ నుండి ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రుల వరకు ఉపాధ్యాయులపై పెత్తనం చెలాయిస్తున్నారు. 5సంవత్సరాలు పదవిలో ఉండే వీరు ఉపాధ్యాయ వృత్తి సాధించాలంటే డిగ్రీలు, బీఈడీలు చదివి ఉపాధ్యాయ అర్హత పరీక్ష సాధించి, డి.ఎస్.సిలో మంచి మార్కులు సాధించి దేశంలోనే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి సాధించి 20-30 సంవత్సరాలు విద్యాబోధన చేసి కొన్ని వేల మందిని రాజకీయ నాయకులను, కలెక్టర్లను తయారుచేస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయులను చిన్న చూపుచూడడం రాజకీయ నాయకులకు ఎంతవరకు సమంజసం? పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నా, పారిశుధ్య కార్మికులను నియమించాలన్నా, ఎస్ఎంసీ చైర్మెన్ పదవీ ఎన్నికలు జరిగిన కూడా రాజకీయ నాయకుల ఒత్తిడి ఉపాధ్యాయులపై ఉంది.

పుట్టగొడుగుల్లా ప్రయివేటుపాఠశాలల అనుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం ప్రభుత్వం ప్రయివేటు పాఠ శాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్య నుండి తనబాధ్యతను తగ్గించుకుంటూ ఉపాధ్యాయుల వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని కుంటిసాకులు చెబుతున్నది. ఒక మండల పరిధిలో సుమారు 5నుండి 6 ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇస్తూ మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయుల సంఖ్యను కుదిస్తూ వస్తున్నది.

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టాలి. రెండు సంవత్సరాల క్రితం కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టారు. కానీ ఇప్పటి వరకూ ఆంగ్లమా ధ్యమ పుస్తకాలు కొన్ని పాఠశాలలకు అందలేదు. ఇలా ఉంటే ఆంగ్లమా ధ్యమ బోధన ఎలా జరుగుతుంది?

పాఠశాలల్లో మౌళిక వసతుల కొరత

కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యా బోధన చెట్ల కిందనే చెప్పాల్సి వస్తున్నది. ఇదిలా ఉంటే కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 100-200 మంది విద్యార్థులుంటే టాయి లెట్లు రెండు, మూడు మాత్రమే ఉంటున్నాయి. వాటిల్లో బాలికలకు మాత్రం చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలల్లో మం చినీటి కొరత. బోరు బావులు పనిచేయక విద్యార్థులు బయటకు వెళ్లి మంచినీటిని తీసుకోవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మరి కొన్ని పాఠశాలలకు ప్రహరీగోడలు లేవు. గేటు ఉండడం లేదు. ఇలాంటి వాతావరణంలో విద్యార్థులు నాణ్య మైన విద్య ఎలా అం దుకుంటారు. నాణ్యమైన విద్యను ఉపా ధ్యాయుడు ఎలా అందిస్తాడు.

సెల్ : 8985631681

ప్రభుత్వ ఉపాధ్యాయులంటే ఇంత చులకనెందుకు?

ప్రాథమిక విద్య బలోపేతం కావాలి


ఎస్.దుర్గాప్రసాదరావు

'పునాదులు లేని బహుళ అంతస్థులు పేకమేడల్లా కూలిపోతాయి అన్నది' అక్షర సత్యం. అలాగే కనీస అభ్యాసన స్థాయిలను ప్రాథమిక స్థాయిలో అలవరచుకోలేని చిన్నారులు ఉన్నత తరగతుల్లో గణితంలోని చతుర్విధ ప్రక్రియలు, భాషలోని చదవడం, రాయడం, ధారాళంగా మాట్లాడడం అనే కనీస సామర్థ్యాలు లేక చతికిలబడతారు. ఆత్మన్యూనతకులోనై చురుకైన కొద్దిమంది పిల్లల మధ్య ఇమడలేక సమూహం నుండి వేరుపడిపోతారు. చివరకు బడిపట్ల అనాసక్తిని పెంచుకుని కునారిల్లి పోతున్నారు. ఇంకా చెట్ల కిందే బోధన జరుగుతున్న పాఠశాలలు, అన్ని తరగతులకు సరిపడా లేని ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత, పాఠశాలలకు కావలసిన ఫర్నీచర్, ఇతరత్రా బోధనా సామాగ్రి, క్రీడా మైదానాలకు, ప్రయోగశాలలకు, గ్రంథాలయాలకు కావలసిన నిధులను కావాల్సిన మేరకు గ్రాంట్లు లేక వెలవెలబోతున్న పాఠశాలలు ఉన్నాయి. కనుక విద్యారంగానికి కనీస అవసరాలను తీర్చడానికి గాను నిధులను పెంచవలసిన అవసరముంది. ఇంకా కొన్ని పాఠశాలలకు బ్లాక్‌బోర్డులు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, స్వీపర్లు, బోధనేతర సిబ్బంది, మధ్యాహ్న భోజన సమయాల్లో మంచినీటి వసతి, ఆడపిల్లలకు ప్రత్యేక మరుగుదొడ్లు, ఇత్యాది మౌలిక సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. కూలుతున్నా, పెచ్చులూడి కురుస్తున్నా వర్షంలోనే తడుస్తూ నెట్టుకొస్తున్న పాఠశాలలు కూడా తక్కువేమీ గాదు. ఎదిగిన వృక్షాలే అదనపు తరగతి గదులై నెట్టుకొస్తున్న పాఠశాలలు ఎన్నో! ఎన్నెన్నో!! ప్రధానంగా వృథా ఖర్చులు, అప్రాధాన్యతా రంగాలకు ధారపోసే డబ్బును విద్యా రంగానికి కేటాయిస్తే పాఠశాలల కనీస భౌతిక అవసరాలను తీర్చవచ్చు. కేంద్ర ప్రభుత్వం జాతిని భవిష్యత్ నందనం చేసే కొత్త తరం పరిరక్షణకు పూనుకునేందుకు దోహదపడే విద్యారంగాన్ని విస్మరించడం అత్యంత శోచనీయమైనది. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో విద్యారంగానికి ఎక్కువ కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తే మూలిగేనక్కపై తాటిపండు పడ్డట్టు అవ్వడం ఖాయం. ఈ విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించకుండా విద్యావేత్తలు, మేధావులు, విద్యారంగ శ్రేయోభిలాషులందరితో లోతుగా చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన సముచిత నిర్ణయాన్ని గైకొనాల్సి వుంది. లేకపోతే 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు' అవుతుంది. ఇప్పుడున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల పాఠ్యాంశాలు ఇంకా వారి స్థాయీ భేదాలకనుగుణమైన క్రొత్త పాఠ్యాంశాలను జొప్పించాల్సి ఉంది. శాస్త్రీయ అంశాలకు పెద్దపీట వేయాల్సి వుంది. అంతేగాక ప్రాథమిక స్థాయిలో ప్రతి తరగతికి ఓ ఉపాధ్యాయుణ్ణి నియమించే దిశగా అడుగులేసినట్లైతే ఉన్నత స్థాయిలో అటు విద్యార్థులు - ఇటు ఉపాధ్యాయులు సర్కస్‌ఫీట్లు పడవలసిన దుస్థితిని నివారించినట్టవుతుంది. వెరసి ఉన్నత తరగతుల్లో బోధన నల్లేరు మీద నడకలా సాగిపోతుందనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రాథమిక స్థాయిలో అన్ని తరగతులకు ఉపాధ్యాయులను నియమించలేకున్నా, కనీసం ఆ ఉపాధ్యాయులకు వర్కుబుక్స్‌ను శాస్త్రీయంగా రూపొందించి అన్ని పాఠశాలలకు అందించినట్లైతే ప్రభుత్వ సంకల్పానికి ఓ సార్థకత ఒనగూరుతుంది. అంతేకాక క్షేత్రస్థాయి పర్యవేక్షణ కట్టుదిట్టం చేసి అటు ఉపాధ్యాయులకు కావలసిన విలువైన సూచనలు, సలహాలు అందించి తద్వారా బాలల మనోవికాసానికి దోహదపడే ఓ చక్కని ప్రణాళికాబద్ధమైన ఆలోచనాక్రమాన్ని అమలు చేసినట్లైతే ప్రాథమిక విద్య బలపడుతుంది. ఉన్నత విద్య సజావుగా సాగుతుంది. అది విద్యార్థుల తల్లిదండ్రుల ఆదరాభిమానాలకు నోచుకుంటుంది. మనం ఆశించిన సత్ఫలితాలకు అది శ్రీకారం అవుతుంది. ఆ దిశగా ప్రభుత్వం వెనువెంటనే ఆలోచన చేస్తే మొత్తం విద్యారంగ పరిరక్షణకు ఓ అడుగు ముందుకు పడినట్టు అవుతుంది. "ఎవడికి పుట్టిన బిడ్డరా వెక్కి వెక్కి ఏడుస్తున్నది" అన్న చందంగా విద్యారంగాన్ని గాలికి వదిలేయకుండా దీర్ఘకాలంలో దాని మధుర ఫలాలు అందరికీ అందేలా చూడడం ప్రభుత్వం కనీస బాధ్యత. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి. తద్వారా బాలల డ్రాపౌట్లు గణనీయంగా తగ్గడమే గాక మనమాశించిన మన తరగతి గదులు - మన సుందర స్వప్నాలు" అనే మహత్తర నినాదానికి అనుగుణమైన 'గుణాత్మక విద్య'ను చిన్నారుల్లో పాదుకొల్పవచ్చు.

సెల్ : 8466965401


వార్ల సత్యనారాయణ

మార్పులకు అనుగుణమైన సమాజం పురోగమనంలో భాగస్వాములం కావాలి. అంధ విశ్వాసాలను సవాలు చేస్తూ శాస్త్రీయ భావాలను పునికిపుచ్చుకుని ముందుకు సాగాలి.తెలంగాణ సమాజానికి ఇది తక్షణ అవసరం. కానీ సంప్రదయాల పేరుతో తెలంగాణ వ్యాప్తంగా మూఢ విశ్వాసాలు తెరమీదకు వస్తున్నాయి. పాలకులే వాటిని ప్రోత్సహిస్తున్నారు. నేటి ఆధునిక సమాజంలో ప్రంచమంతా శరవేగంతో మార్పులకు గురౌతున్నది. వివిధ దేశాలను అతితక్కువ సమయంలో సందర్శించి తిరిగి స్వస్థలాలకు చేరుకుంటున్నారు. అశాస్త్రీమైన అంశాలను వదిలి శాస్త్రీయత వైపు అడుగులు పడుతున్న రోజులివి. ప్రజలను శాస్త్రీయ విషయాల వైపు మళ్లించి చైతన్యం చేయాల్సిన పాలకులు ప్రజలను అనాగరిక సమాజం వైపు ప్రోత్సహిస్తున్నారు. యజ్ఞాలు, యాగాలు, క్రతువులు, హెూమాలు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రజలను నమ్మిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటులో బతుకమ్మలు,

మూఢ సాంప్రదయాలను త్యజించాలి

బోనాలు మన సంస్కృతిలో విశేష ప్రజాధారణ పొందాయనడంలో సందేహంలేదు. ఒకనాడు దొరల గడీల వద్ద బతుకమ్మలు ఆడిన మన మహిళలు నేడు స్వతంత్రంగా పండుగలు నిర్వహించుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నది. కానీ గతంలోనే కనుమరుగైన పండుగలను మళ్లీ తెరమీదకు తెచ్చే సంప్రదయాలు ఊపందుకున్నాయి. బొడ్డురాయి పండుగ నేడు తెలంగాణ గ్రామాల్లో తెరమీదకు వచ్చిన పండుగ. ఈ బొడ్రాయి ఉత్సవం కోసం గ్రామంలో అమాయక మహిళలను పావులుగా వాడుకుంటున్నారు. గట్టిగా మాట్లాడే మహిళలను, శిగాలు నిండేవారిని, సర్వం కోల్పోయిన మహిళలను ఇందుకు పావులుగా వాడుకుంటూ గ్రామంలో జరిగే సంఘటనలకు కారణాలను చెప్పిస్తున్నారు. గ్రామ అభివృద్ధి గురించి వారికి వీసమెత్తు తెలియదు, ఎన్నడూ ఎన్నికలను



ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ఒక గ్రామంలో ప్రజలు మరణిస్తున్నారని 'పెద్ద పండుగ' చేస్తే గ్రామంలో శాంతి చేకూరుతుందని నిరక్షరాస్యులైన నోరుగాయి మహిళలతో చెప్పించారు. అనేక కట్టుబాట్లు చేసుకుని 'పెద్ద పండుగ' ను నిర్వహించారు. తర్వాత పదిహేను రోజులకే ఒక కుటుంబంలో ఏర్పడిన సంఘటనతో అవమాన భారంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. పెద్ద పండుగ నిర్వహించిన పదిహేను రోజులకే ఇలా ఎందుకు జరిగిందనేది గ్రామంలో చర్చనీయాంశం అయ్యింది. 'పెద్దపండుగ' కూ జరిగే అనర్థాలకు మధ్య సంబంధం లేదని కొంతమంది ఆలోచనలో పడ్డారు. ఇలాంటి సంఘటనలు చాలానే జరిగినా గ్రామంలో కొంతమంది ఆర్థికంగా బలపడి, కుళ్లు కుతంత్రాలతో కుళ్లిపోయిన సంప్రదయాలను బలవంతంగా ప్రజల మీద రుద్దుతూ అదే మన సంస్కృతి అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు.

దగ్గరుండి చూడని వారు గ్రామ పంచాయతీలో జరిగే అభివృద్ధి పనుల గురించి ఎరుగని వారితో తతంగం కానిచ్చేస్తున్నారు. వీరే నేడు అనాచార సంప్రదయాలకు ముందు వరసలో నిలిచి ఉంటున్నారు. వివిధ కారణాలతో మరణిస్తే దానికి స్వంత తీర్పులను ఇచ్చేస్తూ పలానా పండుగ చేస్తే అరిష్టం పోయి అర్కత్ బర్కత్‌తో ఆరోగ్యం సిద్ధిస్తుందనే అశాస్త్రీయ భావజాలం ప్రచారం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ' పెద్ద పండుగ' లేదా బొడ్రాయి ప్రతిష్ఠాపన చేయాలనీ గ్రామాల్లో పెద్దల ముసుగులో చలామణీ అయ్యేవారు అవగాహనా లేని మహిళలతో చెప్పిస్తున్నారు. అమాయక మహిళలను ముందుకు తోసి వెనక నుంచి కథ నడిపిస్తున్నారు. బొడ్రాయి పండుగ కు ఊరు విడిచి వెళ్ళొద్దని హుకుం జారీ చేస్తున్నారు.

ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ఒక గ్రామంలో ప్రజలు మరణిస్తున్నారని 'పెద్ద పండుగ' చేస్తే గ్రామంలో శాంతి చేకూరుతుందని నిరక్షరాస్యులైన నోరుగాయి మహిళలతో చెప్పించారు. అనేక కట్టుబాట్లు చేసుకుని 'పెద్ద పండుగ' ను నిర్వహించారు. తర్వాత పదిహేను రోజులకే ఒక కుటుంబంలో ఏర్పడిన సంఘటనతో అవమాన భారంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. పెద్ద పండుగ నిర్వహించిన పదిహేను రోజులకే ఇలా ఎందుకు జరిగిందనేది గ్రామంలో చర్చనీయాంశం అయ్యింది. 'పెద్దపండుగ' కూ జరిగే అనర్థాలకు మధ్య సంబంధం లేదని కొంతమంది ఆలోచనలో పడ్డారు. ఇలాంటి సంఘటనలు చాలానే జరిగినా గ్రామంలో కొంతమంది ఆర్థికంగా బలపడి, కుళ్ల కుతంత్రాలతో కుళ్లిపోయిన సంప్రదయాలను బలవంతంగా ప్రజల మీద రుద్దుతూ అదే మన సంస్కృతి అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. పక్క గ్రామంలో బొడ్రాయి పండుగ జరిపితే మనమెందుకు చేసుకోవద్దని రెచ్చగొడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గతంలో దొరలు దాన ధర్మాలు చేసిన మాదిరిగా ప్రభుత్వం తరుఫున స్వయంగా ముఖ్యమంత్రే దాన ధర్మాల కార్యక్రమానికి తెరలేపారు. దొరల గడీల్లో రూపుదిద్దుకుంటున్న ఇలాంటి సంప్రదయాలను తిరస్కరిస్తేనే తెలంగాణ ప్రజలకు అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుంది. లేదంటే భూస్వామ్య కాలం నాటి అనేక ఆచారాలకు బీజం వేసినట్లువుతుంది. శాస్త్రీయమైన విద్యను ప్రోత్సహిస్తూ ఆశాస్త్రీయ ఆచారాలను త్యజించే విధంగా చైతన్యం చేయాలి. చైతన్య వంతమైన యువత, మేధావి వర్గం అంధ సంప్రదయాలను తిప్పి కొట్టాలి.

సెల్ : 99596 06271

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.
- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

నెల రోజుల సినిమా పండుగ

పండుగల సమయంలో సినిమాల విడుదల హడావుడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సెలవుల నిమిత్తం, పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రేక్షకులు సైతం మరిన్ని సినిమాలు చూడాలనుకోవడం ఎప్పుడూ జరుగుతున్నదే. సవాలక్ష సమస్యలతో విసిగి వేసారిన ప్రేక్షకులు కూడా దొరికిన కాసింత సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలని ఆశిస్తున్నారో, అలాగే దర్శక, నిర్మాతలు కూడా ఇటువంటి తరుణాన్ని క్యాష్ చేసుకోవాలని ఆశపడుతుంటారు. సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి, క్రిస్మస్, రంజాన్ వంటి తదితర పెద్ద పండుగలతోపాటు ఎక్కువ హాలీడేస్ వచ్చే వేసవి వంటి సీజన్స్ టైమ్‌లో ఎక్కువ సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చి అమీతుమీ తేల్చుకుంటుంటాయి. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, వినాయకచవితి సందర్భంగానూ మన దగ్గర ఎక్కువ సినిమాలు అందులోనూ పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వడం చెప్పుకోదగ్గ అంశం. ఈ సందర్బాల్లోనూ సెలవులు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో అతి త్వరలో రాబోతున్న దసరా పండుగ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

దసరా వస్తుందంటే చాలు దర్శక, నిర్మాతలు తమ తమ సినిమాలను విడుదలకు ముస్తాబు చేసే పనులను ముమ్మరం చేస్తుంటారు. ఆ పండుగకు వారం రోజుల ముందు నుంచే విడుదలయ్యే సినిమాలు బరిలోకి దిగుతాయి. అయితే ఈసారి విశేషమేమిటంటే, దసరా నెలంతా సినిమా రిలీజ్‌లతో సందడి చేయనుండటం. ఈ నెలలో పదికిపైగా చిన్నా, పెద్దా సినిమాలు ప్రేక్షకుల్ని మెప్పించేందుకు రంగంలోకి దిగుతున్నాయి. ఈ నెలలో పదికిపైగా సినిమాలు విడుదల కాబోతుండటం ఒక ఎత్తైతే, కేవలం సెప్టెంబర్ 8న దాదాపు ఏడు సినిమాలు రిలీజ్ కానుండటం మరో ఎత్తు. దీంతో వీటి మధ్య పోటీ ఎలా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు. ఇది చిత్ర పరిశ్రమకు, నిర్మాతలకు కాస్త ఆందోళన కలిగించే అంశమైనా అదే సందర్భంలో ప్రేక్షకులకు కావాల్సినంత వినోదం దొరకుతుందనే ఆనందమూ ఉందని సరిపెట్టుకోవాల్సి వస్తోంది. సెప్టెంబర్ నెల వెండితెర యుద్ధానికి నందమూరి బాలకృష్ణ నాంది పలకనున్నారు. తొలిసారి పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఆయన నటించిన 'పైసా వసూల్' చిత్రం సెప్టెంబర్ 1న విడుదల కానుంది. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో బాలయ్య సరసన శ్రియా, ముస్కాల్, కైరా దత్ హీరోయిన్లుగా నటించారు. ఇందులో బాలకృష్ణ ఓ పాట పాడటం విశేషం. ఇదే రోజు 'రథావరం' అనే చిత్రం రిలీజ్ కానుంది. ఒక రోజు గ్యాప్‌తో సెప్టెంబర్ 2న 'వెళ్ళిపోమాకే', 'షాలిని' చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. అలీ మహమ్మద్ దర్శకత్వంలో 'వెళ్లిపోమాకే' లవ్ ఎంటర్‌టైనర్ వస్తుండగా, హీరో షెరాజ్ దర్శకుడిగా మారి రూపొందించిన 'షాలిని' చిత్రం హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో వస్తోంది.


పైసా వసూల్

భారీ పోటీ..

సెప్టెంబర్ రెండవ వారం (8వ తేదీ)న దాదాపు 7 సినిమాలు విడుదలవుతున్నాయి. 'యుద్ధం శరణం', 'మేడ మీద అబ్బాయి', 'ఒక్కడు మిగిలాడు', 'వీడెవడు' ఇందులో ప్రధానంగా ఉన్నాయి. 'ప్రేమిక' చిత్రం కూడా ఇదే రోజు విడుదలవుతోంది. దీంతోపాటు అనువాద చిత్రాలు 'హేయ్ పిల్లగాడా', 'సరసుడు' సైతం అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. ఇక నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న 'యుద్ధం శరణం' చిత్రంలో లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటించగా, కృష్ణ ఆర్.వి.మారి ముత్తు దర్శకత్వం వహించారు. వారాహి చలన చిత్ర బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం సోషల్ మీడియా ప్రధానంగా, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్ స్టోరీ. అల్లరి నరేష్ పంథా మార్చి 'మేడ మీద అబ్బాయి' చిత్రంలో నటించారు. 'గమ్యం', 'శంభో శివశంభో' చిత్రం తరహాలో ఉంటుందని చెబుతున్న ఈ చిత్రానికి జి.ప్రజిత్ దర్శకత్వం వహించారు. నిఖిల విమల్ కథానాయికగా నటిస్తుండగా, జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో ఎలాగైనా సక్సెస్ కొట్టాలని అల్లరి నరేష్ ఆశిస్తున్నారు. 'గుంటూరోడు' తర్వాత మంచు మనోజ్ విభిన్న కథా చిత్రం 'ఒక్కడు మిగిలాడు'లో నటిస్తున్నారు. నూతన దర్శకుడు అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీ కాంత్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎల్.టి.టి.ఈ నేత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో మంచు మనోజ్ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. సచిన్ హీరోగా నటిస్తున్న యాక్షన్, థ్రిల్లర్ చిత్రం 'వీడెవడు' సైతం సెప్టెంబర్ 8న విడుదలవుతూ మిగతా సినిమాలకు పోటీనిస్తోంది. బైలింగ్వల్ చిత్రం 'సరసుడు'లో శింబు, నయనతార, ఆండ్రియా, ఆదాశర్మ హీరోహీరోయిన్లుగా నటించగా, పాండిరాజ్ దర్శకత్వం వహించారు. టి.రాజేందర్ నిర్మించిన ఈ చిత్రం సాఫ్ట్‌వేర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ఎనిమిదిన వస్తోన్న మరో చిత్రం 'హేయ్ పిల్లగాడా'లో 'ఫిదా' ఫేమ్ సాయిపల్లవి, 'ఒకే బంగారం' ఫేమ్ దుల్కర్ సల్మాన్ జంటగా నటించారు. ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా 'కలి' అనే మలయాళ చిత్రానికి అనువాదం. మూడో వారంలో సైతం మరికొన్ని సినిమాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.


స్పైడర్


జై లవకుశ


యుద్ధం శరణం


ఒక్కడు మిగిలాడు


మేడ మీద అబ్బాయి

సింగిల్.. సింగిల్‌గా..

ఇక నాలుగో వారంలో 'జై లవ కుశ'తో ఎన్టీఆర్ వినోదాన్ని పంచడానికి సింగిల్‌గా వస్తున్నాడు. దసరా పండుగని పురస్కరించుకుని ఈ చిత్రం సెప్టెంబర్ 21న విడుదలకానుంది. బాబీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ తొలిసారిగా త్రిపాత్రాభినయం చేస్తుండటం విశేషం. జై, లవ, కుశ పాత్రల్లో కనిపించనున్నారు. జై పాత్ర నెగటివ్ షేడ్స్‌తో కూడుకుని ఉంటుందని తెలుస్తుంది. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాశీఖన్నా, నివేదా థామస్ కథానాయికలుగా నటిస్తుండగా, తమన్నా ప్రత్యేక పాటలో నర్తించడం సినిమాకు హైలైట్. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, టీజర్స్ సినిమాపై ఆసక్తి పెంచుతున్నాయి. ఈ చిత్ర పాటలను సెప్టెంబర్ 3న డైరెక్ట్‌గా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఇక సెప్టెంబర్ 10న ఓ భారీ ఈవెంట్‌గా ఏర్పాటు చేసి అభిమానుల నడుమ ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేయబోతున్నట్టు నిర్మాత కళ్యాణ్ రామ్ తెలిపారు.

దీంతోపాటు సెప్టెంబర్ నెలాఖరులో మహేష్‌బాబు 'స్పైడర్'తో సింగిల్‌గానే వస్తున్నాడు. విజయదశమికి మూడు రోజుల ముందు ఈ చిత్రం సందడి చేయనుంది. ఈ చిత్రం ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకోవడం ఒక విశేషమైతే, ఇందులో మహేష్ గూఢాచారిగా నటించడం మరో విశేషం. సెప్టెంబర్ 27న విడుదల కానున్న ఈ చిత్రంలో మహేష్ సరసన రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తుండగా, ఎన్.వి.ఆర్. సినిమా ఎల్ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్నారు. మురుగదాస్, మహేష్ తొలిసారి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదే నెలలో శర్వానంద్ 'మహానుభావుడు' అంటూ రాబోతున్నాడు. మారుతి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతుండగా, ఇందులో మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తుంది.

మరిన్ని వినోదాలు..

ఇదిలా ఉంటే మరికొన్ని సినిమాలు సెప్టెంబర్‌లోనే రిలీజ్‌కు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. వాటిలో సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి నటించిన 'ప్రాజెక్ట్ జెడ్'.. భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ హీరోహీరోయిన్లుగా రవి భార్గవన్ దర్శకత్వంలో జాన్ సుధీర్ పూదోట నిర్మిస్తున్న 'మళ్ళీ ప్రేమిస్తే'.. చంద్రకాంత్ దత్తా, రాధికా మెహరోత్రా జంటగా గోవర్ధన్ రూపొందించిన 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'.. అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రలు పోషించిన డబ్బింగ్ చిత్రం 'తారామణి'.. దుల్కర్ సల్మాన్ నటించిన తెలుగు అనువాదం 'అందమైన జీవితం' వంటి చిత్రాలున్నాయి.

కలెక్షన్లపై ప్రభావం..

ఒకే నెలలో పది వరకు భారీ సినిమాలు విడుదలవుతుండటంతో ప్రేక్షకులకు పండుగే అని కొందరు ఆనందం వ్యక్తం చేస్తుంటే. ఇది నిర్మాతల పాలిట శాపమని అంటున్నారు. ఒకేసారి ఎక్కువ సినిమాలు విడుదలవడం వల్ల కలెక్షన్ల విషయంలో తేడా వస్తుందని, ఇది ఇండస్ట్రీకి, ఆయా నిర్మాతలకు మంచి కాదనేది సినీ, ట్రేడ్ విశ్లేషకుల వాదన. సినిమా సినిమాకు రెండు వారాల గ్యాప్ ఉంటే ఇండస్ట్రీ హెల్దీగా ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా సెప్టెంబర్ 8న విడుదలయ్యే సినిమాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందంటున్నారు. ఈ రోజున విడుదలయ్యే సినిమాల నిర్మాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఏదేమైనా సెప్టెంబర్ నెల ప్రేక్షకులకు సినిమా పండుగను తేవడంతోపాటు విజయదశమిని నెల రోజుల ముందే వస్తుందని ప్రేక్షకలోకం సంబరపడుతోంది.

నవచిత్రం

పొల్లాచ్చికి శ్రీవాస్-బెల్లంకొండ చిత్రం


బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్ర యూనిట్ త్వరలో పొల్లాచ్చికి వెళ్ళనుంది. ఆ విశేషాలను నిర్మాత అభిషేక్ నామా తెలియజేస్తూ, 'బలమైన కథ, కథనాలతో టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. దర్శకుడు శ్రీవాస్ చాలా సమయం వెచ్చించి ఈ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. తెలుగులో ఇది చాలా డిఫరెంట్ మూవీ అవుతుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో ఒక షెడ్యూల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. ఇప్పటికే రెండు షెడ్యూల్ పూర్తయ్యాయి. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దాదాపు 40శాతం పూర్తయ్యింది. నెక్ట్స్ పొల్లాచ్చిలో 15 రోజుల భారీ షెడ్యూల్ జరుగనుంది. అందుకోసం విండ్ టర్బైన్స్‌తో కలిపి ఓ భారీ సెట్‌ను రూపొందించాం. పీటర్ హెయిన్స్ నేతృత్వంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేసేందుకు ప్లాన్ చేశాం. ఆడియెన్స్‌కు మంచి థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడం కోసం చిత్ర బృందమంతా కష్టపడి పనిచేస్తోంది. కచ్చితంగా ఇదొక కొత్త విభిన్న తరహా చిత్రమవుతుంది' అని అన్నారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెలకిషోర్, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్థర్ ఎ.విల్సన్, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు, సంగీతం: దేవిశ్రీప్రసాద్.

సితార బ్యానర్‌పై నూతన చిత్రాలు


నాగచైతన్య, శర్వానంద్, ఎస్.రాధాకృష్ణ(చినబాబు)

'సన్నాఫ్ సత్యమూర్తి', 'అ..ఆ..', 'బాబు బంగారం', 'ప్రేమమ్' వంటి విభిన్న కథా చిత్రాలను నిర్మించి అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు ఎస్.రాధాకృష్ణ (చినబాబు). ప్రస్తుతం దర్శకుడు త్రివిక్రమ్ దర్శకత్వంలోనే ఎక్కువ చిత్రాలను నిర్మించి విజయాలను అందుకున్నారు. ఉత్తమాభిరుచితో కూడిన వినోదాత్మక చిత్రాల నిర్మాత సంస్థగా తన హారిక అండ్ హాసిని క్రియేషన్స్, దీని అనుబంధ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ నటిస్తున్న నూతన చిత్రాన్ని సైతం నిర్మిస్తున్న ఎస్. రాధాకృష్ణ పుట్టిన రోజు నేడు(గురువారం). తన పుట్టిన రోజును పురస్కరించుకుని రెండు నూతన చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, 'మా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ 3గా అక్కినేని నాగచైతన్య హీరోగా ఓ సినిమాను నిర్మించబోతున్నాం. దీనికి మారుతి దర్శకత్వం వహిస్తారు. అలాగే ప్రొడక్షన్ నెంబర్ 4గా శర్వానంద్ హీరోగా ఓ సినిమాను నిర్మించడానికి ప్లాన్ చేశాం. ఈ చిత్రానికి సుధీర్ వర్మ దర్శకుడు. విభిన్న కథా నేపథ్యాలతో ఈ చిత్రాలను తెరకెక్కించబోతున్నాం. మా బ్యానర్‌కివి మరో మంచి విజయవంతమైన సినిమాలుగా నిలుస్తాయని నమ్ముతున్నాం' అని అన్నారు. 'సితార బ్యానర్‌పై నాగచైతన్య, శర్వానంద్ హీరోలుగా సినిమాలు తెరకెక్కించడం ఆనందంగా ఉంది. ఈ రెండు చిత్రాలు త్వరలోనే ప్రారంభమవుతాయి. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామ'ని సమర్పకులు పి.డి.వి.ప్రసాద్ తెలిపారు.

పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రథావరం

శ్రీమురళి, రచితారామ్ హీరోహీరోయిన్లుగా చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో కన్నడలో ఘన విజయం సాధించిన 'రథావరం' చిత్రాన్ని ధర్మ శ్రీ ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై నిర్మాత మంజునాథ్.ఎన్ తెలుగులో అనువదిస్తున్నారు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం గురించి నిర్మాత మంజునాథ్ మాట్లాడుతూ, 'కన్నడలో భారీ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'రథావరం' అంటే నమ్మిన బంటు అని అర్థం. తెలుగు నెటివిటీకి తగిన విధంగా సెకండాఫ్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేశాం. ఇందులో మూడు పాటలుంటాయి. ఇటీవల మ్యాంగో మ్యూజిక్ ద్వారా పాటలు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. ఆడియో సక్సెస్ అయ్యింది. హిజ్రాల గురించి ఎవరికీ తెలియని ఒక రహస్యాన్ని ఈ చిత్రం ద్వారా చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆ రహస్యాన్ని తెలుసుకుని తీరాలి. ఈ సినిమా చూస్తే థర్డ్ జెండర్ గొప్పతనం ఏంటో తెలుస్తుంది. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ లవ్‌స్టోరీ ఇది. ఒక రాజకీయ నాయకుడికి ఈ చిత్రానికి ఉన్న లింకేంటనేది కథ. ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా చూసేలా ఉంటుంది. క్లాస్, మాస్ ప్రేక్షకులకు నచ్చే సన్నివేశాలున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 1న విడుదల చేయబోతున్నాం. మా ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.


'రథావరం'లో శ్రీమురళి, రచితారామ్

హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా..


పి.వి.సత్యనారాయణ, సాయివెంకట్, షెరాజ్

అమోగ్ దేశపతి, అర్చన, శ్రేయావ్యాస్ హీరోహీరోయిన్లుగా షెరాజ్ దర్శకత్వంలో సాయివెంకట్ సమర్పణలో స్వర్ణ ప్రొడక్షన్స్ పతాకంపై పి.వి.సత్యనారాయణ నిర్మిస్తున్న చిత్రం 'షాలిని'. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాయి వెంకట్ మాట్లాడుతూ, 'ఈ సినిమా లైన్ నచ్చడంతో సమర్పకుడిగా మారాను. హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. బయపెడుతూనే నవ్విస్తుంది. ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఇటీవల విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభించింది. పల్లెటూరు నుంచి సిటీకి వచ్చిన యువకులు ఇక్కడ ఇళ్ల రెంట్ కోసం ఎలాంటి ఇబ్బందులు పడ్డారు. ఇళ్లు దొరికాక ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నారనేది సినిమా. ఇంట్లో ఉన్న దెయ్యం ఎవరిలో ఉందనేది ఆసక్తికరం. ఆడియెన్స్‌ను థ్రిల్‌కు గురి చేస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. అవుట్‌పుట్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. అయితే సినిమాను మొదట సెప్టెంబర్ 1న విడుదల చేయాలనుకున్నాం. డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు సెప్టెంబర్ 2న శనివారం విడుదల చేస్తున్నాం. మా ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు షెరాజ్ తెలిపారు. నిర్మాత సత్యనారాయణ చెబుతూ, 'షెరాజ్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించాను. ఆయన చెప్పిన ఈ చిత్ర లైన్ నచ్చి ఆయన్ని దర్శకుడిగా పరిచయం చేస్తూ సినిమాను నిర్మిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో 80కిపైగా 0థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

చాలా పరిమితం

'ఇండియన్ సినిమాల్లో నా పాత్రలు చాలా పరిమితంగా ఉంటున్నాయి' అని అంటోంది అమీ జాక్సన్. 'మద్రాస్‌పట్టణం' తమిళ చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసిన అమీ అతి తక్కువ కాలంలోనే రజనీకాంత్‌తో నటించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రోబో 2.0'లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సందర్భంగా తనకు వస్తున్న పాత్రల గురించి అమీ చెబుతూ, 'నేను గ్రామీణ అమ్మాయి పాత్రలో నటిస్తానని ఎవరూ ఊహించరు. అది నా కేటగిరి కూడా కాదు. కానీ నటన పరంగా నేను ఓపెన్ అయ్యేలా ఆ పాత్రలు చేశాయి. అందుకే ఆ విషయంలో నాకెలాంటి సమస్య లేదు. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'రోబో 2.0'లో నేనూ రోబోగా కనిపిస్తాను' అని తెలిపింది. హిందీ భాషపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్న అమీ ప్రస్తుతం కన్నడలో 'ది విలన్', 'క్వీన్' రీమేక్‌తోపాటు ఇంగ్లీష్‌లో 'బూగీ మ్యాన్' చిత్రంలోనూ నటిస్తోంది.


అమీ జాక్సన్

సీపీఎస్ ఉద్యోగుల ఉద్యమానికి
అధ్యాపక సంఘాల మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల ఒకటిన సీపీఎస్ ఉద్యోగులు తలపెట్టిన సామూహిక సెలవు పాటించిన చేపట్టే ఉద్యమానికి డిగ్రీ అధ్యాపక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు జీసీజీటీఏ అధ్యక్షుడు ఎ సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి, టీజీసీటీఏ అధ్యక్షుడు బ్రిజేష్, ప్రధాన కార్యదర్శి సంగి రమేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ జేఏసీ పిలుపులో భాగంగా వచ్చేనెల ఒకటిన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఎలాంటి భద్రత లేదని పేర్కొన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

గోరఖ్‌పూర్‌లో ఆగనిచావులు

(మొదటీపేజీ తురువాయి)

కారణంగా వ్యాధులు మరింతగా ప్రబలుతున్నాయి. రోగుల తాకిడి కూడా భారీగా పెరిగింది' అన్నారు. ఆస్పత్రి రికార్డుల ప్రకారం.. ఈ ఏడాది ప్రారంభం నుంచి సోమవారం వరకు నవజాత శిశువులు, మెదడువాపు వ్యాధికి సంబంధించిన వార్డుల్లో 1,250 మంది చిన్నారులు మృతిచెందారు. మరోవైపు ఆక్సిజన్ సరఫరాలో అంతరాయంతో ఇటీవల చిన్నారులు మృతిచెందిన ఘటనకు సంబంధించి బీఆర్డీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజీవ్ మిశ్రా, అతని భార్య డాక్టర్ పూర్ణిమా శుక్లాను యూపీ స్పెషల్ టాస్క్ ఫోర్స్ మంగళవారం అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తోంది.

లోపభూయిష్టం...
ఆర్థిక భద్రత లేని ఈ విధానాన్ని రద్దు చేయాలి

సీపీఐ తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అత్యంత లోపభూయిష్టమైందని సీపీఐ పేర్కొంది. ఉద్యోగులకు ఆర్థికంగా ఎలాంటి భద్రతనివ్వలేని ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో ఈ మేరకు తీర్మానించారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఆ పార్టీ పూర్తి సంఘీభావం తెలిపింది. భూ సమగ్ర సర్వేను పక్కదోవ పట్టిస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టింది. సర్వే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్.. విపక్షాలు, నిపుణులు, మేధావుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించింది. రాష్ట్రస్థాయిలో రైతు సమన్వయ సమితికి ధరల స్థిరీకరణ పేరిట రూ.500 కోట్లను కేటాయించటమంటే.. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు విశేషాధికారాలు ఇవ్వటమే అవుతుందని తెలిపింది. భూ అంశాలను రాజకీయం చేయటమంటే బరితెగించి చట్టాలను ఉల్లంఘించటమే అవుతుందని విమర్శించింది. ఇలాంటి వైఖరి ఘర్షణలకు దారి తీస్తుందని సీపీఐ ఈ సందర్భంగా హెచ్చరించింది. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పదవీ విరమణ పొందిన వారితోపాటు భూ అంశాలపై అనుభవమున్న, నిజాయితీపరులతో కమిటీని ఏర్పాటు చేయటం ద్వారా సర్వేను పారదర్శకంగా నిర్వహించవచ్చని సూచించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర సమితి తీర్మానించింది.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి :ఏఐటీయూసీ

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరింది. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ విధానాల్లో భాగంగానే పాలకులు సీపీఎస్‌ను ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. లోపభూయిష్టమైన ఇలాంటి విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం నిర్వహించతలపెట్టిన ఆందోళనకు ఏఐటీయూసీ తరపున పూర్తి మద్దతు తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ప్రొఫెసర్ జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఫారెస్ట్ శాఖలోని బేస్ క్యాంపునకు చెందిన 40మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తూ జిల్లా ఫారెస్ట్ అధికారి రవికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంబంధిత బేస్ క్యాంపులో విధులు నిర్వహించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అన్వర్‌పాషా పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఒంటిపైనా పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. తోటి సిబ్బంది గమనించి అన్వర్‌పాషాను ఆస్పత్రికి తరలించారు. తమను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ డీఎఫ్‌ఓ కార్యాలయం ఎదుట బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. దీనిపై డీఎఫ్‌ఓ రవికిరణ్ రాత్రి వరకూ స్పందించకపోవడంతో ఆందోళన రాత్రంతా కొనసాగింది.

నోట్ల రద్దుకు ఆర్‌బీఐ సిఫారసు సిగ్గుచేటు : చిదరంబరం



న్యూఢిల్లీ : పెద్ద నోట్ల రద్దుకు రిజర్వ్ బ్యాంక్ సిఫారసు చేయటం సిగ్గుచేటైన విషయమని మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం విమర్శించారు. రద్దయిన నోట్లలో ఒక శాతం తిరిగి జమ కాలేదంటూ ఆర్‌బీఐ వెల్లడించిన లెక్కలపై ఆయన స్పందిస్తూ మొత్తం రద్దయిన రు.16వేల కోట్ల నోట్లల్లో రు.1,544 కోట్ల విలువైన నోట్లు తిరిగి రిజర్వ్ బ్యాంక్‌కు చేరలేదని చెప్పటం సిగ్గుచేటైన విషయమని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నోట్ల రద్దు ద్వారా రిజర్వ్ బ్యాంక్ లబ్ధి పొందింది కేవలం రు.16వేల కోట్లు మాత్రమేనని, కొత్త నోట్ల ముద్రణ ద్వారా మూటకట్టుకున్న నష్టం రు.21 వేల కోట్లు అని లెక్కలుచెబుతున్నాయని ఆయన వివరించారు. ఇంత 'మహత్తర' పథకానికి రూపకల్పన చేసిన ఆర్థిక వేత్తలకు నోబుల్ ప్రైజ్ అందచేయవచ్చని ఆయన వ్యంగ్యోక్తి విసిరారు. నోట్ల రద్దు అన్నది ప్రణాళికా బద్ధంగా చేసిన లూటీ, చట్టబద్ధమైన తప్పిదం అని ఆయన వ్యాఖ్యానించారు. నల్లధనాన్ని వెలికి తెచ్చేందుకు నోట్ల రద్దు చేపట్టామని కేంద్రం చెబుతున్న సాకులపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. నోట్ల రద్దు చర్య ద్వారా 99 శాతం నల్ల డబ్బు తెలుపుగా మారినట్లు కేంద్రం చెబుతున్న మాటల ద్వారా అర్థమవుతోందన్నారు.

కనేది మీరు.. బాధ్యత మాదా?



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో పసికందుల మరణాల గురించి యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పిల్లల తల్లిదండ్రులను ఎగతాళీ చేసేలా మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. 'పిల్లలకు రెండేండ్లు దాటగానే తల్లిదండ్రులు వారి బాధ్యతను ప్రభుత్వంపై వేసేస్తున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా.. 'రోడ్డుపై చెత్త కనపడితే.. సర్కారుదే బాధ్యత అంటారు. అన్ని బాధ్యతలు సర్కారుపై వేసి జనమంతా విముక్తులయ్యారా?' అంటూ ప్రశ్నించారు 'మనలో సివిక్ సెన్స్ లేదు. మనం పరిశుభ్రతను కోరుకోం. దీనికి ప్రభుత్వమే జవాబుదారీనా? నగరపాలక సంస్థలు, పంచాయతీలు ఉన్నాయి. ఇది వాటి బాధ్యత. జనమంతా సర్కారుదే బాధ్యత అనుకుంటున్నారు. ఒకటి, రెండేండ్లు తమ బిడ్డల ఆలనాపాలనా చూసి.. ఆ తర్వాత బిడ్డల బరువు, బాధ్యతలన్నీ సర్కారేదే అన్న విధంగా తల్లిదండ్రుల ఆలోచన మారిందని నాకు కొన్నిసార్లు అనిపిస్తుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆవును ఎంతగానో ప్రేమించే యోగికి ఇప్పుడు వాటిపై కూడా కోపం వచ్చేసింది. 'ఇండ్లల్లో ఆవులు పెంచితే... అవి ఇచ్చే పాలు అమ్ముకోవచ్చు. కాని వాటిని ఇప్పుడు రోడ్లపై వదిలేస్తున్నారు. వాటి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో గోశాలలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యేలు అంటున్నారు. బాగానే ఉన్నది. పాలు మీరు తాగుతారు. గడ్డి, పేడ బాధ్యత సర్కారుదా?' అని యోగి ప్రశ్నించారు. స్టార్టప్ బస్సుయాత్ర కార్యక్రమం సందర్భంగా యూపీ సీఎం యోగి పై విధంగా స్పందించారు.

కౌంటర్‌కు టైం ఇవ్వండి

(మొదటీపేజీ తురువాయి)

కలిసే తాము వైద్యం పొందుతామని మొండికేస్తున్నారని ఏజీ తెలిపారు. నిజానికి ఆ నలుగురికీ వైద్య సేవలు అవసరం లేదన్నారు. బాధితుల్ని జైలుకు తీసుకువెళ్లినప్పుడు వారికి గాయాలున్నాయని, అందుకే జైలు అధికారి వారిని జైల్లోకి తీసుకునేందుకు నిరాకరించారని చెప్పారు. ఈ నివేదికలపై కౌంటర్ కాపీని పిటిషనర్ లాయర్‌కు అందజేయాలని, ఆ తర్వాత ఇరువురి వాదనల్ని సెప్టెంబర్ 5న విచారిస్తామని బెంచ్ వెల్లడించింది.

సీడబ్ల్యూసీ మెంబర్‌గా జైపాల్ !

- ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా పొన్నాల, అధికార ప్రతినిధిగా దాసోజు
- రాహుల్ నుంచి సిగ్నల్స్ అందినట్టు ముఖ్యనేత వెల్లడి
- రాష్ట్ర ఎన్నికల ప్రచార బాధ్యతలు దామోదర రాజనర్సింహ?



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నేతల్లో కొందరికి జాతీయ పదవులు దక్కబోతున్నాయి. సీడబ్ల్యూసీ మెంబర్‌గా కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, అధికార ప్రతినిధిగా దాసోజ్ శ్రవణ్‌ను నియమించబోతున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా ఏఐసిసి జాతీయ కార్యదర్శులుగా విజయశాంతి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ లేదా మాజీ ఎంపీ అజహరుద్దీన్‌లను తీసుకునే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. టీపీసీసీ టీంకు అదనంగా బీసీ వర్గానికి చెందిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి దక్కనున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి ఏఐసీసీ నుంచి గ్రీన్‌సిగ్నల్ అందినట్టు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వర్గాలు తెలిపాయి. పార్టీలోనే ముఖ్యనేతే ఈ విషయాన్ని విలేకరుల చిట్‌చాట్‌లో ప్రకటించారు. అక్టోబర్ మాసంలో జాతీయ ప్లీనరీ జరగనుంది. ఈ సందర్భంగా ఏఐసీసీ నూతన అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు తీసుకోబోతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నుండి కొందరికి పదవులు దక్కనున్నాయి. దీనికి రాహుల్‌గాంధీ నుండి గ్రీన్‌సిగ్నల్ లభించిందని ఆ నేత మీడియాకు తెలియజేశారు. ఎన్నికల తర్వాత పార్టీకి దూరంగా ఉంటున్న మాజీ ఎంపీ విజయశాంతి సేవలను పార్టీకి ఉపయోగించుకోవడానికి ఇప్పటికే ఉత్తమ్‌కుమార్ ఆమెతో సంప్రదింపులు జరిపారు. ఏఐసీసీ వర్గాలు కూడా ఆమెతో మాట్లాడినట్టు తెలిసింది. గత ఎన్నికలల్లో టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటి చైర్మెన్‌గా ఉన్న దామోదర రాజనర్సింహ్మా వచ్చే ఎన్నికలకు ప్రచార సారధిగా నియమించేందుకు అధిష్టానం నిర్ణయించినట్టు తెలిసింది.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

- సీపీఐ (ఎం) డిమాండ్
- రేపటి ఆందోళనకు మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు శనివారం సామూహికంగా నిర్వహించతలపెట్టిన ఆందోళనకు పూర్తి మద్దతు తెలిపింది. సీపీఎస్ వల్ల రాష్ట్రంలోని లక్షా ఇరవై వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత లేకండా పోతున్నదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. త్రిపుర, బెంగాల్ రాష్ట్రాల్లో ఇప్పటికీ పాత పెన్షన్ విధానమే అమలవుతున్నదని గుర్తుచేశారు. తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు పాత పెన్షన్ విధాన పునరుద్ధరణపై అధ్యయనానికి కమిటీలు వేశాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందరికంటే ముందుగా ఏకపక్షంగా సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇక్కడి ప్రభుత్వం.. జాతీయ పెన్షన్ పథకాన్నే కొనసాగించేందుకు అంగీకారం తెలిపింది, అందుకనుగుణంగా ఒప్పంద పత్రంపై టీఆర్ఎస్ సర్కారు సంతకం చేసిందని తెలిపారు. ఫలితంగా చనిపోయిన, రిటైరైన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు గ్రాట్యుటీ, పీఎఫ్ లేక, కుటుంబ పెన్షన్ అందక నానా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సర్కారులో చలనం లేదని, వైఖరిలో మార్పు రాలేదని విమర్శించారు. సీపీఎస్ విధానం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది.. కాబట్టి దీన్ని మేం పరిష్కరించలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం సరికాదని తమ్మినేని పేర్కొన్నారు. ఇది ఉద్యోగులను మభ్యపెట్టటమే అవుతుందని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే అధికారం రాష్ట్రాలకు ఉన్నందున ఉద్యోగుల ఆందోళనలను గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు. తద్వారా సీపీఎస్ విధానం నుంచి వైదొలగాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీలకు ప'రేషన్'

(మొదటీపేజీ తురువాయి)

సుమారు 100కు పైగా డీలర్‌షిప్‌ను రద్దు చేసుకున్నారు. పేరుకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నా గత కొన్ని నెలలుగా కేవలం బియ్యం, కిరోసిన్ మాత్రమే సరఫరా చేస్తున్నది. ఇక ప్రభుత్వం ఇటీవలే బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అమలవుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని విస్తరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కానీ బయోమెట్రిక్ విధానంలో అనేక కష్టాలకు గురవుతున్నారు. ఒక్కోసారి మిషన్లు పనిచేయక గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో సరుకుల పంపిణీలో గందరగోళం నెలకొంటున్నది. ఇక డీలర్ల సంగతి చెప్పక్కర్లేదు. సమయ పాలన అంటూ ఉండదు. ఈ విధంగా అస్తవ్యస్థమైన పనితీరు, నిర్వీర్యమవుతున్న చౌక దుకాణాలకు ఐసీడీఎస్ పథకాన్ని అనుసంధానం చేయడం సరైన పద్ధతి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సరుకులు తెచ్చుకోవడానికి అంగన్‌వాడీ కేంద్రం పని పక్కనబెట్టి రేషన్ కోసం చౌకదుకాణాల చుట్టు తిరగాల్సి ఉంటుంది. సరుకులు తెచ్చుకోవడానికి రవాణా ఖర్చుల భారం అంగన్‌వాడీలపైనే పడుతుంది. సమయం వృథా అవుతుంది. కొన్ని దుకాణాలను పలుకుబడి ఉన్న వ్యక్తులు నడుపుతున్నారు. కాబట్టి రాజకీయ జోక్యం పెరుగుతుంది. అంతేకాకుండా అంగన్‌వాడీల్లో పనిచేసే వారందరు దాదాపు మహిళలే. ఈ నేపథ్యంలో వారిపై లైంగిక వేధింపులు పెరిగే ప్రమాదం ఉంటుంది. సరుకుల్లో వాటాలు అడుగుతారు. ఒక వర్గంగా ఏర్పడి దాడులు జరిగే అవకాశమూ లేకపోలేదు. చివరికి ఉన్నవి లేనివి కల్పించి లేని సాక్ష్యాలు సృష్టించి అంగన్‌వాడీలను ఉద్యోగం నుంచి తొలగించే ప్రయత్నం జరిగే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ జిల్లాలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. దీంతోపాటు నగదు బదిలీ పథకానికి దారి తీసే ప్రమాదం పొంచి ఉంది.

రేషన్ బియ్యాన్ని త్వరలోనే నగదు బదిలీ కిందకు తీసుకొస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అనేక సందర్భాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాన్నే కొనసాగించాలని కోరుతున్నారు.

ఐసీడీఎస్ నిర్వీర్యానికి కుట్ర : జయలక్ష్మీ

చౌక దుకాణాల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల పంపిణీ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.జయలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది ఐసీడీఎస్ నిర్వీర్యానికి కుట్రగా అభివర్ణించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పాయింట్ల విధానాన్నే కొనసాగించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నల్ల డబ్బు జాడేదీ!

(మొదటీపేజీ తురువాయి)

చేరాయని తెలిపింది. పెద్దనోట్ల రద్దుకు ముందు వ్యవస్థలో రూ.15.44 లక్షల కోట్ల పెద్ద కరెన్సీ చలామణిలో ఉన్నట్టుగా పెద్ద బ్యాంకు వివరించింది. ఇక రద్దు చేసిన 632.6 కోట్ల వెయ్యి రూపాయల నోట్లలో ఇంకా 8.9 కోట్ల వెయ్యి నోట్లు (రూ.8,900 కోట్లు) తిరిగి వెనక్కి రాలేదని ఆర్‌బీఐ వార్షిక నివేదికలో వెల్లడైంది. అంటే కేవలం 1.3 శాతం వెయ్యి రూపాయల నోట్లు మాత్రమే వెనక్కి రాలేదని తెలుస్తోంది. మరోవైపు ఆర్‌బీఐ కొత్తగా విడుదల చేసిన రూ.2000 నోట్లు మార్చి చివరి నాటికి 50 శాతానికి పైగా చలామణిలోకి వచ్చాయని ఆర్‌బీఐ పేర్కొంది. ఇదిలా ఉండగా 2016-17లో కొత్త నోట్ల ముద్రణ కోసం ఆర్‌బీఐ దాదాపు రూ.7,965 కోట్లు మేర ఖర్చు చేసినట్టుగా వివరించింది. ఇప్పడు రద్దు లక్ష్యాలను అందుకోకపోవడంతో ఈ మొత్తం ప్రజాధనం వృథా అయినట్టే చెప్పుకోవచ్చు. మార్చి నాటికి వ్యవస్థలో కరెన్సీ వాడకం 20.2 శాతం మాత్రమే తగ్గిందని సర్కారు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో సర్కారు కలలుగన్న డిజిటల్ కరెన్సీ స్వప్నం కూడా చెదిరినట్టయింది.

రంగు మారిన నల్లధనం..

గత ఏడాది నవంబరులో సర్కారు చేపట్టిన పెద్దనోట్ల రద్దు బడా బాబులకు బాగా కలిసి వచ్చింది. ఇప్పటి వరకు చీకట్లో ఉంచిన నల్లధనాన్ని నోట్ల రద్దు రూపంలో సర్కారు అందించిన ఆఫర్‌తో వారు భారీ మొత్తంలో నగదును వెలుగులోకి తీసుకు వచ్చారు. నోట్ల రద్దు సమయంలో బ్యాంకు సిబ్బంది అండతో బడా బాబులు నగదు మొత్తాన్ని వివిధ అక్రమ మార్గాల్లో బ్యాంకింగ్ వ్యవస్థలోకి జొప్పించిన సంగతి తెలిసిందే. ఈ విధంగా వారు తమ నల్లధనం రంగు మార్చుకున్నారు. అక్రమార్కుల చిట్టా తమవద్ద ఉందని సర్కారు చెబుతున్నప్పటికీ వీటి ఆధారంగా వెలుగులోకి వచ్చే సొమ్ము కూడా అంత భారీగా ఉండకపోవచ్చని తెలుస్తోంది.


పెరిగిన వేతనాలు ఖరారు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ జెన్‌కోలో కాంట్రాక్ట్ బేసిస్‌లో పనిచేస్తున్న 2,911 మందికి వేతనాల్ని పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. జెన్‌కోలో మొత్తంగా 2,914 మంది కాంట్రాక్ట్ కార్మికుల జాబితాలో ఉండగా వారిలో వివిధ కారణాలతో ముగ్గురి పేర్లను తొలగించినట్టు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల్ని విద్యుత్ సంస్థల్లో విలీనం చేసుకొనేందుకు న్యాయస్థానం అభ్యంతరం చెప్పిన దృష్ట్యా వారి వేతనాల్ని పెంచుతామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దానిలోభాగంగా కాంట్రాక్ట్ కార్మికుల్ని నాలుగు గ్రేడ్‌లుగా విభజించారు. గ్రేడ్-1 లోని ఉద్యోగులు, కార్మికులకు గౌరవవేతనం ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు కలిపి రూ.23వేలుగా ఖరారు చేశారు. ఈఎస్ఐ (1.75 శాతం), ఈపీఎఫ్ (12 శాతం) కటింగ్స్ పోనూ చేతికి రూ.20,118 వస్తాయి. గ్రేడ్-2 కార్మికుల వేతనం రూ.19వేలు (ఈఎస్ఐ, ఈపీఎఫ్ కలిపి) కాగా, కటింగ్స్ పోనూ చేతికి రూ.16,634 వస్తాయి. గ్రేడ్-3 కార్మికుల వేతనాన్ని రూ.16వేలు (ఈఎస్ఐ, ఈపీఎఫ్ కలిపి) కాగా, కటింగ్స్ పోనూ చేతికి రూ.13,984 వస్తాయి. గ్రేడ్-4 కార్మికుల వేతనం రూ.14వేలు (ఈఎస్ఐ, ఈపీఎఫ్ కలిపి) కాగా, కటింగ్స్ పోనూ చేతికి రూ.12,217 వస్తాయి. అయితే ఈ వేతనాలు హైకోర్టు తుది తీర్పు మేరకు సవరణలు జరిగే అవకాశం ఉన్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సవరించిన వేతనాల అమలు కొరకు ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు కాంట్రాక్ట్ కార్మికుల బ్యాంక్ అక్కౌంట్లలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహారాష్ట్రను అతలాకుతలంచేసిన భారీ వర్షాలు

- 15 మంది మృతి, 12 మందికి గాయాలు



ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 15 మంది మృతి చెందారు. 12 మందికి గాయాలయ్యాయి. బుధవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ముంబయిలో బస్సులు, రైళ్ళు, విమానాలను పునరుద్ధరించారు. ముంబయిలో మంగళవారం రాత్రి మరో ముగ్గురు మృతి చెందడంతో మృతుల సంఖ్య 15కు పెరిగింది. గడిచిన 24 గంటల్లో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా ముంబయిలో పలు ప్రాంతాలు వరదల్లో చిక్కుకున్నప్పటికీ తరువాత నీటి ఉధృతి తగ్గింది. రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను స్థానికులు తొలగించారు..

ముందుగా హెచ్చరించినా... పట్టించుకోని ప్రభుత్వం

ముంబయిలో బుధవారం ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు భారీ వర్షాలు కురిశాయి. దీంతో రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ నిలిచి పోయింది. రహదారులు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో పౌరులందరూ తమ తమ నివాసాలలోనే ఉండాలంటూ గ్రేటర్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) మధ్యాహ్నం 2 గంటల సమయంలో తొలి హెచ్చరిక చేసింది. అప్పటికే వర్షం తగ్గుముఖం పట్టి, నీటి ప్రవాహం తగ్గిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా చాలా ఆలస్యంగా స్పందించి మధ్యాహ్నం నుంచి కార్యరంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మధ్యాహ్నం కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఆ తరువాత విపత్తు నిర్వహణ కేంద్రాలను సందర్శించారు. కాగా ఉదయం రాష్ట్ర విపత్తు నిర్వహణా కేంద్రం అధికారులు మాట్లాడుతూ పరిస్థితి మెరుగుపడిందని, సహాయ చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

రైతుల జీవితాలతో సర్కారు చెలగాటం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం అడుతున్నదని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. భూముల క్రమబద్ధీకరణ, వివాదాలను పరిష్కరించడం, కొత్త సర్వే నెంబర్లు ఇవ్వడం తదితర భూసమస్యల పరిష్కారం కోసం గ్రామ, మండల, జిల్లా , రాష్ట్ర రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. ఇందులో టీఆర్ఎస్ కార్యకర్తలే ఉంటారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. వీరికి విస్తృత అధికారాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. రాజ్యాంగం ద్వారా రైతులకు వచ్చిన ఆస్థి హక్కును టీఆర్ఎస్ కార్యకర్తలు నిర్ణయించనున్నారని చెప్పారు. రికార్డ్స్ ఆఫ్ రైట్స్ చట్టం రాష్ట్రంలో ఉందని, అదే కాక కేంద్ర, రాష్ట్ర భూచట్టాలు సైతం ఉన్నాయన్నారు. వీటిని తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబరు 39 ద్వారా కాలరాస్తున్నదని విమర్శించారు. మహానుభావుడు ఎన్టీఆర్ భూమి శిస్తును, పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని తెలిపారు. అదే కేసీఆర్ అప్పట్లో ప్రశంసించారని, ఇప్పుడు పటేల్, పట్వారీ వ్యవస్థకు మళ్లీ శ్రీకారం చుడుతున్నారన్నారు. జీవో 39కి వ్యతిరేకంగా టీడీపీ నేతలు ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జీవో ప్రతులను దహనం చేశారు.

కీచక ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

(మొదటీపేజీ తురువాయి)

చంద్రమోహన్‌కు 14 మంది విద్యార్థినులు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీని మీద విచారణ చేయాలని ఎంఇఓ రాములను డీఈఓ ఆదేశించారు. ఆ నివేదికను కలెక్టర్ గౌరవ్ ఉప్పల్‌కు పంపారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణమూర్తిని సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

బోగస్ అవార్డులు..ఫేక్ సర్వేలు

(మొదటీపేజీ తురువాయి)

వ్యవసాయ నాయకత్వ అవార్డు అంటూ ప్రకటించగానే...కర్షక రత్న కేసీఆర్ అంటూ టీఆర్ఎస్ నేతలు తప్పుడు పబ్లిసిటీ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులు కోసం ఇచ్చే అవార్డుకు రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్ నరసింహన్ సీఎంకు అభినందలు ఎలా తెలుపుతారని ప్రశ్నించారు. ఈ అవార్డుతో ముఖ్యమంత్రి సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ నాయకత్వ అవార్డు పొందిన కేసీఆర్ రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. జీవో 39 పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. తెలంగాణ రాష్ట్రం రైతు ఆత్మహత్యల్లో నెంబర్ 2లో ఉన్నదుకా? రైతులకు మద్దతు ధర ఇవ్వనందుకా? రుణమాఫీని పూర్తిగా అమలు చేయనందుకా? వడ్డీ భారం తనదేనంటూ మాట తప్పినందుకా? ఎందుకు అవార్డు ఇచ్చారని సదరు సంస్థను ప్రశ్నించారు. ఈ బోగస్ అవార్డుపై ఎమ్ఎస్ స్వామినాథన్‌కు లేఖ రాస్తానన్నారు. ఎన్నికల కోసమే టీఆర్ఎస్ రైతు సమన్వయ సమితులను తెరమీదికి తెచ్చిందన్నారు. రైతు సమితులు, భూసర్వేలను రాజకీయలకు అతీతంగా ఉండాలన్నారు. రైతు సమితులను టీఆర్ఎస్ నామినేటెడ్ కమిటీలుగా చేయాలని ప్రయత్నిస్తోందన్నారు.

పారదర్శకంగా సర్వే

(మొదటీపేజీ తురువాయి)

జరగకూడదన్నారు. భూరికార్డుల ప్రక్షాళన పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. చిక్కులు, సమస్యలు లేని 95 శాతం భూముల వివరాలు మొదట ఖరారు చేయాలన్నారు. తుది జాబితాపై గ్రామంలోని రైతులందరి సంతకాలు తీసుకుని బహిర్గతం చేయాలని చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళన కోసం 1193 బందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో బ ందానికి 9 గ్రామాలు అప్పగించామని చెప్పారు. రుణాల కోసం బ్యాంకుల్లో పాస్ పుస్తకాలు తాకట్టు పెట్టే విధానం పోవాలన్నారు. కంప్యూటర్ సమాచారం ఆధారంగానే రైతులకు రుణాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రక్షాళన త్వరగా, పకడ్బందీగా పూర్తి చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. రెవెన్యూ అధికారులకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని తహసీల్దారులందరితో తాను సమావేశం కానున్నట్టు సీఎం తెలియజేశారు. ఇతర ముఖ్యాంశాలు సీఎం మాటల్లోనే..

1. ఒకప్పుడు ప్రభుత్వ ఆదాయ వనరు భూమి శిస్తుగా ఉండేది. అయితే కాలక్రమేణా రైతుల దగ్గర శిస్తు వసూలుకు బదులు ప్రభుత్వమే ఎకరానికి రూ. 8 వేల పెట్టుబడిని సమకూరుస్తున్నది.

2. ప్రపంచవ్యాప్తంగా రైతులను అన్ని దేశాలు గౌరవిస్తున్నాయి. ఆహారరంగంలో స్వావలంబన ఉండాలని కోరుకోవడమే దీనికి ప్రధాన కారణం.

3.వచ్చే సంవత్సరం కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు పుష్కలంగా లభ్యమవుతాయి. చెరువులు నింపుకుంటాం. దీని ద్వారా పూర్వపు ఏడు జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు ఉపయోగంలోకి వస్తాయి. పంటలు బాగా పండటంతో అన్ని రకాల ప్రజలు, రైతులు బాగుంటారు.

4. పహాణి, సేత్వారి తదితర పాతకాలపు పదాలు మన తెలుగు భాషకు సంబంధించినవి కావు. అందుకే తెలుగులో సరళంగా, సులభంగా, సరళీకృతమైన భాషలో ఈ పదాలను మార్చాలి.

5. కోట్లాది బ్యాంకు ఖాతాలను పకడ్బందీగా నిర్వహిస్తున్న 'కోర్ బ్యాంకింగ్' విధానాన్ని భూరికార్డులకు అనుసరించాలి. భూరికార్డులు జరిగిన తరువాత కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎప్పటికప్పుడు చోటుచేసుకునే మార్పులకు అనుగుణంగా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలి.

6. ఒకవైపు భూప్రక్షాళన జరుగుతుండగానే, అది పూర్తయ్యే సమయానికి ఐటీ ఆఫీసర్ల నియామకం, కంప్యూటర్లు, సర్వర్ల కొనుగోలు, కంప్యూటర్ అనుసంధానం పూర్తికావాలి

7. మ్యుటేషన్ ప్రక్రియ రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఎప్పటికప్పుడు జరిగిపోవాలి. క్రయవిక్రయాల సందర్భంగా రైతులు ఒకే ఒక్కసారి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేలా వెసులుబాటు ఉండాలి.

8. ఒక్క కలెక్టరేట్ కోర్టు మినహా మిగతా ఇతర రెవెన్యూ కోర్టులన్ని రద్దుచేయాలి.

9. భూప్రక్షాళన, రికార్డుల సవరణకు సంబంధించి పకడ్బందీగా త్వరితగతిన పనిపూర్తి చేసి ఎమ్మార్వో, ఆర్డీవో అధికారులకు, జిల్లాలకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ఇవ్వాలి.

10. గురువారం కలెక్టర్లు, ఆర్డీవోలు ఇతర రెవెన్యూ సంబంధిత అధికారుల సమావేశం జరగనుంది. త్వరలోనే రాష్ట్రంలోని ఎమ్మార్వోలందరితోనూ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం.

ఆ విధానాన్ని రద్దు చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని (సీపీఎస్) కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. సీపీఎస్‌రద్దు కోసం 1న చీకటి రోజుగా పేర్కొంటూ పెన్షన్ విద్రోహదినంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంపూర్ణంగా మద్దతు తెలుపుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. 2004 నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నేషనల్ స్కీం పేరుతో పెట్టిన సీపీఎస్ విధానం దుర్మార్గపు చర్యని పేర్కొన్నారు. ఈ విధానం అన్యాయమని, పింఛన్ అనేది ప్రభుత్వాలు, యాజమాన్యాలు పెట్టే భిక్ష కాదని తెలిపారు. 13 ఏండ్లుగా ఈ పథకానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యోగ సంఘాలు ఉద్యమిస్తున్నా కేంద్ర వైఖరిలో మార్పు రావడంలేదన్నారు. ఒకే దేశం, ఒకే పన్ను అంటూ జీఎస్‌టీతో ఊరేగుతున్న మోదీ ప్రభుత్వం కూడా ఉద్యోగుల్లో రెండు రకాల పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు రాష్ట్రంలోని కార్మిక సంఘాలు అండగా నిలవాలన్నారు. ఇదే విషయమై నవంబర్ 9, 10, 11 తేదీల్లో పార్లమెంట్ వద్ద జరిగే మహాధర్నాకు ఉద్యోగులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

డేరా బాబా భూముల్ని స్వాధీనం చేసుకోవాలి



(మొదటీపేజీ తురువాయి)

భూములు కబ్జాకు గురైనప్పటికీ వాటిని వెలికితీయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కబ్జాకు గురైన అసైన్డ్, సీలింగ్ భూముల గుర్తింపు కోసం సెప్టెంబర్ 19న సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి డేరా స్వచ్ఛసౌదా ఆశ్రమంలోని నిర్మాణాలను తొలగించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యకాస రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బుర్రి ప్రసాద్, ఆర్. వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారి అయిలయ్య మాట్లాడుతూ డేరాబాబాపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించి కబ్జాలోనున్న వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బాబాలు, స్వాములను పెంచి పోషిస్తూ తమ రాజకీయ స్వార్థానికి కొన్ని పార్టీలు ఉపయోగించుకుంటున్నాయన్నారు. రేపటిలోగా 12 ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోకపోతే వ్యకాస ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి సర్వయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్టా నగేశ్, మండల కార్యదర్శి శంకరయ్య, నాయకులు నారబోయిన శ్రీనివాస్, రాజన్న, కత్తుల లింగస్వామి, వెలిమినేడు ఎంపీటీసీ నర్సింహ్మా, శ్రీనివాస్, వెంకట్రామయ్య, లక్ష్మీనారాయణ, ఐ.నర్సింహ్మా, చంద్రయ్య పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲258 31,646 | నిఫ్టీ ▲88 9,884 | డాలరుకు రూపాయి విలువ 63.94 | బంగారం(10.గ్రా) రూ. 30,203 | వెండి (కేజీ) రూ. 42,000






కోడిగుడ్లు			
హైదరాబాద్	355	విజయవాడ	359
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	400

99 శాతం వాటాదారులు సై!


- విప్రో బైబ్యాక్ ఆఫర్‌కు మార్గం సుగమం



న్యూఢిల్లీ: దేశంలో మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ విప్రో బైబ్యాక్ ఆఫర్‌కు మార్గం సుగమమైంది. సంస్థ ప్రతిపాదించిన రూ.11,000 కోట్ల మేర షేర్ల బైబ్యాక్ ఆఫర్‌కు కంపెనీ వాటాదారులు సమ్మతి తెలిపారు. ఈ విషయాన్ని విప్రో ఒక ప్రకటనలో స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ప్రతిపాదిత బైబ్యాక్ ఆఫర్‌కు సంస్థ సెప్టెంబరు 15ను రికార్డు తేదీగా నిర్ణయించింది. షేరు ఒక్కింటికి రూ.320 చొప్పున దాదాపు 34.375 కోట్ల వాటాలను తాము తిరిగి కొనుగోలు చేయనున్నట్టుగా విప్రో ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. బైబ్యాక్‌కు సంబంధించిన ప్రతిపాదనకు గాను పోస్టల్ బ్యాలెట్, ఈ-ఓటింగ్ ద్వారా వాటాదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేసినట్టుగా విప్రో తెలిపింది. కంపెనీ ప్రతిపాదనకు నిర్వహించిన ఓటింగ్ ప్రక్రియ ఈ నెల 28తో ముగిసింది.. ఇందులో దాదాపు 99.68 శాతం మంది వాటాదారులు బైబ్యాక్ ఆఫర్‌కు సమ్మతి తెలిపినట్టుగా వివరించారు. బైబ్యాక్ నేపథ్యంలో విప్రో షేర్లు బుధవారం స్వల్పంగా పెరిగి రూ.291.65 వద్ద ముగిశాయి. విప్రో తలపెట్టిన వాటాల బైబ్యాక్ వల్ల షేరు ఒక్కింటిపై ఆర్జన పెరగడంతో పాటు సంస్థ వద్ద నిబంధనల కంటే అధికంగా ఉన్న నగదు వాటాదారులకు పంచేందుకు వీలు పడనుంది. జూన్ 30 నాటికి విప్రో పుస్తకాలలో రూ.5,432 కోట్ల నగదు లేదా నగదు సమానమైన సొత్తు, రూ.37,204 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి.

'రద్దు' లక్ష్యం నగదు జప్తు కాదు!

- చీకట్లో దాగిన సొమ్మును వ్యవస్థలోకి తేవడమే..
- పెద్దనోట్ల రద్దు ప్రక్రియ అనుకున్న లక్ష్యాల్ని చేరింది
- ఇప్పటికే వ్యవస్థలో ఆర్థిక ఫలితాలు కనిపిస్తున్నాయి
- తనదైన రీతిలో స్పందించిన అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు ప్రక్రియ విఫలమైందంటూ విమర్శలు వినవస్తుండడంతో సర్కారు అప్రమత్తమైంది. వ్యవస్థలోకి రాకుండా చీకట్లో ఉండిపోయిన సొమ్మును వ్యవస్థలోకి తీసుకు వచ్చేందుకే తాము పెద్ద నోట్ల రద్దు చేపట్టినట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం వివరణనిచ్చారు. వ్యవస్థలోకి రాకుండా అక్రమంగా దాచిన సొమ్మును జప్తు చేసే ఉద్దేశంతో తాము నోట్ల రద్దు చేపట్ట లేదని ఆయన తెలిపారు. వ్యవస్థలో ఎవరెవరి వద్ద ఎంతెంత మొత్తంలో నగదు ఉందన్న విషయం నోట్ల రద్దుతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ప్రజలు తమ నల్లధనాన్ని సైతం బ్యాంకుల్లో వివిధ రూపాల్లో డిపాజిట్ చేసేందుకు ఎగబడటమే నోట్ల రద్దు విజయవంతమైందని తెలిపేందుకు రుజువని ఆయన అన్నారు. ఫలితంగా ఆదాయపు పన్ను వసూళ్లు పెరిగాయని జైట్లీ తెలిపారు. ఈ సొమ్ముతో దేశంలో పలు అభివృద్ధి పనులు మొదలయ్యాయని వివరించారు. నగదుకు అసలు యజమానుల గుర్తింపు తమ నిర్ణయంతో సుసాధ్యమైందని ఆయన అన్నారు. ఆర్‌బీఐ వార్షిక నివేదికలో రద్దు చేసిన నోట్లలో దాదాపు 99 శాతం నోట్లు తిరిగి తమ వద్దకు వచ్చినట్టుగా వెల్లడించిన నేపథ్యంలో జైట్లీ రద్దు అంశంపై వివరణనిచ్చారు. తద్వారా రాజకీయ పార్టీల నిధులపై ఆరా తీయనున్నట్టుగా పేర్కొన్నారు. నల్లధనాన్ని తిరిగి వ్యవస్థలోకి తీసుకువచ్చే విషయంలో ప్రజలు సరిగా అర్థం చేసుకోలేదని వివరించారు. ఆర్థిక వ్యవస్థలో నగదు వినియోగం తగ్గింది, డిజిటలీకరణ ప్రోత్సాహించడంతో పాటు పన్ను పరిధిని విస్తరించడమే పెద్ద నోట్ల రద్దు ప్రధాన ఉద్దేశమని జైట్లీ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యధికులు తమ లావాదేవీలను పూర్తిగా పారదర్శకతతో నిర్వహించేందుకు ఇష్ట పడుతున్నారని ఆయన అన్నారు. ఐటీ, జీఎస్టీ చెల్లింపులు పెరగడమే ఇందుకు తార్కాణమని జైట్లీ తెలిపారు.

చప్పగా ముగిసిన ఎన్‌టీపీసీ 'ఆఫర్'!



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి సంస్థ 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్'లో (ఎన్‌టీపీసీ) తాజా వాటా విక్రయం ద్వారా సర్కారు రూ.9,100 కోట్ల నిధులను సమీకరించింది. దాదాపు 82.4 కోట్ల షేర్లను 'ఆఫర్ ఫర్ సేల్' (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించి రూ.13,800 కోట్ల మేర నిధులను సమీకరించాలని సర్కారు నిర్ణయించింది. బుధవారం ఆఫర్ ముగిసే సమయానికి రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 73 శాతం స్పందన మాత్రమే లభించింది. ఆఫర్‌కు ఉంచిన మొత్తం 82.4 కోట్ల షేర్లకు గాను కేవలం 54.80 కోట్ల బిడ్లు మాత్రమే లభించడం సర్కారును నిరుత్సాహ పరిచింది. తాజా వాటా విక్రయంతో ఎన్‌టీపీసీలో సర్కారు వాటా 69.74 శాతం నుంచి 63.10 శాతానికి దిగి వచ్చింది. తాజా సమీకరణతో ఈ ఏడాదికి సర్కారు వాటాల విక్రయం ద్వారా సమీకరించిన మొత్తం రూ.19,000 కోట్ల మార్కును దాటేసింది.

ఐసీఐసీఐ టర్మ్ లోన్

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తిదారు ఎన్ టీపీసీకి ప్రయివేటు రంగ దిగ్గజ విత్త సంస్థ ఐసీఐసీఐ బ్యాంకు మధ్య రుణ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పం దంలో భాగంగా రూ.3,000 కోట్ల టర్మ్ లోన్‌ను తీసుకోనున్నట్లు ఎన్‌టీపీసీ ఒక ప్రకటనలో తెలిపి ంది. మొత్తం పదిహేనేండ్లకు ఈ ఒప్పందం కుదిరింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 28,000 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంలో ఎన్‌టీపీసీ ఈ నిధులను ఉపయోగించుకోనుంది.

స్టాక్ మార్కెట్లకు జీఎస్టీ మద్దతు

ముంబయి : అమెరికా, ఉత్తర కొరియాల మధ్య భౌగోలిక ఆందోళనలు కొంత సద్దుమనిగాయన్న వార్తలకు తోడు గత జులై మాసంలో జీఎస్టీ వసూళ్లు అంచనాలకు మించి పెరిగాయని జైట్లీ చేసిన ప్రకటన దేశీయ స్టాక్ మార్కెట్లకు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం బీఎస్ఇ సెన్సెక్స్ 258.07 పాయింట్లు లేదా 0.82 శాతం పెరిగి 31,646.46కు చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 88.35 పాయింట్లు పెరిగి 9,884 వద్ద ముగిసింది. బీఎస్ఈలో రంగాల వారిగా లోహ సూచీ అత్యధికంగా 2.64 శాతం రాణించింది. ఇదేక్రమంలో ఆయిల్ అండ్ గ్యాస్ 2.32 శాతం, రియాల్టీ 1.55 శాతం, పీఎస్‌యూ 1.39 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో రిలయన్స్ 2.12 శాతం, అదానీ పోర్ట్సు 1.94 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.83 శాతం, కోల్ ఇండియా 1.39 శాతం, టాటా స్టీల్ 1.35 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా 1.28 శాతం, పవర్ గ్రిడ్ 0.35 శాతం, ఎన్‌టీపీసీ 0.3 శాతం, సిప్లా 0.19 శాతం, డాక్టర్ రెడ్డీస్ 0.16 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

ఎయిరిండియాపై కన్నేసిన బర్డ్ గ్రూపు!

ఏఐ ట్రాన్స్‌పోర్ట్‌పై గురి పెట్టిన బహుళ సంస్థ

- ఏఐ ఎక్స్‌ప్రెస్ కొనుగోలుకు ఇండిగో రె'ఢీ'!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియా కొనుగోలుకు పలు సంస్థలు ముందుకు వచ్చినట్టుగా పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటుచేసిన అసోచామ్ ఏవియేషన్ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎయిరిండియా గ్రౌండ్ హాండ్లింగ్ అనుబంధ సంస్థ 'ఎయిరిండియా ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్' (ఏఐటీఎస్ఎల్) కొనుగోలుకు బర్డ్ గ్రూపు ఆసక్తి కనబరిచినట్టుగా ఆయన తెలిపారు. బర్డ్ గ్రూపు ఇప్పటికే దేశంలో పలు హోటల్స్ నిర్వహణతో పాటు విమానయాన రంగంలోనూ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. మరోవైపు ఏఐటీఎస్ఎల్ కొనుగోలుకు ఆసక్తి కనబరిచిన అంశాన్ని బర్డ్ గ్రూపు ధ్రువీకరించింది. ఇప్పటికే తాము ఈ రంగంలో ఉన్నందున ఎయిరిండియా గ్రౌండ్ హ్యాండ్లింగ్ విభాగంపై ఆసక్తి కనబరుస్తున్నట్టుగా బర్డ్ గ్రూపు అధికార ప్రతినిధి తెలిపారు. బర్డ్ గ్రూపు సంస్థ దేశంలోని ఏడు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. సంస్థ సాధారణ వృద్ధి ప్రణాళికలో భాగంగానే ఎయిరిండియా వైపు చూస్తున్నట్టుగా సమాచారం.



ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌పై ఇండిగో ఆసక్తి..

ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న ఇండిగో విమానయాన సంస్థ ఎయిరిండియా చౌక ధరల విమానయాన విభాగం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తోంది. ఈ విభాగం కొనుగోలుకు గాను బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు ఇండిగో సమాయత్త మవు తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ కొచ్చి కేంద్రంగా చౌకగా విమాన సేవలను అందిస్తోంది. దేశంలోని దాదాపు 13 భారత నగరాల నుంచి ఎక్స్‌ప్రెస్ విమానాలను నడిపిస్తోంది. ఎయిరిండియాలో వాటాల విక్రయానికి గాను కేంద్ర క్యాబినెట్ జూన్ 8న సమ్మతి తెలిపిన విషయం తెలిసిందే. దీంతో ఎయిరిండియా విక్రయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు సన్నాహాలను వేగవంతం చేసింది.

57 వేలమంది మళ్లీ సైన్యంలోకి..

న్యూఢిల్లీ: సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొంటున్న నేపథ్యంలో రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే తొలి దశలో భాగంగా 57 వేల మంది మాజీలను తిరిగి సైన్యంలోకి తీసుకోవాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. వీరిని కింది స్థాయి నుంచి ఆఫీసరు హోదా వరకు ఉన్న ఖాళీల్లో నియమించనున్నారు. ఆర్మీ ప్రక్షాళన కోసం గతేడాది మే లో అప్పటి కేంద్ర రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్ ఓ అధ్యయన కమిటీని నియమించారు. ఈ కమిటీకి లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డు) డిబి షేకాత్కర్ నేతృత్వం వహించారు. కాగా కమిటీ 99 ప్రతిపాదనలతో తన నివేదికను గతేడాది డిసెంబర్‌లో కేంద్రానికి సమర్పించింది. వీటిలో 65 ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. వీటన్నింటిని 2019 డిసెంబర్‌లోగా అమలు చేయాల్సి ఉన్నది. ఎన్‌సీసీ వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా కేంద్రం నిర్ణయించింది.

రిజర్వేషన్ కేటగిరిలో సీటుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్

రిజర్వేషన్ కేటగిరీలోని అభ్యర్థి ప్రతిభతో పొందిన సీటు తీసుకోనిపక్షంలో ఖాళీ అయ్యేప్పుడు ఆ సీటును అదే రిజర్వుడు కేటగిరీకి చెందిన అభ్యర్థితో భర్తీ చేసేందుకు ఉద్దేశించిన జీవో అంశాల్ని హైకోర్టు నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. 2001 నాటి జీవో ఎంఎస్ నెంబర్ 550లోని పేరా 5(2) అమలును న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, టి. రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. కేంద్రప్రభుత్వం, రమేశ్ రామ్‌ల మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలిస్తున్నట్టు బెంచ్ ప్రకటించింది. ఈ కేసులోని జీవోపై తమ వాదనల్ని తెలియజేయాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్‌టీఆర్ యూనివర్సిటీ వైస్ చైర్మన్, రిజిస్ట్రార్, నీట్ -2017 కన్వీనర్‌లను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

వీలైనంత త్వరగా ప్రాజెక్టుల పూర్తి

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు సకాలంలో పూర్తి అయితే ప్రజలందరికీ మేలు జరుగుతుందని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఉన్నతాధికారులు అన్నారు. అదే సమయంలో అనుమతుల కోసం నెలలు, సంవత్సరాల తరబడి ఆలస్యం చేస్తే ఆ ప్రాజెక్టుల ప్రయోజనం చేకూరదన్నారు. బుధవారం హైదరాబాద్ అరణ్య భవన్‌లో వివిధ రకాల ప్రభుత్వ ప్రాజెక్టులు, అటవీ అనుమతుల తాజా స్థితిపై సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ రీజనల్ ఆఫీసర్ (చెన్నై) రామ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చిన్న చిన్న కారణాలతో అనుమతుల్లో జాప్యం జరగటం వల్ల ప్రాజెక్టుల అనుకున్న లక్ష్యం నెరవేరదని, ప్రజలకూ ఆ ఫలాలు అందవని రామ్ గోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఇప్పటికే 263 ప్రాజెక్టుల పనులకు రెండో దశ అనుమతులు సాధించిందని ఇందులో రోడ్లకు సంబంధించిన పనులు 51, ఇరిగేషన్ 46, విద్యుత్ 27, మిషన్ భగీరథ 11 పనులు ఉన్నట్టు వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటైన మూడేండ్లలోనే 37 ప్రాజెక్టులకు ప్రభుత్వం తుది అటవీ, పర్యావరణ అనుమతులు కేంద్రం నుంచి సాధిం చటం గొప్ప విషయమని ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పీ.కె. ఝా వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్. శోభ, అన్ని జిల్లాలకు చెందిన అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది తుగ్లక్ పాలన : బీజేపీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి కేసీఆర్‌ది తుగ్లక్ పాలన అని బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. బుధవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసర్వే కోసం కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి రూ.255 కోట్లను మంజూరు చేసిందని, దానిలో భాగంగా గత ఏడాది రూ.85 కోట్ల నిధుల్ని విడుదల చేసిందని చెప్పారు. కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆ పనికి ఖర్చు చేయకుండా, నిధుల్ని దారిమళ్లించిందని విమర్శించారు. గత మూడు రోజులుగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయట్లేదని, జీవో 39 ద్వారా భూమి హక్కుల్ని హరిస్తూ, సర్వే పేరుతో ఎక్కడా భౌతిక రికార్డులు తనిఖీ చేయకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనల్లో ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని చెప్పారు.

భగీరథకు 'పంద్రాగస్టు' మొండిచెయ్యి

అవార్డులు రాకపోవడంపై అసంతృప్తి

- సీఎం దృష్టికి వ్యవహారం ?



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టుకు పంద్రాగస్టు సందర్భంగా అవార్డు రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఇన్సెంటివ్ కమిటీ భగీరథ ఇంజినీర్లు,అధికారులు, ఇతర ఉద్యోగులు, సిబ్బందికి మొండిచెయ్యి చూపింది. ఆన్‌లైన్ ద్వారా ఇన్సెంటివ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇన్‌సెంటివ్ కమిటీ చైర్మెన్ బీపీ ఆచార్య, కన్వీనర్ శాలినీమిశ్రా, పశుసంవర్ధక శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌చందా, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె రామకృష్ణారావు ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యుల కమిటీ కోరింది. అయితే మిషన్ భగీరథ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న భగీరథ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లను ఈ ఇన్‌సెంటివ్ కమిటీ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కావాలనే కమిటీలోని ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి పంద్రాగస్టు సందర్భంగా భగీరథ ప్రాజెక్టుకు అవార్డు రాకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. ఇందులో ఏఈ దగ్గర నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ వరకు నిమగ్నమయ్యారు. అయితే ఎప్పటికప్పుడు షెడ్యూళ్లు ఇస్తూ వర్క్ ఏజెన్సీలతో పనులు చేయిస్తున్నా, తమను ఇన్సెంటివ్ కమిటీ పట్టించుకోలేదనే ఆవేదన ఇంజినీర్లల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాల్లోనూ ఈ అవార్డులు ప్రకటించారు. ఎక్కడా భగీరథ యంత్రాంగానికి అవార్డులు దక్కలేదు. రాత్రి పగలూ కష్టపడుతున్నా ప్రభుత్వం తమను గుర్తించలేదనే భావనలో భగీరథ ఇంజినీర్లు ఉన్నారు. నిబంధనల మేరకు డాక్యుమెంట్లు, ఫోటోలు, ఇతర అవార్డు వివరాలతోపాటు తమ విశిష్టతలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు అంటున్నారు. అయినా తమకు అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకింత నిరసన వ్యక్తమవుతున్నది. తాము సెలవులను ఎప్పుడో మరిచిపోయామని, నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలతో భగీరథ పనులను పరిగెత్తిస్తున్నామని పేరు రాయడానికి ఇష్టపడని ఓ సీనియర్ ఇంజినీర్ చెప్పారు. వాణిజ్య బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థల నుంచి రుణాలు సమకూర్చడం, వర్క్ ఏజెన్సీలను సమన్వయం చేయడం అంత సులభమైన పనేమి కాదనే సంగతిని ఇటు ప్రభుత్వం, అటు ఇన్సెంటీవ్ కమిటీ గుర్తించలేదని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నాబార్డు, హాడ్కో సంస్థలు సైతం రెండుసార్లు భగీరథ ప్రాజెక్టుకు అవార్డు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి భగీరథ నీళ్లు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగబోనని పదే పదే చెబుతున్నారని, ఇది ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని ఇంజినీర్లపై నమ్మకం లేదా ? అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి ఇటీవల జరిగిన భగీరథ పనుల సమీక్షా సమావేశం సందర్భంగా తీసుకెళ్లినట్టు తెలిసింది. ఇంజినీర్లు, అధికారులు, ఉద్యోగుల్లో జరుగుతున్న చర్చ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. అది ప్రభుత్వ నిర్ణయమని, ఇందులో తాము చేసేదేమి లేదని చెప్పారు.

నవంబర్‌లో రేషన్ లిఫ్టింగ్ బంద్

- అక్టోబర్ 28న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ: ఆలిండియా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.రాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయస్థాయిలో రేషన్ వ్యవస్థ ఒకే విధానంగా ఉండాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నవంబర్‌లో రేషన్ లిఫ్టింగ్ బంద్ చేస్తున్నామని ఆలిండియా రేషన్ డీలర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అదక్షులు నాయికోటి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని భాగ్గాభవన్‌లో రేషన్ డీల్లర్ అసోసియేషన్ జాతీయ కమిటీ సమావేశం జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర అధ్యక్షులు. కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీ పలు తీర్మానాలు చేసింది. భారత దేశంలో రేషన్ వ్యవస్థ ఒకే విధానంగా ఉండాలని, డీలర్లను సివిల్ సప్లైయ్ ఉద్యోగులుగా గుర్తించాలని. లేదా గౌరవ వేతనం చెల్లించాలని, గ్రామాల్లో డీలర్లకు రూ.40 వేలు. మునిసిపల్‌లో రూ.50 వేలు, గ్రేటర్‌లో రూ.60వేల చెల్లించాలని తీర్మానించినట్టు తెలిపారు. రేషన్ దుకాణాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని, డీలర్లకు హెల్త్‌కార్డులు. ఇంటి స్థలాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కలిపించాలని, ఈ పాస్ మిషన్‌ల ద్వారా డీల్లర్లు నిజాయతీగా పని చేస్తున్నారని, నిర్వహణ ఖర్చులు, చాలి చాలని కమీషన్‌తో చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నవంబర్‌లో జరిగే రేషన్ లిఫ్టింగ్ బంద్ కార్యక్రమాన్ని రాష్టంలోని డీలర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాగా, ఆలిండియా కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఒకే విధంగా రేషన్ విధానం ఉండాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 28న హైదరాబాద్‌లో భారీ బహిరంగంగా సభ నిర్వహిస్తున్నామని నాయికోటి రాజు తెలిపారు. డీలర్లు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

'భట్టి' మాటలు వట్టి బూటకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భట్టి విక్రమార్క మాటలు వట్టి బూటకమని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ స్పష్టం చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడమేమోకానీ, కనీసం గ్రామ వార్డులు సభ్యులు కూడా ఆ పార్టీలో చేరరని తేల్చిచెప్పారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో బుధవా రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని భట్టీ చేసిన వ్యాఖ్యలపై ఆయన పై విధంగా స్పందించారు.

ఖాకీలకు క్వశ్చనీర్

- పోలీసుల మానసిక స్థితి అంచనాకు.. అంశాల ఆధారంగా నిపుణులతో కౌన్సెలింగ్..వైద్య పరీక్షలు
- పైలెట్ దశలో నాలుగు కేంద్రాల ఏర్పాటు
- పోలీసుల్లో స్ట్రెస్‌ను తగ్గించే కార్యాచరణ
- అదనపు డీజీ జితేందర్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ



(ఫైల్)

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

పోలీసులలో విధి నిర్వహణ పరంగా ఎదురవుతున్న మానసిక, శారీరక వత్తిడులను శాస్త్రీయంగా విశ్లేషించడానికి శాస్త్రీయమైన క్వశ్చనీర్(ప్రశ్నావళి)ని పోలీసు ఉన్నతాధికారులు రూపొందించారు. దీని ద్వారా పోలీసుల మానసిక స్థితిని అంచనా వేసి దానికి తగిన కౌన్సెలింగ్‌ను నిపుణుల ద్వారా ఇప్పించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర కార్యాచరణను ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమి డైరెక్టర్, అదనపు డీజీ జితేందర్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ తయారు చేసింది. రాష్ట్రంలో గత మూడేండ్ల కాలంలో ఏడుగురికి పైగా సబ్ ఇన్‌స్పెక్టర్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన విషయం విదితమే. వీటితోపాటు అనేక సందర్భాలలో పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ సమస్యలపై నిరసన తెలిపే ఆందోళన కారులు, మరో వైపు వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకున్న నిందితులు, అనుమానితులపై అదుపు తప్పి బలప్రయోగం చేయడం వంటి చర్యలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవల సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని కుక్కునూరు పల్లి పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తన ఇంట్లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోవడం, బ్యూటీషియన్ శిరీష ఆత్మహత్య ఘటనలో అతనిపై వచ్చిన ఆరోపణల కంటే ఉన్నతాధికారులు లంచం కోసం ఎస్ఐపై తీసుకు వచ్చిన వత్తిడిని భరించలేకే ఆత్మహత్యకు పాల్పడినట్టు బలమైన ఆరోపణలు అతని కుటుంబసభ్యులు, ఇతర ఎస్ఐ వర్గాల నుంచి వచ్చాయి. ఈ తీరులోనే కెకెపల్లికి చెందిన మరో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, అదిలాబద్ ఎస్ఐ శ్రీధర్,కరీంనగర్ ఎస్ఐ సురేందర్‌రెడ్డి, యాలాల్ ఎస్ఐ రమేష్, దుబ్బాక ఎస్ఐ చిట్టిబాబు మొదలైన వారు వివిధ కారణాల చేత ఆత్మహత్యలకు పాల్పడటం పోలీసు రాష్ట్ర హోంశాఖను కుదిపేసింది. నాయకత్వ శ్రేణిలో ఉన్న ఎస్ఐ స్థాయి అధికారులు ఆవేశంతోనో , భావోద్వేగంతోనో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పోలీసు వర్గాల్లో వినిపిస్తున్నది. దేశంలోనే బెస్ట్ పోలీస్‌గా కీర్తి పొందిన రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చేలా మారింది. ఈ పరిస్థితిని నివారించడానికి గాను అదనపు డీజీ జితేందర్ నేతృత్వంలో, ట్రైనింగ్ విభాగం ఐజీ చారూసిన్హా కో ఆర్డినేటర్‌గా సీనియర్ పోలీసు అధికారులు, ఇతర నిపుణులతో ఒక అధ్యయన కమిటీని డీజీపీ గత నెలలో ఏర్పాటు చేశారు. విధినిర్వహణతో పాటు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఎలాంటి వత్తిడిలను ఎస్ఐలు,ఆపై అధికారులు ఎదుర్కొంటున్నది అంచనా వేయడం, దీని ద్వారా తేలిన అంశాలపై తగిన కౌన్సిలింగ్‌ను ఎలా నిర్వహించాలన్న కోణంలో జితేందర్ కమిటీ ఒక కార్యాచరణను రూపొందించింది. దాని ప్రకారం ఒక పైలెట్ దశగా ఒక కార్యాచరణను ఈ కమిటీ రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి ఎస్ఐకి శాస్త్రీయంగా రూపొందించిన ఒక క్వశ్చనీర్(ప్రశ్నావళి)ని అందచేస్తారు. అందులో విధినిర్వహణ క్రమం నుంచి వ్యక్తిగత అంశాల వరకు పలు ప్రశ్నలకు ఎస్ఐలు ఇచ్చే సమాధానాలను ఒక్కొక్కటిగా నిపుణులతో విశ్లేషిస్తారు. వారిచ్చిన రిపోర్టు ఆధారంగా ఒక్కో గ్రూపులో 25 మంది ఎస్ఐలను ఎంపిక చేసి వారికి కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తారు. అందులో తేలే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని అవసరమైన వారికి వైద్య పరీక్షలు, తర్వాత చికిత్సను కూడా చేయిస్తారు ఈ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి నాలుగు ఎంటర్‌లు అంబర్‌పేట్ సీపీఎల్, యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్, సిద్ధిపేట్, మేడ్చల్‌లలో నాలుగు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు వందలకు పైగా సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు ఈ విధానం ద్వారా వారిలో ఎమోషనల్, ఫీజికల్, మెంటల్ స్ట్రెస్‌లను అంచనా వేసి తగిన కౌన్సెలింగ్‌ను ఇవ్వనునన్నామని ఈ సంధర్భంగా అదనపు డీజీ జితేందర్, ఐజీ చారూసిన్హాలు నవ తెలంగాణతో మాట్లాడుతూ తెలిపారు. పైలెట్ దశలో నాలుగు సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని, తర్వాత వాటిని విస్తరిస్తామని వారు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రముఖ మానసిక నిపుణులతో పాటు పేరుమోసిన వైద్యులను కూడా భాగస్వామ్యం చేసి క్వశ్చనీర్‌ను రూపొందించామని తెలిపారు. ఎస్ఐల అనంతరం ఇన్‌స్పెక్టర్లు, డీఎస్‌పీలకు కూడా ఈ విధానాన్ని అమలు చేసే యోచన ఉందన్నారు. అలాగే కింది స్థాయి కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కూడా క్వశ్చనీర్ ద్వారా వారిలోని మానసిక స్థితిగతులను అంచనా వేసి తదుపరి కార్యాచరణను రూపొందించే యోచనలో డీజీపీ అనురాగ్‌శర్మ ఉన్నారు. కాగా గణేష్ సామూహిక నిమజ్జనోత్సవం వచ్చే నెల ఐదవ తేదీన ముగిసాక తమ పైలెట్ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకు వస్తామని పోలీసు అకాడమీ డైరెక్టర్ జితేందర్ తెలిపారు.

భారీ వర్షాలున్నాయి.. జాగ్రత్త!

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో చాలా చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 27-32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 20-26 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. రాబోయే రెండు రోజుల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 31 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాల దృష్ట్యా రైతులు తగిన జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలి.

సాగు సూచనలు

- ✓ వరిలో ముదురు నారు వేసేటప్పుడు కుదుర్లు దగ్గర దగ్గరగా ఉండాలి. చదరపు మీటరుకు 44 కుదుర్లు, కుదురుకు 4-5 మొక్కలు ఉండేలా కొనలు తుంచి నాటుకోవాలి. నాటు వేసిన నాలుగు రోజుల్లో ఎకరానికి ఒక లీటరు బ్యూటక్లోర్ లేదా 35 గ్రాముల ఆగ్జాడైఅర్జిల్ లేదా 400 మి.లీటర్ల ప్రిటిలాక్లోర్ లేదా 4.0 కిలోల బెన్ సల్ఫురాన్ మిథైల్ 0.6 శాతం, ప్రిటిలాక్లోర్ 6శాతం గుళికల మిశ్రమాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో నీరు పల్చగా ఉండేటట్టు చూసుకొని వేయాలి. కలుపు మందు వేసిన రెండు నుంచి మూడు రోజుల వరకు పొలంలో నుంచి నీరు బయటకు పోకుండా చూడాలి. నాటిన 20 నుంచి 30 రోజుల మధ్య ఎకరానికి కార్బోఫురాన్ 3జీ గుళికలు 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ గుళికలు 4 కిలోల చొప్పున 20 కిలోల ఇసుకలో కలిపి వేస్తే కాండం తొలిచే పురుగు, ఆకుచుట్టు పురుగును నివారించొచ్చు. అలాగే తాటాకు తెగులు నివారణకు 2 మి.లీటర్ల ప్రొఫినోఫాస్ లేదా 2.5 మి.లీటర్ల క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గత వారం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరిలో ఆకునల్లి ఉధృతి గమనించడమైంది. దీని నివారణకు లీటరు నీటిలో 5 మి.లీటర్ల డైకోఫాల్ లేదా ఒక మి.లీటరు స్పైరోనోమేసిఫిన్ కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అగ్గి తెగులు సోకే సూచనలున్నాయి. దీని నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాము ట్రైసైక్లాజోల్ లేదా 0.5 మి.లీటరు ఐసోప్రొథైయోలిన్ లేదా 2.5 మి.లీటరు కాసుగామైసిన్ కలిపి పిచికారీ చేయాలి.

వ్యవసాయం.. వాతావరణం

- ✓ ఇటీవల కురిసిన వర్షాలను ఉపయోగించుకుని పూత దశలో ఉన్న మొక్కజొన్న పైరుకు ఎకరానికి 45 నుంచి 50 కిలోల యూరియా, 30 నుంచి 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ని పైపాటుగా వేసుకోవాలి. పైరు 60 రోజుల దశలో ఎకరానికి 50 కిలోల యూరియా, 15 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలి. దీర్ఘకాలం బెట్ట తర్వాత అధిక వర్షం కురిసిన పరిస్థితుల్లో ముఖ్యంగా ఆకస్మాత్తుగా మొక్కలు ఎండిపోవడం గమనించడమైంది. దీని నివారణకు సాధ్యమైనంత త్వరగా పొలంలో నీరు తీసేయాలి. అనంతరం అంతర కృషి చేయాలి. లీటరు నీటిలో పొటాషియం 10 గ్రాముల నైట్రేట్ లేదా 10 గ్రాముల పాలిఫిడ్ కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కొన్ని ప్రాంతాల్లో ఎండు తెగులు (ఫ్యుజేరియం బూజు) సోకినట్టు గమనిండమైంది. మొక్క వేరు భాగం చీల్చి చూసినట్టయితే గోధుమ రంగు ధారలు కనిపిస్తాయి. నివారణకు 10 లీటర్ల నీటిలో 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 2 గ్రాముల ప్లాంటామైసిన్, ఒక గ్రాము స్ట్రెప్టోమైసిన్ కలిపి మొక్క అడుగు భాగం బాగా తడిచేలా పిచికారీ చేయాలి. 2.5 గ్రాముల స్ప్రింట్ లేదా సాఫ్ ఒక కిలో యూరియాలో కలిపి మొక్క మొదళ్ల దగ్గర వేయాలి.
- ✓ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. పైరు 60వ రోజు దశలో ఉన్నట్టయితే నివారణకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో అంటే.. 1 పాళ్లు మందు, 4 పాళ్ల నీరు లేదా ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో అంటే..1 పాళ్లు మందు, 20 పాళ్లు నీరు కలిపి మెత్తటి బ్రష్ సహాయంతో కాండం లేదా భాగంలో బొట్టులాగా పూయాలి. ఒకవేళ పైరు 60 రోజులపైన ఉన్నట్టయితే లీటరు నీటిలో 2 మి.లీటర్ల ఫిప్రోనిల్ లేదా 0.2 గ్రాము ఎసిటామిప్రిడ్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్, 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫేస్ కలిపి పిచికారీ చేయాలి.



- ✓ కంది, పెసర, మినుము పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. కందిలో ఆకు చుట్టు పురుగు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల అసిఫేట్ లేదా 2 మి.లీటర్ల క్లోరోపైరిఫాస్, ఒక మి.లీటరు డైక్లోరోవాస్ కలిపి పిచికారీ చేయాలి.
- ✓ ఇప్పుడున్న వాతావరణ నేపథ్యంలో సోయాచిక్కుడు పైరులో కాండం తొలిచే ఈగ ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటిలో 2.0 మి.లీటర్ల ప్రొఫెనోఫాస్, ఒక మి.లీటరు డైక్లోరోవాస్ లేదా 0.3 మి.లీటరు క్లోరాన్ట్రనిలిప్రోల్ కలిపి పిచికారీ చేయాలి. కొన్ని ప్రాంతాల్లో పొగాకు లద్దెపురుగు, శనగ పచ్చ పురుగు సోకి కాయల్లో రంధ్రాలు చేసి నష్టం కలుగజేస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో 0.3 మి.లీటరు క్లోరాన్ట్రనిలిప్రోల్ కలిపి పిచికారీ చేయాలి.
- ✓ వాతావరణంలో మార్పు వచ్చిన దృష్ట్యా ఆముదం పంటను బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యగా ఒక గ్రాము కార్బండజిమ్ లేదా ఒక మి.లీటరు ప్రొపికొనజోల్ మందును వర్షం కురవడానికి 6 నుంచి 8 గంటల ముందుగా, వర్షం కురిసిన తర్వాత 6 నుంచి 8 గంటల వ్యవధిలో లీటరు నీటికి కలిపి మొక్క అన్ని భాగాలు తడిచేలా పిచికారీ చేయాలి. ఇదే పంటలో పొగాకు లద్దె పురుగు ఉనికిని గమనించడమైంది. దీని నివారణకు పొలంలో ఎకరానికి 10 పక్షిస్థావరాలను అమర్చాలి. లీటరు నీటిలో 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా ఒక మి.లీటరు నోవాల్యూరాన్ లేదా 1.5 గ్రాము బయోడికార్బ్ మందును కలిపి పిచికారీ చేయాలి.
- ✓ ప్రస్తుత పరిస్థితుల్లో బెండ, వంగ, టమాట తదితర కూరగాయల పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. దీని నివారణకు ఎకరానికి 10 నుంచి 20 మైనం పూసిన పసుపు రంగు అట్టలను పెట్టాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటిలో 2 మి.లీటర్ల డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి. వంగ, బెండలో కాయ తొలిచే పురుగు ఉధృతి పెరిగే ప్రమాదముంది. తల్లి పురుగు నివారణకు ఎకరానికి 40 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. వంగలో పురుగు ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటిలో 0.4 మి.లీటరు ఫ్లుబెండమైడ్ లేదా 2 మి.లీటరు ప్రొఫినోఫాస్ కలిపి పిచికారీ చేయాలి. దోసజాతి కూరగాయల్లో పెంకు పురుగు ఉధృతి పెరిగే సూచనాలున్నాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల క్లోరోపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అన్ని కూరగాయల్లో ఆకు మచ్చ తెగులు సోకే సూచనలున్నాయి. ముందు జాగ్రత్తగా లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండజిమ్ లేదా 2 మి.లీటర్ల సాఫ్ కలిపి పిచికారీ చేయాలి.
- ✓ కోళ్లలో కొక్కెర తెగులు, గొర్రెల్లో చిటుకు, మశూచి వ్యాధులు, ఆవులు, బర్రెలకు గొంతు వాపు, గాలికుంటు వ్యాధులు వచ్చేందుకు అనుకూలం. సకాలంలో టీకాలు వేయించి జీవాలను సంరక్షించుకోవాలి.

సేకరణ: మోత్కూరి యాదయ్య

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.

ఫోన్: 8332995392, kisan@navatelangana.com



క్యాబేజీ సాగుకు చల్లని వాతావరణం అనుకూలం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్నిచ్చే పంట ఇది. కొద్దిపాటి మెళకువలు పాటిస్తే చాలు.. అధిగ దిగుబడిని సాధించుకోవచ్చు. చీడపీడల నివారణపై దృష్టిసారిస్తే మంచి ఆదాయాన్ని పొందొచ్చు.

చీడపీడలపై నజర్ పెడితే చాలు...

క్యాబేజీ సాగుకు తేమ గల వాతావరణం అనువుగా ఉంటుంది. పగటి గరిష్ట ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్ మించకుండా ఉంటే ఎక్కువ దిగుబడి వస్తుంది. ఈ పంటకు చౌడు క్షార నేలలు పనికిరావు. ఇసుకతో కూడిన బంక నేలలు రబీలో ముందుగా వేసే పంటలకు అనుకూలం. సారవంతమైన గుల్ల, ఒండ్రు నేలలు అధిక దిగుబడినిస్తాయి. ఉదజని సూచిక 5.5 నుంచి 6.5 ఉన్న నేలలు బాగా అనువుగా ఉంటాయి. ఎకరం పంటకు విత్తనాలు సూటి రకాలు 300 గ్రాములు, హైబ్రీడ్ రకాలు 100 నుంచి 150 గ్రాములు సరిపోతాయి. కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్‌ని కలిపి విత్తనశుద్ధి చేయాలి.



రకాలు

గోల్డెన్ ఏకర్: దీని మొక్కలు గుబురుగా, చిన్నగా ఉంటాయి. కాండం పొట్టిగా ఉండి కొన్ని ఆకులు కలిగి ఉంటుంది. గడ్డ గట్టిగా, గుండ్రంగా ఉంటుంది. కిలో నుంచి కిలోన్నర బరువు కలిగి ఉంటుంది. 60 నుంచి 65 రోజుల్లో కోతకు వస్తుంది. కోతకు సిద్ధమైన వెంటనే గడ్డలు కోయాలి. లేదంటే వాటిల్లో పగుల్లు ఏర్పడతాయి.

ఎర్లీడ్రమ్ హెడ్: గడ్డ చదునుగా పెద్దదిగా ఉంటుంది. 60 నుంచి 70 రోజుల్లో కోతకొస్తుంది.

ప్రైడ్ ఆఫ్ ఇండియా: దీని గడ్డలు కూడా చదునుగా, పెద్దదిగా ఉంటాయి. 1.5 నుంచి రెండు కిలోల బరువుంటాయి. 60నుంచి 80 రోజుల్లో కోతకు వస్తాయి.

హరిరాణిగోల్, గణేశ్‌గోల్ : ఇవి ఎఫ్1 హైబ్రీడ్ రకాలు. గడ్డ గట్టిగా ఉండి 85 నుంచి 90 రోజుల్లో కోతకొస్తుంది. ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.

లేట్ డ్రమ్ హెడ్: గడ్డలు పెద్దగా గుండ్రంగా ఉంటాయి. మధ్యకాలిక రకం. నల్లకుళ్లు తెగులును తట్టుకుంటుంది. 100 నుంచి 120 రోజుల్లో కోతకొస్తుంది.

పూసడ్రమ్‌హెడ్: గడ్డ చదునుగా ఉంటుంది. దీర్ఘకాలిక రకం. 120 రోజుల్లో కోతకొస్తుంది.

పూసముక్త (సెలక్షన్-8): గడ్డ గట్టిగా ఉంటుంది. ఒక్కో గడ్డ 2 కిలోల బరువు ఉంటుంది. బ్యాక్టీరియా నల్లకుళ్లు తెగులును తట్టు కుంటుంది. నల్లకుళ్లు తెగులు సమస్య ఉన్న ప్రాంతాల్లో నాటుకోవడానికి ఈ రకం అనువైనది.

హైబ్రీడ్ రకాలు: బీఎస్ఎస్-150, బీఎస్ఎస్-126, మహికో, ఇండో అమెరికన్, నామ్‌ధారి, నాథ్‌లక్ష్మి-401,గ్రీన్ ఎక్స్‌ప్రెస్, సోనా, శ్వేత, అవంతి, గ్రీన్ ఛాలెంజ్, గీన్‌బోయ్, మీనాక్షి.

నాటుకునే కాలం: స్వల్పకాల రకాలకు ఆగస్టు రెండో పక్షం నుంచి సెప్టెంబరు చివరి వరకు, దీర్ఘకాలపు రకాలకు అక్టోబరు మొదటి పక్షం నుంచి నవంబరు చివరి వరకు నాటుకోవచ్చు.

నారుమడి: నేల అదునుకు వచ్చే వరకు నాలుగైదుసార్లు కలియదున్నాలి. 100 చ.మీటర్ల విస్తీర్ణంలో 25 నుంచి 30 గంపల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. 10 నుంచి 15 సెం.మీటర్ల ఎత్తు, 4సెం. మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమళ్లు తయారు చేయాలి. విత్తనాలను సన్నని ఇసుకతో కప్పాలి. విత్తనాలు మొలిచే వరకు (సుమారు వారం రోజుల వరకు) రోజూ నీరు పెట్టాలి. మొక్కలు మొలకెత్తిన తర్వాత ఎండిన ఆకులను తీసేయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా లీటరు నీటికి 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో నేలను తడపాలి. నారుమడిని ఆకు తినే పురుగు బారి నుంచి రక్షించేందుకు 2.5 మి.లీటర్ల మలాథియాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నాటటం: నేలను అదును వచ్చే వరకు బాగా దున్నాలి. సుమారు 10 నుంచి 15 రోజుల ముందు నేలను సిద్ధం చేసుకోవాలి. దీర్ఘకాలిక రకాలను 60X 45 సెం.మీటర్లు, స్వల్పకాలిక రకాలకు 45 X 45 సెం.మీటర్ల దూరాన్ని పాటించాలి. 25 నుంచి 30 రోజుల వయస్సు గల వారును జాగ్రత్తగా నాటుకోవాలి. నాటే ముందు తడి ఇవ్వాలి.

నీటి యాజమాన్యం: తేలిక నేలల్లో వారం రోజులకోసారి, బరువైన నేలల్లో 10 రోజులకోసారి (5-6 సెం.మీ) నీటి తడినివ్వాలి.

ఎరువులు: తొల దఫాగా ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 32 నుంచి 40 కిలోల భాస్వరం, 40కిలోల పొటాష్ ఎరువులను చివరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. 24 నుంచి 32 కిలోల నత్రజని, మూడు దఫాలుగా నాటిన 25 నుంచి 30రోజులకు మొదటిసారి, 50 నుంచి 60 రోజులకు రెండోసారి, దీర్ఘకాలిక రకాలైతే 75నుంచి 80 రోజులకు మూడోసారి వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు పెట్టాలి.

కలుపు నివారణ, అంతరకృషి: ఎకరానికి 1.25 లీటర్ల పెండీమిథాలిన్ 30శాతం లేదా అలాక్లోర్ తేలిక నేలలకు ఒక లీటరు, బరువు నేలలకు 1.2 లీటరు చొప్పున 200లీటర్ల నీటిలో కలిపి నాటిన 24నుంచి 48 గంటల్లోగా పిచికారీ చేయాలి. నాటిన 20 నుంచి 25 రోజులప్పుడు అంతర కృషి చేయాలి.

సస్యరక్షణ

రెక్కల పురుగు: ఇది ఆకుల అడుగు భాగాన ఉంటుంది. ఆకులను తిని నాశనం చేస్తుంది. దీని ప్రభావం వల్ల ఆకులు వాడి, ఎండి పోతాయి. రెక్కల పురుగులు చిన్నవిగా, ఆకుపచ్చ, గోధుమ రంగుల కలయికలో ఉండి పాలిపోతాయి. తెలుపు, రంగు, సన్నని ముందు రెక్కలు, పొడుగాటి వెంట్రుకలు కలిగిన వెనుక రెక్కలు కలిగి ఉంటాయి. పురగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరులో ఆకులన్నీ రంధ్రాలతో ఉండి, కాయ పరిమాణం చాలా చిన్నదిగా ఉంటుంది. దీని నివారణకు ప్రతి 25 వరుసలకు రెండు వరుసల చొప్పున ఆవ మొక్కలను ఎరపంటగా వేయాలి. గుడ్లను నాశనం చేసేందుకు వేపగింజల ద్రావణాన్ని (5శాతం) పిచికారీ చేయాలి. పురగు ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5గ్రాముల ఎసిఫేట్ లేదా 0.3 మి.లీటరు స్పైనోశాడ్ కలిపి కోతకు 15 రోజుల ముందు పిచిచారీ చేయాలి. నాటిన తర్వాత 45 రోజుల్లో లీటరు నీటిలో ఒక గ్రాము బీటీ మందులు కలిపి పిచికారీ చేయాలి.

పేనుబంక: ఈ పరుగులు ఆకుల అడుగు భాగాన గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల మలాథియాన్ లేదా డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ కలిపి పిచికారీ చేయాలి.

నారుకుళ్లు తెగులు: దీని కారణంగా నారు మొక్కల కాండపు మొదళ్లు మెత్తగా మారి, కుళ్లి, వడలిపోయి చనిపోతాయి. నివారణకు ఎత్తైన మడులపై నారును పెంచాలి. విత్తనం పలుచగా వరుసల్లో వేయాలి. ఎక్కువ నీటి తడులను ఇవ్వొద్దు. నారు మొలిచిన తర్వాత లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి.

నల్లకుళ్లు తెగులు: ఇది పంట ఏ దశలో ఉన్నా ఆశించొచ్చు. ఆకుల పత్ర హరితాన్ని కోల్పోయి మచ్చలు ఏర్పడతాయి. ఈనెలు నల్లగా మారు తాయి. దీని నివారణకు 10 లీటర్ల నీటికి ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందు కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఇదే మందును లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున కలిపి నారు నాటినప్పుడు, గడ్డ తయారవుతున్నప్పుడు పైరుపై పిచికారీ చేయాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందుతో మొక్కల మొదళ్ల చుట్టూ తడపాలి. ఎకరానికి ఐదు కిలోల బ్లీచింగ్ పౌడర్‌ని భూమిలో వేయాలి. ఏదైనా నూనె గింజల పంటతో రెండేళ్ల పాటు పంట మార్పిడి చేయాలి.

కోత : గడ్డలు తగిన పరిమాణంలో ఎదిగిన తర్వాత లేతగా ఉన్నప్పుడే కోయాలి.

దిగుబడి: ఎకరానికి 14 వేల నుంచి 16వేల కిలోలు.



– శిరీష, సైంటిస్ట్

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

వేరుపురుగు నాశిని 'ఫోరేట్'

పత్తిలో జింకు లోపం నివారణ ఎలా?
- జావీద్, తలమడుగు (ఆదిలాబాద్ జిల్లా)

ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ని ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నువ్వులు విత్తుకునేందుకు అనువైన కాలం?
- ఆంజనేయులు, సిద్దిపేట

నువ్వులు లేట్ ఖరీఫ్ అంటే ఆగస్టు నెలాఖరు వరకే విత్తుకోవాల్సి ఉంటుంది. శ్వేతాలిల్, హిమ, రాజేశ్వరి, చందన, ఎలమంచిలి 66, గౌరి, మాధవి వంటి రకాలు మేలైనవి.

కందిలో మేలైన రకాలు?
- ప్రసాద్, ఖమ్మం జిల్లా

ఎల్ఆర్‌జీ 42, లక్ష్మి, ఆశా, మారుతి, డబ్ల్యూఆర్‌జీ-27, పాలెం కంది, దుర్గ, సూర్య, వరంగల్ కంది-53, తాండూరు తెల్లకంది, రుద్రేశ్వరి, హనుమ, ఉజ్వల, మన్నెంకొండ కంది.

వరి ఆలస్యంగా నాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?
- తిరుమలి, పరిగి (వికరాబాద్ జిల్లా)

ఎకరానికి వేయాల్సిన నత్రజని మూడుసార్లు కాకుండా రెండు దఫాలుగా 50 శాతం దమ్ములో, 50 శాతం చిరు పొట్టదశలో వేయాలి. కుదురుకు 3 నుంచి 4 మొక్కలు పెట్టాలి. దగ్గర దగ్గరగా (15క్ష్మీ15 సెం.మీ) నాట్లు వేయాలి.

మిరపలో వేరుపురుగు నివారణ ఎలా?
- వీరన్న, పరకాల (వరంగల్ రూరల్ జిల్లా)

వేరుపురుగు, తల్లి పురుగులు తొలకరి వర్షాల సమయంలో పొలంలో మిరప చెట్లను ఆశిస్తాయి. బాగా ఎదిగిన పురుగు మొక్క వేర్లను కత్తిరిస్తుంది. తేలికపాటి నేలల్లో ఇది ఎక్కువగా ఆశిస్తుంది. మొక్కలు పీకితే సులువుగా ఊడి వస్తాయి. దీని నివారణకు ఫోరేట్ 10 శాతం గుళికలు ఎకరానికి 6 కిలోల చొప్పున వేయాలి.

మార్కెట్ ధరలు (క్వింటాకి రూ.లలో)

వేరుశనగ	
గద్వాల్	4,569
వరంగల్	4,400
సూర్యాపేట	4, 715

ఎండుమిర్చి (మొదటి రకం)	
హైదరాబాద్	8,000
వరంగల్	5,000
ఖమ్మం	4,300

ఎండుమిర్చి (రెండో రకం)	
హైదరాబాద్	5,000
వరంగల్	2,000
ఖమ్మం	1,500 (తాలు)

కందులు	
వరంగల్	4,327
సూర్యాపేట	4,513
ఖమ్మం	4,355

పసుపు (కొమ్ము)	
వరంగల్	7,025
నిజామాబాద్	7,837


పసుపు (గోళా)	
వరంగల్	6,625
నిజామాబాద్	7,455

మొక్కజొన్నలు	
కరీంనగర్	1,400
గాంధారి	1,365
కామారెడ్డి	1,365

మినుములు	
నారాయణపేట	5,319

ముడిపత్తి	
వరంగల్	5,170
జమ్మికుంట	5,400
ఖమ్మం	5,050
మహబూబాబాద్	5,295

పెసలు	
వరంగల్	4,279
నారాయణపేట	5.369
ఖమ్మం	4,700
జోగిపేట	4,721
సూర్యాపేట	5,059
జనగామ	4,850
తాండూరు	5,225



ఫెడరర్

చెమటోడ్చిన ఫెడరర్

స్పెయిన్ బుల్‌కు సునాయాస గెలుపు
జర్మనీ భామ కెర్బర్‌కు చుక్కెదురు
యు.ఎస్ ఓపెన్

న్యూయార్క్ : వెటరన్ టెన్నిస్ ఆటగాడు, మూడో సీడ్ స్విస్ యోధుడు రోజర్ ఫెడరర్ న్యూయార్క్‌లో చెమటోడ్చాడు. వెన్ను నొప్పితో సుమారు ఆరు మాసాలుగా కోర్టులోకి అడుగుపెట్టని ఫెడరర్ యు.ఎస్ ఓపెన్ తొలి రౌండ్లోనే గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. అమెరికా యువ ఆటగాడు ఫ్రాన్సెస్‌తో ఐదు సెట్ల పోరాటంలో గట్టెక్కాడు. 4-6, 6-2, 6-1, 1-6, 6-4తో ఫ్రాన్సెస్‌పై పైచేయి సాధించాడు. మరో వైపు టాప్ సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ అలవోక విజయంతో రెండో రౌండ్లోకి చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, మాజీ వరల్డ్ నెం.1 ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ)కు చుక్కెదురు. జర్మనీ యువ కెరటం చేతిలో కెర్బర్ అనూహ్య ఓటమి చవిచూసింది. తొలి రౌండ్ ఓటమితో యు.ఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది.

వింబుల్డన్ తర్వాత మళ్లీ విశ్రాంతి తీసుకుని యు.ఎస్ ఓపెన్‌కు వచ్చిన ఫెడరర్ తొలి రౌండ్లోనే కఠిన పోరు. తొలి సెట్‌ను నెగ్గిన ఫ్రాన్సెస్ సత్తా చాటగా, ఫెడరర్ తర్వాతి రెండు సెట్లు నెగ్గి గేమ్‌లో నిలిచాడు. 19 గ్రాండ్‌స్లామ్స్ విన్నర్‌ను హడలెత్తించిన ఫ్రాన్సెస్ (అమెరికా) సంచలనానికి అడుగు దూరంలో నిలిచిపోయాడు. రఫెల్ నడాల్ 7(8)-6(6), 6-2, 6-2తో డుసాన్ వాజోవిక్ (సెర్బియా)పై అలవోక విజయం సాధించాడు. అమెరికా ఆటగాడు శామ్ ఖుర్రే సైతం 6-4, 6-3, 6-4తో వరుస సెట్లలో సిమోన్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌కు షాక్. 3-6, 1-6తో 19 ఏండ్ల జపాన్ చిన్నది నవొమి ఒసాక మాజీ వరల్డ్ నెం.1ను ఓడించింది. కెర్బర్‌ను వరుస సెట్లలో కంగుతినిపించిన ఒసాక ఆశ్చర్యకరంగా సంచలన విజయానికి ఏమాత్రం సంబరపడలేదు!. టాప్ సీడ్ కరొలినా ప్లిస్కోవా 6-2, 6-1తో మగ్ద లినెట్టా (పొలాండ్)పై నెగ్గగా, మడిసన్ కీస్ 6-3, 7(8)-6(6)తో ఎలిసీ (బెల్జియం)పై విజయం సాధించింది. జెలినా ఒస్టాపెంకొ (లాత్వియా) 6-2, 1-6, 6-1తో సొరెనా (రొమానియా)పై పైచేయి సాధించింది.



మహేంద్రసింగ్ ధోని

హర్యానాపై ముంబయి గెలుపు

ముంబయి : వరుస విజయాలతో జోరు మీదున్న హర్యానాకు ముంబయి షాకిచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 38-32తో గెలుపొందింది. ఆరంభంలో 5-2, 11-7 తో ఆధిక్యంలో ఉన్నది ముంబయి. కాశీలింగ్, అనూప్ కుమార్, శ్రీకాంత్ జాదవ్‌లు వరుస రైడ్‌లు సాధించటంతో.. విరామ సమయానికి 20-15తో ముందుంది. విరామం తర్వాత మరింత దూకుడుగా ఆడటంతో 23-16కు దూసుకెళ్లింది. హర్యానా తరఫున బరిలోకి దిగిన ప్రత్యామ్నాయ ఆటగాడు దీపక్ దహియా 27-27తో స్కోరు సమం చేశాడు. దీంతో ఆత్మ రక్షణలో పడ్డ ముంబయికి అనూప్, కుల్దీప్‌లు వెన్నెముకలా నెలిచారు. చివరి నిమిషాల్లో పుంజుకున్న ముంబయి 34-30తో ప్రత్యర్థిని వెనక్కు నెట్టింది. అనూప్ కుమార్ ఎనిమిది రైడ్ల అద్భుత ఆటతీరుతో ముంబయిని విజయపథాన నిలిపాడు. ఐదు టాకిల్స్ చేసిన కుల్దీప్ సింగ్ ఆరు పాయింట్లు సాధించి యు ముంబ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వికాస్ ఖండోల తొమ్మిది రైడ్లతో రాణించినా బలహీన డిఫెన్స్‌తో స్టీలర్స్ ఓటమి మూటగట్టుకుంది. ఈ సీజన్‌లో హర్యానాకిది రెండో ఓటమి కాగా.. రెండు సార్లు ముంబయి చేతిలోనే ఓడటం విశేషం.

ప్రో కబడ్డీలో నేడు
హైదరాబాద్ X చెన్నై
రాత్రి 8 గంటలకు
ముంబయి X జైపూర్
రాత్రి 8 గంటలకు
వేదిక : ముంబయి
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం





బంగ్లా చారిత్రక విజయం

తొలి టెస్టులో ఆసీస్‌పై మెరుపు విజయం

- పది వికెట్లతో మెరిసిన షకిబ్
- డెవిడ్ వార్నర్ శతక శ్రమ వృథా

మీర్పూర్ : బంగ్లా బెబ్బులి గర్జించింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న బంగ్లాదేశ్..ఆ జోరును టెస్టు క్రికెట్‌లోనూ కొనసాగిస్తోంది. అగ్రశ్రేణి జట్టు ఆస్ట్రేలియాపై టెస్టు విజయం సాధించిన బంగ్లాదేశ్.. స్వదేశంలో సంబురాలకు తెరతీసింది. ఉత్కంఠగా సాగిన ఢాకా టెస్టులో షకిబ్ అల్ హసన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన వేళ ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. 265 పరుగుల ఛేదనలో 28/2తో ఆసీస్ కష్టాల్లో ఉన్నా డెవిడ్ వార్నర్ (112), కెప్టెన్ స్మిత్ (37)లు 130 పరుగులు జోడించారు. దీంతో ఆసీస్ విజయం నల్లేరుపై నడకే అనిపించింది. కానీ షకిబ్ అల్ హసన్ వరుసగా వార్నర్, స్మిత్ సహా మాక్స్‌వెల్ (14), మాథ్యూవేడ్ (4)లను పెవిలియన్‌కు చేర్చిన షకిబ్ ఆసీస్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టాడు. ఆఖర్లో పాట్ కమిన్స్ (33) పోరాడినా.. ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు. 158/2 నుంచి 199/8తో పతనమైన ఆస్ట్రేలియా టెస్టుల్లో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఓటమిపాలైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన షకిబ్ అల్ హసన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : 260 ఆలౌట్ (షకిబ్ 84, తమీమ్ ఇక్బాల్ 71, లియాన్ 3/79, కమిన్స్ 3/63)

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 217 ఆలౌట్ (రెన్షా 45, ఆగర్ 41, షకిబ్ 5/68, మిరాజ్ 3/62)

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ : 221 ఆలౌట్ (తమీబ్ ఇక్బాల్ 78, ముష్ఫికర్ 41, లియాన్ 6/82)

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 244 ఆలౌట్ (డెవిడ్ వార్నర్ 112, స్టీవ్ స్మిత్ 37, షకిబ్ 5/85)


బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రతజ పతకం సాధించిన పి.వి సింధును సీఎం కేసీఆర్ తన అధికారిక నివాసం ప్రగతి భవన్‌లో శాలువాతో సత్కరించారు. వచ్చే ఏడాది స్వర్ణం తీసుకురావాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. సింధు వెంట కోచ్ పుల్లెల గోపీచంద్ ఉన్నారు.

బ్లూ ఇండియాకు రైనా సారథ్యం

- సెప్టెంబర్ 7 నుంచి దులీప్ ట్రోఫీ

ముంబయి : సాంకేతిక కమిటీ ఛైర్మెన్ సౌరవ్ గంగూలీ జోక్యంతో బీసీసీఐ దులీప్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 29 వరకు లక్నో, కాన్పూర్ వేదికలుగా దులీప్ ట్రోఫీ జరుగనున్నది. ఇండియా బ్లూకు సురేశ్ రైనా సారథ్యం వహించనుండగా, రెడ్ జట్టుకు అభినవ్ ముకుంద్ కెప్టెన్సీ చేపట్టనున్నాడు. ఇండియా గ్రీన్‌కు పార్థీవ్ పటేల్‌లు నాయకుడిగా ఎంపికయ్యాడు. టెస్టు ఫార్మాట్‌లో జరిగే దులీప్ ట్రోఫీని ఈసారీ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో (డేనైట్), గులాబి బంతితో నిర్వహించనున్నారు. దులీప్ ట్రోఫీ హైదరాబాద్‌లో నిర్వహించాల్సి ఉన్నా..రాజీవ్ శుక్లా పట్టుబట్టి కాన్పూర్‌కు కేటాయించేలా చేసినట్టు సమాచారం!.

చూపులన్నీ 300 యోధుడిపైనే

300వ వన్డే ఆడనున్న మహేంద్రసింగ్ ధోని

మిస్టర్ కూల్, ముగింపు మొనగాడు నేడు ప్రేమదాస వన్డేతో కెరీర్ 300వ వన్డే ఆడబోతున్నాడు. తీవ్ర విమర్శల నడుమ శ్రీలంకలో అడుగుపెట్టిన ధోని, సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రతికూల పరిస్థితుల్లో భువి, రోహిత్‌లకు తోడు ఫినీషింగ్‌లో కొత్తగా సహాయక పాత్రను పోషించాడు. నేడు కోహ్లిసేన కొన్ని ప్రయోగాలు చేయనున్నా, 300 యోధుడిపైనే అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. మరి మహి ఆ స్పెషల్ అందిస్తాడా!

- శ్రీలంకతో నాల్గో వన్డే నేడు
- మధ్యాహ్నం 2.30 నుంచి సోనీసిక్స్‌లో ప్రసారం..

నవతెలంగాణ-కొలంబో

శ్రీలంకలో కోహ్లిసేన గెలుపు యాత్ర కొనసాగుతుండగా, మరోవైపు ఆతిథ్య దేశ క్రికెట్ అభిమానుల ఆందోళన సైతం ఆగటం లేదు. వరుస ఓటములతో సహనం కోల్పోయిన అభిమానులు పల్లెకెలెలో ఓ హద్దుదాటారు. అభినాగ్రహంతో శ్రీలంక సెలక్షన్ కమిటీ చీఫ్ సనత్ జయసూర్య సహా ఇతర సెలక్టర్లు రాజీనామా చేశారు. అయినా, శ్రీలంకలో పరిస్థితి సద్దుమణిగే పరిస్థితి కనిపించటం లేదు. కనీస పోటీ ఇచ్చే స్థాయి నుంచి ఇప్పుడు కనీసం తుది జట్టును సమకూర్చుకునేందుకూ లంకేయులు ఆపసోపాలు పడుతున్నారు. రెగ్యులర్ కెప్టెన్ ఉపుల్ తరంగపై వేటు పడగా, తాత్కాలిక కెప్టెన్ కపుగెదర గాయపడ్డాడు. టెస్టు కెప్టెన్ చండిమాల్ సైతం గాయంతో సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో లసిత్ మలింగ కొలంబోలో శ్రీలంకసేనకు నాయకత్వం వహించనున్నాడు. 3-0తో సిరీస్ సొంతం చేసుకున్న టీమ్ ఇండియా, నేడు ప్రయోగాలు చేసే వీలున్నది. బెంచ్‌కే పరిమితమైన యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

మిడిల్‌లోనే పరీక్ష : టాప్ ఆర్డర్‌లో శిఖర్ ధావన్, రోహిత్ శర్మ సహా విరాట్ కోహ్లిలు మంచి ఫామ్‌లో ఉన్నారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో భారత్ విఫలమవుతోంది. దీంతో నేటి వన్డేలో కోహ్లిసేన పరీక్షించుకోవాల్సింది మిడిల్ సామర్థ్యాన్నే!. నాల్గో స్థానంలో లోకేశ్ రాహుల్ కుదురుకునేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఇక కేదార్ జాదవ్ పూర్తిగా నిరాశపరిచాడు. దీంతో అతడి స్థానంలో మనీశ్ పాండే తుది జట్టులోకి వచ్చే అవకాశ ముంది. రాహుల్‌ను పక్కనపెట్టి రహానెకు చోటిస్తారా లేదా అనేది ఆసక్తికరం. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్ స్థానంలో శార్దుల్ ఠాకూర్, యుజ్వేందర్ చాహల్ స్థానంలో కుల్‌దీప్ యాదవ్‌లు ఆడే అవకాశం ఉంది. అన్నింటికి మించి 300వ వన్డే ఆడబోతున్న ఎం.ఎస్ ధోని నుంచి అభిమానులు స్పెషల్ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. దీంతో అవసరమైతే మహి బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొస్తాడేమో చూడాలి.

తుది జట్టు కష్టాలు : శ్రీలంక పరిస్థితి మరీ దయనీయంగా తయారవుతోంది. వరుసగా ఆటగాళ్లు గాయాలపాలవుతుంటే, తుది జట్టు కూర్పు సైతం కష్టమవుతోంది. అసలే కష్టకాలంలో ఉండగా, ఆపై సీనియర్ ఆటగాళ్లు దూరం కావటం లంకేయులకు మింగుడుపడటం లేదు. సీనియర్ బౌలర్ లసిత్ మలింగ నేడు జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. మునవీరా, వహిందు హసరంగ, చమీరాలు జట్టులోకి రానున్నారు. ఓపెనర్ నిరోశన్ డిక్‌వెల్లా నిలకడగా ఆడుతున్నా మరో ఎండ్‌లో అతడికి సహకారమే కరువైంది. అఖిల ధనంజయ మిస్టరీ మాయాజాలంతో మెరుస్తున్నా, అది విజయానికి దోహద పడటం లేదు. ఓవరాల్‌గా గెలుపు సూత్రం మర్చిపోయిన శ్రీలంక.. నేడు కూడా అండర్‌డాగ్‌గానే ఆడనున్నది.

వర్షం ముప్పు : ప్రేమదాస స్టేడియంలో గత మ్యాచుల్లో స్వల్ప స్కోర్లే నమోదయ్యాయి. నేటి వన్డేలోనూ స్పిన్, సీమ్‌కు అనుకూలించవచ్చు. ఇక సాయంత్రం సమయంలో భారీ వర్షం కురిసే ప్రమాదం పొంచి ఉన్నది. అవసరమైతే రెండో ఇన్నింగ్స్‌ను కుదించే వీలు లేకపోలేదు.

పటిష్ట భద్రత : పల్లెకెలె వన్డే చేదు అనుభవం నేపథ్యంలో కొలంబో ప్రేమదాస స్టేడియంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. మూడో వన్డే సందర్భంగా అభిమానులు మైదానంలోకి బాటిల్స్ విసిరి ఆటకు అంతరాయం కలిగించిన విషయం తెలిసిందే. దీంతో కొలంబోలో అటువంటి ఘటన పునరావృతం కాకుండా.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి (కెప్టెన్), లోకేశ్ రాహుల్, మనీశ్ పాండే, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్/భువనేశ్వర్ కుమార్, కుల్‌దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

శ్రీలంక : నిరోశన్ డిక్‌వెల్లా, దిల్షాన్ మునవీరా, కుశాల్ మెండిస్, లహిరు తిరిమానె, ఎంజెలో మాథ్యూస్, మిలింద సిరివర్దన, వహిందు హసరంగ, దుష్మంత చమీరా, అఖిల ధనంజయ, విశ్వ ఫెర్నాండో, లసిత్ మలింగ (కెప్టెన్).

వన్డేల్లో మహేంద్రుడు

మ్యాచులు	ఇన్నింగ్స్‌లు	పరుగులు	నాటౌట్లు	అత్యధిక స్కోరు
సగటు	100	50	-	-
299	257	9608	72	183
51.93	10	65	-	-

సచిన్ టెండూల్కర్ (463), రాహుల్ ద్రవిడ్ (344), సౌరవ్ గంగూలీ (334), యువరాజ్ సింగ్ (304) తర్వాత 300 వన్డేల క్లబ్‌లో చేరుతున్న ఆరో ఆటగాడు ఎం.ఎస్ ధోని.

ఐచ్ఛిక సెలవులపై అయోమయం

- ఒకే రోజు 30శాతం కంటే ఎక్కువ మంది తీసుకోవద్దని మెలిక
- ఆందోళనలో ఉపాధ్యాయులు

హైస్కూళ్లలో పరిమితులు విధించిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో ఐచ్ఛిక సెలవులపై అయోమయం నెలకొన్నది. ఇప్పటి వరకు వీటిపై పాఠశాలలే నిర్ణయించుకునే అధికారం ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి వాటికీ పరిమితులు విధించింది. 20ఏండ్ల నాటి పాత విధానాన్ని, మళ్లీ తెరమీదికి తీసుకురావడం పట్ల ఉపాధ్యాయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది.

రెండు రోజుల క్రితం 2017-18 అకడమిక్ క్యాలెండర్‌ను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. దానిలో ఉపాధ్యాయులను అయోమయానికి గురిచేసే విధంగా ఐచ్ఛిక సెలవుల విషయంలో ఉత్తర్వులిచ్చింది. ఈ సంవత్సరం 15 ఐచ్ఛిక సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరికీ ఏడాదిలో ఐదు ఐచ్ఛిక సెలవులు ఉపయోగించుకోవచ్చు. ఈ సెలవులను ఇప్పటి వరకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఏ ఏ రోజు వినియోగించుకుంటారనే విషయాన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు సమావేశమై నిర్ణయించుకుని, ఎంఈఓ, డీఈఓలకు తెలియజేస్తున్నారు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈసెలవులను ఎప్పుడు తీసుకోవాలనేది ఆ బడులే నిర్ణయించుకునే అవకాశమివ్వగా, హైస్కూళ్లకు మాత్రం మెలికపెట్టింది. ఐచ్ఛిక సెలవు దినాల్లో 30శాతం టీచర్ల కంటే ఎక్కువ మంది ఈసెలవు తీసుకోరాదని ఆదేశాల్లో పేర్కొన్నది. రాఖీపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, మొహర్రం (పీరీల పండుగ), నరకచతుర్దశి, క్రిస్మస్‌ఈవ్, బాక్సింగ్ డే, గురునానక్ జయంతి తదితర పండుగలు ఐచ్ఛిక సెలవుల జాబితాలో ఉన్నాయి. ప్రధానంగా కొన్ని పండుగలను మతాలకు, కులాలకు అతీతంగా జరుపుకుంటారు. రాఖీపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం లాంటి పండుగలు ప్రజలతో పాటు ఉపాధ్యాయులు కూడా నిర్వహించుకుంటారనే విషయాన్ని టీచర్లు గుర్తుచేస్తున్నారు. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 4583 హైస్కూళ్లలోని సుమారు 45వేల మంది టీచర్లపై ప్రభావం చూపుతున్నది. అయితే ప్రభుత్వమిచ్చిన కొత్త ఆదేశాలతో సెలవులు మంజూరు చేసే అధికారులకూ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. గతంలో 20ఏండ్ల కింద ఇలాంటి నిబంధనే ఉండగా, ఆ ఇబ్బందులను తప్పించుకునేందుకు పాఠశాలల వారిగా సెలవులు తీసుకునే అవకాశం విద్యాశాఖ కల్పించింది. అయితే తాజాగా పాత విధానాన్ని తెరమీదికి తీసుకురావడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఐచ్ఛిక సెలవులు ఉపాధ్యాయుల వ్యక్తిగతంగా కాకుండా పాఠశాలల వారిగా వినియోగించుకునే విధంగా ఉండాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


ఫైల్

పాత పద్ధతినే కొనసాగించాలి: టీఎస్‌యూటీఎఫ్

ఐచ్ఛిక సెలవులపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ నర్సిరెడ్డి, చావ రవి డిమాండ్ చేశారు. పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. సర్కారు నిబంధనతో టీచర్లతో పాటు అధికారులకు ఇబ్బందికరంగా మారిందని చెప్పారు.

పండుగలకు దూరం చేయొద్దు: టీటీఎఫ్

అకడమిక్ క్యాలెండర్‌లో పొందుపర్చిన ఐచ్చిన సెలవుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ అన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచించి, పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పిల్లలకు నష్టం: పీఆర్‌టీయూ

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనతో పిల్లలు నష్టపోయే అవకాశమున్నదని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి తెలిపారు. అకడమిక్ క్యాలెండర్‌పై విద్యాశాఖమంత్రి దగ్గర చర్చిస్తామని చెప్పి, నిర్ణయం ప్రకటించడం సరికాదని అన్నారు.

నేడు డిగ్రీ నాలుగో విడత సీట్ల కేటాయింపు

- 9,779 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో గురువారం నాలుగో విడత సీట్లను ఉన్నత విద్యామండలి కేటాయించనుంది. తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ఆ దిశగా కసరత్తు చేస్తున్నది. డిగ్రీ ఆన్‌లైన్ ప్రక్రియలో నాలుగోవిడతకు 9,779 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. మూడో విడతలో సీట్లు కేటాయించిన వారు, సీట్లు పొందని వారు 44,906 మంది విద్యార్థులున్నారు. వారిలో 8,876 మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చారు. కోర్టు పరిధిలో ఉన్న కాలేజీల్లో సీట్లు కేటాయించిన వారు 5,243 మంది విద్యార్థులున్నారు. వారిలో 903 మంది విద్యార్థులు నాలుగో విడతలో వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారు. దీంతో మొత్తం 9,779 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇచ్చారు. వారికి గురువారం సీట్లు కేటాయిస్తారు. వచ్చేనెల 1 నుంచి 4వ తేదీ వరకు విద్యార్థులకు కేటాయించిన కాలేజీల్లో చేరేందుకు గడువుంది. మూడో విడత నాటికి 1,87,368 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరారు.

ఆమెను వేధించిన నిందితులను శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆడపిల్ల పుట్టినందుకు రూ.10 లక్షల కట్నం తీసుకురావాలని ఇల్లాలిని వేధించిన అత్తమామలను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బీ.హైమావతి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బురిడీబాబా వైద్యం పేరుతో మోసం చేస్తూ వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటైన అంశమని వాపోయారు. కుటుంబ సభ్యులంతా మూఢవిశ్వాసాలకు లోనై ఫాతిమాను హింసించటం శోచనీయమన్నారు. పిండం ఆడ, మగ నిర్ణయించేది పురుషుని ద్వారా ఉత్పన్నమయ్యే ఎక్స్, వై క్రోమోజోములనేది తెలిపే విధంగా ప్రభుత్వాలు ప్రచారం చేయాలన్నారు. ఇక రాష్ట్రంలో విచ్చలివిడిగా పెరుగుతున్న బాబాలపై నిఘా ఉంచాలని సూచించారు. స్త్రీల అక్షరాస్యతను పెంచాలన్నారు. కానీ, ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న దృష్టి అక్షరాస్యతపై లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పాతబస్తీలో అరబ్‌షేక్‌ల అరాచకాలను, మూఢనమ్మకాలను అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని హైమావతి తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.